శుక్రవారం
14-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 172
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మార్క్సిస్టు
మహామహోపాధ్యాయుడు
కారల్ మార్క్స్
142వ వర్ధంతి
నేడు



ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

హయగ్రీవ భూములపై యథాతథ స్థితి

విశాలాంధ్ర-విజయవాడ: విశాఖపట్నంలో హయగ్రీవ ఫార్మ్ అండ్ డెవలపర్స్‌కు కేటాయించిన భూములపై యథాతథస్థితి పాటించాలని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం నుంచి రాయితీపై పొందిన భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా విల్లాలు నిర్మించారనే అభియోగాలతో హయగ్రీవ డెవలపర్స్‌కు భూ కేటాయింపులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఆ భూములను మరెవరికీ రిజిస్ట్రేషన్ చేయకుండా నిషేధిత జాబితాలో చేర్చింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ... హయగ్రీవ యాజమాన్యం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పరిశీలించిన హైకోర్టు... వాటిపై యథాతథ స్థితి పాటించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

తారస్థాయికి పసిడి ధర

న్యూఢిల్లీ: బంగారం ధర మళ్లీ పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో పెరిగిన డిమాండ్ కారణంగా దేశీయంగా పసిడి ధర తారస్థాయికి చేరింది. రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర గురువారం రూ.600 పెరిగి రూ.89,450కి చేరింది. ఫిబ్రవరి 20న రూ.89,450గా నమోదైంది. ఇప్పుడు 20 రోజుల తర్వాత మళ్లీ అదే స్థాయికి చేరింది. అటు వెండి ధర కూడా వెయ్యి రూపాయలు మేర పెరిగింది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూ.1,00,200గా ఉన్న వెండి ధర ఇప్పుడు రూ.1,01,20 0కు చేరి... ఐదు నెలల గరిష్ఠానికి సమానమైంది.

17 మంది మావోయిస్టుల లొంగుబాటు

బీజాపూర్: చత్తీస్‌గఢ్, బీజాపూర్ జిల్లాలో 17 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో తొమ్మిది మందిపై రూ.24 లక్షలు చొప్పున రివార్డున్నట్లు పోలీసులు తెలిపారు. సీఆర్‌పీఎఫ్ ఎదుట లొంగిపోయిన మావోయిస్టుల్లో మోస్ట్ వాంటెడ్ దినేశ్ మొడియం (36), అతడి భార్య జ్యోతి అలియాస్ కళా మొడియం (32) ఉన్నారన్నారు. దినేశ్‌పై రూ.8లక్షలు, జ్యోతిపై రూ.5లక్షలు చొప్పున రివార్డు ఉన్నట్లు బీజాపూర్ ఎస్‌ఎస్పీ జితేంద్ర కుమార్ వెల్లడించారు. ఏరియా కమిటీ సభ్యులు దుడ్డ కరంపై రూ.5లక్షలు, మరో ఆరుగురి తలలపై రూ.లక్ష చొప్పున రివార్డు ఉందన్నారు. వీరందరూ గంగలూరు ఏరియా కమిటీలో వివిధ హోదాల్లో పనిచేసినట్లు తెలిపారు.

ఐదుగురు ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో ఎమ్మెల్యే కోటాకు సంబంధించి ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ నుంచి దాసోజు శ్రవణ్ ఎన్నికయ్యారు. వీరు కాకుండా ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు నిబంధనల మేరకు లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. దీంతో ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

15 నుంచి ఒంటిపూట బడులు

హైదరాబాద్: తెలంగాణలో ఈనెల 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్న అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పనిచేస్తాయని పేర్కొంది. పిల్లలకు 12.30గంటలకు మధ్యాహ్న భోజనం అందించి ఇంటికి పంపనున్నారు. పదో తరగతి విద్యార్థుల్ని పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తెలిపారు.

కేంద్రం కుట్రను తిప్పికొడతాం

- పునర్విభజన కాదు... దక్షిణాది ప్రాధాన్యత కుదించే ప్రయత్నం
- ఈ రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవాలన్నదే బీజేపీ ధ్యేయం: రేవంత్
- అఖిలపక్ష సదస్సుకు సీఎంను ఆహ్వానించిన డీఎంకే ప్రతినిధి బృందం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం చేస్తున్న కుట్రను తిప్పికొట్టే కార్యాచరణ చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది నియోజకవర్గాల పునర్విభజన కాదని దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను కుదించే ప్రయత్నమని ధ్వజమెత్తారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు కలిగే నష్టాలు, చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించేందుకు చెన్నైలో ఈనెల 22న జరిగే సమావేశానికి హాజరుకావాలంటూ రేవంత్ రెడ్డిని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆహ్వానించారు. ఈ మేరకు తమిళనాడు సీఎం రాసిన లేఖను ఆ రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కె.ఎన్.నెహ్రూ అధ్వర్యంలోని డీఎంకే ప్రతినిధి బృందం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేసింది. 2026 తర్వాత చేపట్టే జనగణన వరకు నియోజకవర్గాల పునర్విభజన చేపట్టకూడదని నిబంధనలున్నా కేంద్రం మాత్రం ముందుగానే ఈ ప్రక్రియను తెరపైకి తెచ్చిందని తమిళనాడు సీఎం స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై తమ రాష్ట్రంలో ఇప్పటికే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశామని లేఖలో వెల్లడించారు. ఈ విషయంలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలతో కూడిన ఐక్య కార్యాచరణ కమిటీలో (జేఏసీ) చేరేందుకు అంగీకారం తెలపాలని స్టాలిన్ లేఖలో కోరారు. భవిష్యత్ కార్యాచరణ చేపట్టేందుకు జేఏసీలోకి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తరపున ఒక ప్రతినిధిని నియమించాలని లేఖలో సూచించారు. ముఖ్యమంత్రిని కలిసిన డీఎంకే ప్రతినిధి బృందంలో ప్రత్యేక ప్రతినిధి ఏకేఎస్ విజయన్, డీఎంకే పార్లమెంటరీ పార్టీ నేత కనిమొళి, డీఎంకే ఎంపీలు ఎ.రాజా, ఎన్.ఆర్. ఇళంగో, కళానిధి వీరస్వామి, అరుణ్ నెహ్రూ ఉన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నాన్ని ఏరకంగానూ తాము సహించబోమని హెచ్చరించారు. మేం దేశానికి ఎంతో సేవ చేశామని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి బీజేపీకి పెద్దగా ప్రాతినిధ్యం

- మిగతా 2 లో

కేసీఆర్ అసెంబ్లీకి రావాలి: రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: కేసీఆర్ ... గవర్నర్ ప్రసంగానికి రావడం కాదు అసెంబ్లీలో చర్చలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉందని, ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన గురువారం అక్కడి విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ... తాను ఎవరో తెలియకుండానే పీసీసీ చీఫ్, ముఖ్యమంత్రిగా చేశారా అంటూ బీఆర్‌ఎస్ ను నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులను కిషన్‌రెడ్డి పట్టించుకోవడంలేదని పునరుద్ఘాటించారు. తాను ఆరు గ్యారంటీలకు నిధులు అడగడం లేదని, ఆర్‌ఆర్‌ఆర్, మెట్రో, మూసీ ప్రాజెక్టులకు నిధులు అడుగుతున్నానని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.2.2 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని వివరించారు. నిరుద్యోగ రేటును 8.8 నుంచి 6.1 శాతానికి తగ్గించామన్నారు.

'తెలంగాణ రైజింగ్'కు మద్దతివ్వండి

కేంద్ర మంత్రి జైశంకర్‌కు సీఎం రేవంత్ వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాబోయే 25 సంవత్సరాల్లో తెలంగాణను సమున్నత స్థానంలో నిలిపేందుకు తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి గురువారం కలిశారు. 2025లో హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మిస్ వరల్డ్, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ వివరాలను కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. వీటి నిర్వహణ ద్వారా తెలంగాణ రైజింగ్‌ను ప్రోత్సహించేందుకు మద్దతు ఇవ్వాలని జైశంకర్‌ను సీఎం కోరారు. తెలంగాణ రైజింగ్‌ను విదేశాల్లో భారత్ కార్యక్రమాల్లోనూ ప్రచారం చేయాలని, దౌత్య, లాజిస్టిక్ సహాయంతో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. శరవేగంగా అభివృద్ధి

- మిగతా 2 లో

అస్త్ర పరీక్ష విజయవంతం

భువనేశ్వర్: ఎల్‌సీఏ తేజస్ ద్వారా గగనతలం నుంచి గగనతలంలో లక్ష్యాలను ఛేదించే 'అస్త్ర' క్షిపణి పరీక్ష విజయవంతమైంది. 100 కిమీల పరిధిలోని లక్ష్యాలను అస్త్ర సులువుగా ఛేదించగలదు. డీఆర్‌డీఓ దీనిని అభివృద్ధి చేసింది. 'బియాండ్ విజువల్ రేంజ్ ఎయిర్-టు-ఎయిర్ మిసైల్' (బీవీఆర్ఏఏఎం) అస్త్రను ఒడిశా తీరంలో ఎల్‌సీఏ తేజస్ ద్వారా విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ వర్గాలు తెలిపాయి. దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన యుద్ధ విమానంలో దీని అమరికకు మార్గం సుగమమైందని పేర్కొన్నాయి. ఎయిరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) ద్వారా ఎల్‌సీఏ తేజస్ ఏఎఫ్ ఎంకే1 ప్రోటోటైప్ యుద్ధ విమానం నుంచి అస్త్రను... చందీపూర్ తీరం వెంబడి పరీక్షించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. కదలుతున్న లక్ష్యాన్ని అస్త్ర కచ్చితంగా ఛేదించినట్లు తెలిపాయి. ఇందులోని ఉప వ్యవస్థలన్నీ సరిగ్గా పనిచేశాయని పేర్కొన్నాయి.

అస్త్ర ఇప్పటికే ఐఏఎఫ్ అమ్ములపొదికి చేరింది. సుఖోయ్ 30 ఎంకేఐ యుద్ధ విమానంతో అనుసంధానమైంది. ఇక ఎల్‌సీఏ ఏఎఫ్ ఎంకే1ఎ వేరియంట్‌తో అనుసంధానం చేసేందుకు ఈ ప్రయోగంతో కీలక

- మిగతా 2 లో

చంద్రయాన్-4కు మార్గం సుగమం

స్పేడెక్స్ డీ డాకింగ్ విజయవంతం

న్యూఢిల్లీ: అంతరిక్ష ప్రయోగాల్లో భాగంగా ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానం చేసే మిషన్‌ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టింది. భవిష్యత్‌లో చేపట్టబోయే భారీ అంతరిక్ష యాత్రలకు అవసరమైన ఈ కీలక పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టిన ఇస్రో... ఆ దిశగా మరో అడుగు వేసింది. తాజాగా స్పేడెక్స్ డీ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించింది. దీనిపై అంతరిక్ష సంస్థకు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ శుభాకాంక్షలు తెలిపారు. 'ఈ విజయం ప్రతి భారతీయుడిలో ఉత్సాహాన్ని నింపుతుంది. నమ్మశక్యం కాని డీ డాకింగ్ ప్రక్రియను స్పేడెక్స్ శాటిలైట్లు పూర్తి చేశాయి. భారతీయ అంతరిక్ష స్టేషన్, చంద్రయాన్-4, గగన్‌యాన్ సహా భవిష్యత్ ప్రయోగాలకు మార్గాన్ని సుగమం చేసింది' అని మంత్రి ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానించే మిషన్‌లో భాగంగా ఇస్రో... గతేడాది డిసెంబర్ 30న ఛేజర్, టార్గెట్ జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపింది. అనేక ప్రయత్నాల అనంతరం చివరకు జనవరి 16న డాకింగ్ ప్రక్రియను విజయవంతంగా చేపట్టింది. దీంతో ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో ఈ ప్రయోగాలను పునఃప్రారంభించేందుకు సిద్ధమైంది. మార్చి 15 నుంచి స్పేడెక్స్ ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ఇటీవల వెల్లడించారు.

సిసోదియా, జైన్‌పై
ఎఫ్ఐఆర్‌కు రాష్ట్రపతి ఓకే

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో తరగతుల నిర్మాణంలో రూ.1,300 కోట్ల కుంభకోణం వ్యవహారంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు మనీశ్ సిసోదియా, సత్యేంద్ర జైన్‌పై ఎఫ్ఐఆర్ నమోదునకు రాష్ట్రపతి ముర్ము అంగీకరించారు. 2022లో ఢిల్లీ ప్రభుత్వ విజిలెన్స్ డైరెక్టరేట్ ఈ కుంభకోణంపై విచారణకు సిఫార్సు చేసింది. ప్రభుత్వ

- మిగతా 2 లో

ప్రజాస్వామ్యం ఖూనీ

జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: మీపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఈ సెషన్ మొత్తం సస్పెండ్ చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. ఆయన వ్యవహార శైలిపై ఎథిక్స్ కమిటీకి సిఫారసు చేసి వారి నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా స్పీకర్ కు విజ్ఞప్తి చేశారు. శాసనసభలో స్పీకర్‌ను చులకనగా మాట్లాడటం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసే విధంగా ఉందని వ్యాఖ్యానించారు. 'మా అందరి తరపున మీరు పెద్ద మనిషిగా మాత్రమే కూర్చున్నారే తప్ప ఈ సభ నీ సొంతం కూడా కాదు' అని స్పీకర్‌ను

- మిగతా 2 లో

హైజాక్ ఆపరేషన్‌పై పాక్ అబద్ధాలు

ఇంకా పోరు కొనసాగుతోంది: బీఎల్‌ఏ రెబల్స్

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో రైలు హైజాక్ ఘటనకు సంబంధించి పాక్ సైన్యం చేసిన ప్రకటనను వేర్పాటువాద సంస్థ బలూచీ లిబరేషన్ ఆర్మీ(బీఎల్‌ఏ) తీవ్రంగా ఖండించింది. మిలిటెంట్ల నుంచి బందీలను విడిపించేందుకు తాము నిర్వహించిన ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని పాక్ సైన్యం చేసిన ప్రకటనను బలూచ్ వేర్పాటువాదులు ఖండించారు. తాము ఇంకా సైన్యంతో పోరాడుతున్నామని బీఎల్‌ఏ గురువారం తన ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 'బలూచిస్థాన్‌లోని

- మిగతా 2 లో

ఇదీ లోకం!



మొదటి ఆవిర్భావ సభకు చేగువేరా ఫొటో వాడాము, మరి ఇప్పుడేం చేద్దాం అన్నియ్యా!

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మాటల యుద్ధం
- ఎమ్మెల్యే వ్యాఖ్యలపై దుమారం
- సభాపతికి క్షమాపణ చెప్పాలన్న అధికార పార్టీ
- ఇది చీకటిరోజన్న ప్రతిపక్షం

విశాలాంధ్ర - హైదరాబాద్: తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. స్పీకర్ పట్ల వ్యాఖ్యలు చేసిన జగదీశ్‌రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలని మంత్రి సీతక్క శాసనసభలో ప్రతిపాదించారు. శాసన వ్యవస్థను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల విషయాన్ని ఎథిక్స్ కమిటీకి పంపాలని సూచించారు. బడ్జెట్ సెషన్స్ ముగిసే వరకు జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయాలని సభావ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించగా.. స్పీకర్ ఆమోదించారు. జగదీశ్‌రెడ్డి వెంటనే సభ నుంచి వెళ్లి పోవాలని స్పీకర్ ఆదేశించారు. ఇది చీకటి రోజని బీఆర్‌ఎస్ ఆరోపించింది. బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసనసభ రెండో రోజైన గురువారం ప్రారంభం అయిన కొద్ది సేపటికే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ముఖ్యంగా శాసన సభాపతిని ఉద్దేశించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సభలో దుమారం రేగింది. ఇరుపక్షాలు ఒక్కరిపై ఒకరు విమర్శలు ప్రతివిమర్శలు చేసుకోవడంతో సభ రసాభాసగా మారింది. పరిస్థితి అదుపు తప్పడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను 15 నిమిషాలు వాయిదా వేశారు. అయితే జగదీశ్‌రెడ్డి ... సభపతికి క్షమాపణలు చెప్పే వరకు వదిలేది లేదని కాంగ్రెస్ సభ్యులు భీష్మించారు. ముందుగా సభ ప్రారంభం కాగానే గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రవేశపెట్టారు. అయితే, తీర్మానంపై చర్చ సందర్భంగా మాజీ మంత్రులు, మంత్రుల మాటల యుద్ధం కొనసాగింది. ఈ సందర్భంలోనే స్పీకర్‌ను ఉద్దేశించి జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర గందరగోళానికి దారితీశాయి. 36 నిమిషాల గవర్నర్ ప్రసంగంలో 360 అబద్ధాలు చెప్పించారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. రైతుల గురించి సభలో మాట్లాడుతుంటే ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ సభ్యులు బీఆర్‌ఎస్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విప్ శ్రీనివాస్ కలుగజేసుకొని గవర్నర్ కు గౌరవం ఇవ్వాలని, ఇదేం పద్ధతి అంటూ జగదీశ్ రెడ్డిపై మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగాన్ని తప్పుదోవ పట్టించింది తాము

దేశ రాజకీయాల్లో వామపక్ష ప్రభావం

భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర అంటే వామపక్ష ఉద్యమ చరిత్రే. మన దేశంలో స్వాతంత్ర్యోద్యమ క్రమంలో కాంగ్రెస్ సైతం సామ్రాజ్యవాద వైఖరి అనుసరించడానికి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రభావం చాలా బలంగా ఉండేది. స్వాతంత్ర్యోద్యమం పొడవునా సీపీఐ సామ్రాజ్యవాద, వలసవాద వ్యతిరేక విధానాలు అనుసరించడంలోనే ఎక్కువ దృష్టి పెట్టింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

సుంకాలు పెంచితే వాణిజ్య యుద్ధమే

ఈయూకు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికా సుంకాలకు ప్రతీకారంగా యూరోపియన్ యూనియన్ (ఈయూ) కూడా సుంకాలు పెంచుతామని ప్రకటించింది. ఉక్కు, అల్యూమినియంపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపటికే ఈయూ కూడా 28 బిలియన్ డాలర్ల (26 బిలియన్ యూరోలు) సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రతీకార సుంకాలపై ట్రంప్ మండిపడ్డారు. ఈయూ ఎంత వసూలు చేస్తే అమెరికా కూడా అంతేస్థాయిలో వసూలు చేస్తుందని అన్నారు. యూరోపియన్ యూనియన్ వస్తువులపై మరిన్ని సుంకాలు విధించి ప్రపంచ వాణిజ్య యుద్ధాన్ని తెస్తుందని హెచ్చరించారు. ఉక్కు, అల్యూమినియంతో పాటు రాగిపైనా ట్రంప్ సుంకాలు విధించనున్నారని వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ తెలిపారు. కొత్త సుంకాలు బుధవారం అమల్లోకి వచ్చాయి. దీంతో అమెరికా పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు వస్తాయని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా తీరును యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండర్ లెయెన్ ఖండించారు. ఉక్కు, అల్యూమినియంపైనే కాదు.. దుస్తులు, గృహోపకరణాలు, వ్యవసాయ ఉత్పత్తులపై ఏప్రిల్ 1 నుంచి కొత్త సుంకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

గాజా నుంచి ఎవరినీ బహిష్కరించం

గాజా పౌరులను వేరే చోటికి తరలించి, ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ట్రంప్ ప్రతిపాదించారు. శిథిలమైన గాజాను పునర్నిర్మించే ప్రణాళికలో భాగంగా చర్యలు తీసుకుంటాము తప్ప ఎవరినీ గాజా నుంచి బహిష్కరించమని ఆయన అన్నారు. ఐర్లాండ్ ప్రధాని మైఖేల్ మార్టిన్‌తో భేటీకి ముందు మీడియాతో మాట్లాడిన ట్రంప్ ఈమేరకు స్పష్టత ఇచ్చారు. యూఎస్ సెనెట్ మైనారిటీ నాయకుడు చక్ షూమర్ గురించి ప్రస్తావిస్తూ ఆయన గతంలో యూదుడు కానీ ఇప్పుడు పలస్తీనా పౌరుడు అని అన్నారు. గత నెలలోనూ ట్రంప్ ఒక పోస్టులో ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. గాజాలో మానవతా సాయాన్ని పెంచాల్సిన అవసరం ఉందని మార్టిన్ తెలిపారు. కాల్పుల విరమణతో పాటు హమాస్ చెరలోని బందీలను విడుదల చేయాలని పిలుపునిచ్చారు. గాజాలో యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయిల్‌తో ఐర్లాండ్ సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గతేడాది డిసెంబరులో ఐర్లాండ్‌లోని తమ రాయబార కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు టెల్‌అవీవ్ ప్రకటించింది. గాజాలో ఇజ్రాయిల్ మారణహోమంపై అంతర్జాతీయ న్యాయస్థానంలో దక్షిణాఫ్రికా వేసిన కేసులో జోక్యం చేసుకోవాలని ఐర్లాండ్ కేబినెట్ నిర్ణయం తర్వాత ఈ పరిణామం జరిగింది. మరోవైపు ట్రంప్ ఆలోచనలను హమాస్ తీవ్రంగా తప్పుపట్టింది. కొనుగోలు చేసి.. అమ్మడానికి గాజా స్థిరాస్తి కాదని తేల్చిచెప్పింది. సౌదీఅరేబియాలోని జెడ్డాలో ఇస్లామిక్ దేశాల సహకార సంస్థ (ఓఐసీ) సభ్యదేశాలు సమావేశమై ట్రంప్ ప్రతిపాదనను తిరస్కరించాయి. గాజా పునర్నిర్మాణం విషయంలో ఈజిప్ట్ ప్రతిపాదిస్తున్న ప్రణాళికకు మద్దతిస్తున్నట్లు ఉమ్మడిగా ప్రకటించాయి.

కర్స్క్ యుద్ధ క్షేత్రంలో పుతిన్

ఉక్రెయిన్ దళాలను తిప్పికొట్టాలన్న రష్యా అధ్యక్షుడు

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పశ్చిమ రష్యాలోని కర్స్క్‌లో పర్యటించారు. ఈ ప్రాంతంలోని కొంత భూభాగాన్ని ఉక్రెయిన్ దళాలు స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో పుతిన్ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. కర్స్క్‌లోని రష్యా దళాల కంట్రోల్ సెంటర్‌కు పుతిన్ వెళ్లారు. ఆయన మిలిటరీ యూనిఫాంలో ఉన్న దృశ్యాలు మీడియాలో ప్రసారమయ్యాయి. యుద్ధ భూమిలోని పరిస్థితులను పుతిన్‌కు రష్యన్ జనరల్ స్టాఫ్ హెడ్ వలెరీ జెరసిమోవ్ తెలిపారు. ఉక్రెయిన్ సైనికులు కొందరు లొంగిపోయినట్లు అధ్యక్షుడికి తెలిపారు. ఈ ప్రాంతం నుంచి ఉక్రెయిన్ దళాలను త్వరలోనే తరిమేయాలని పుతిన్ ఆదేశించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇదిలావుంటే, అమెరికా-రష్యా అధికారులు మూడు వారాలుగా వర్చువల్‌గా చర్చలు జరుపుతున్నారు. కీవ్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకపోవడం, విదేశీ దళాలను ఉక్రెయిన్‌లోకి అనుమతించకపోవడం, క్రిమియా, మరో నాలుగు ప్రావిన్స్‌లు రష్యాకు చెందుతాయని అంగీకరించడం వంటి డిమాండ్లను మాస్కో చేసినట్లు తెలుస్తోంది. నాటో తూర్పు వైపు విస్తరణ అంశం కూడా పరిశీలించాలని కోరినట్లు సమాచారం. కాగా, డిమాండ్ల విషయంలో రష్యన్లు ఎలాంటి మినహాయింపులకు సిద్ధంగా లేరని, గంలో అమెరికా తిరస్కరించిన డిమాండ్లనే మళ్లీ చేస్తున్నారని బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఏంజెలా స్టెంట్ అన్నారు. శాంతి దిశగా అర్థవంతమైన చర్చలకు రష్యాకు ఆసక్తి లేదని అభిప్రాయపడ్డారు. మరోవైపు 30 రోజుల కాల్పుల విరమణకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంగీకరించారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ 'మా ప్రతినిధులు రష్యాకు బయల్దేరారు. కాల్పుల విరమణకు పుతిన్ అంగీకరిస్తారనే ఆశిస్తున్నాం. లేదంటే యుద్ధం కొనసాగుతుంది. అప్పుడు మాస్కో ఆర్థికంగా తీవ్ర నష్టాలను ఎదుర్కొవాల్సి వస్తుంది. అది రష్యాకే వినాశకరం. అలా జరగాలని నేను కోరుకోను. శాంతి సాధనే నా లక్ష్యం' అని అన్నారు. .

జెడ్డాలో శాంతి చర్చలు: ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పడమే లక్ష్యంగా సౌదీ అరేబియాలోని జెడ్డా వేదికగా అమెరికా, ఉక్రెయిన్ ప్రతినిధులు మధ్య చర్చలు జరిగాయి. అమెరికా ప్రతిపాదించిన 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి ఉక్రెయిన్ అంగీకరించింది. ఈమేరకు ఉమ్మడి ప్రకటన వెలువడింది. సైనిక సాయం, నిఘా భాగస్వామ్యానికి సంబంధించి ఉక్రెయిన్‌పై విధించిన ఆంక్షలను తక్షణమే ఎత్తివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది.

జగనన్న కాలనీల అవకతవకలపై విచారణ

శాసన మండలిలో మంత్రి పార్థసారథి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల నిర్మాణాల్లో జరిగిన అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ జరుపుతున్నారని, నివేదికలు అందిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. భూసేకరణలో అవతవకలు జరిగాయన్న ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమేనన్నారు. ఇళ్ల స్థలాలకు అనువుగా ఉంటుందా లేదా అనేదేమీ చూడకుండా భూములు కేటాయించారని చెప్పారు. గ్రామాలకు దూరంగాను, కొన్ని ప్రాంతాల్లో శ్మశానాలు, కొండ ప్రాంతాలు, చెరువులు, వాగుల్లో భూములు కేటాయించారని తెలిపారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల్లో భాగంగా గురువారం సభ్యులు రామ్‌భూపాల్‌రెడ్డి, రామారావు తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. జగనన్న కాలనీల నిర్మాణం రెవెన్యూ జీవో 562 తగ్గినట్లుగా భూసేకరణ జరిగిందా లేదా... జీవోలో పొందుపరిచిన విధంగా ధరలు నిర్ణయించారా అనే దానిపై పూర్తి స్థాయి విచారిస్తున్నామన్నారు. కాకినాడ, కృష్ణా, అనకాపల్లి, ప్రకాశం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రత్యేకంగా దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. గత ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేట్ భూములు దాదాపు 61,759.77 ఎకరాలను జగనన్న కాలనీల కోసం సేకరించిందని వివరించారు. రూ.11,341 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ల్యాండ్ అక్విడేషన్ చేసిన లబ్ధిదారులకు డబ్బులు చెల్లించలేదని చెప్పారు. 2014-19 మధ్యలో కేంద్ర ప్రభుత్వం అర్బన్ ప్రాంతాలకు రూ.లక్షా 50వేలు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇచ్చి... అదనంగా ఎస్సీ, ఎస్టీలకు కేటాయించేవారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీలకు ఇచ్చే రాయితీని పూర్తిగా రద్దు చేసి కేవలం రూ.30 వేలు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. రూరల్‌లోనూ బాధితులకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. ఇళ్ల నిర్మాణాన్ని కొన్ని ఏజెన్సీలకు అప్పగించిందని, అందులోనూ అవకతవకలు ఉన్నాయని, ప్రైవేట్ సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల నుంచి 70 వేల ఇళ్ల నిర్మాణానికి బాధ్యతలు తీసుకుని, కేవలం రెండు, మూడు వేల ఇళ్లనే నిర్మించిందని, వేలాది మంది లబ్ధిదారులకు అన్యాయం చేసిందన్నారు. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వేలాది కోట్ల నిధులు వృధాగా మారిపోయాయని చెప్పారు. దీనిపై తప్పకుండా విచారిస్తామని, కోర్టులో కేసు వేశామని మంత్రి చెప్పారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు చెందిన ఆరు లక్షల మందికి ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం అదనపు భారం వేసి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

మద్యం అమ్మకాల్లో వైసీపీ అవినీతి

కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ఐదేళ్ల పాలనలో మద్యం అమ్మకాలలో రూ.3,300 కోట్ల మేర అవినీతి జరిగిందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్, నాసిరకం మద్యం విచ్చలవిడిగా అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారన్నారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించి బడ్జెట్ గ్రాంట్లపై ఆ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శాసనసభకు సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం జే-బ్రాండ్‌లు మాత్రమే విక్రయించిందని అన్నారు. రూ.3,300 కోట్ల మేర అక్రమాలు జరిగినట్టుగా కూటమి ప్రభుత్వం శ్వేతపత్రం ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంలో 3,400 దుకాణాలకు వేలం నిర్వహిస్తే 90 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. 340 దుకాణాలు కల్లుగీత కార్మికులకు కేటాయించి, లైసెన్సు ఫీజులో రాయితీ ఇచ్చామన్నారు. 2030 వరకూ మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని వైసీపీ తాకట్టు పెట్టిందని కొల్లు రవీంద్ర విమర్శించారు. ఇదిలావుంటే, వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై ఈడీ విచారణకు ఆదేశించాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కోరారు. మద్యం అక్రమాల్లో దోచిన వేల కోట్లు రికవరీ చేసి ప్రజల కోసం ఖర్చుపెట్టాలని ఆయన సూచించారు.

ఏయూకు పూర్వవైభవం తెస్తాం

అసెంబ్లీలో మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్రా యూనివర్సిటీలో మాజీ వీసీ ప్రసాదరెడ్డి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై 60 రోజుల్లో విజిలెన్స్ విచారణ పూర్తిచేసి, కఠినమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి అవినీతి, అక్రమాలపై శాసన సభ్యులు పల్లా శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణ, గణబాబు, విష్ణుకుమార్ రాజు, కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నలపై మంత్రి సమాధానమిస్తూ... అందిన సమాచారం ప్రకారం రూ.20 కోట్ల రూసా గ్రాంట్ దుర్వినియోగం, ఇస్రో నుంచి వచ్చిన రూ.25 లక్షలు ఖర్చు చేసిన విషయంలో కూడా నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదు అందిందన్నారు. అవినీతి, అధికార దుర్వినియోగం, విద్యార్థులను రాజకీయ కార్యక్రమాలకు ఉపయోగించారని కూడా తమ దృష్టికి వచ్చిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ విశాఖపట్నం వెళితే ఆయనకు స్వాగతం పలికేందుకు తరగతులు నిలిపేసి విద్యార్థులను రోడ్లపై నిలిపారన్నారు. వర్సిటీలో అక్రమాలకు బాధ్యులైన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రాబోయే అయిదేళ్లలో ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయమైనా క్యూఎస్ ర్యాంకింగ్ టాప్ -100లో ఉండాలని సీఎం చెప్పారన్నారు. అందులో భాగంగా ఐఐటి ఖరగ్‌పూర్‌లో మ్యాథ్స్ ప్రొఫెసర్‌గా పని చేసిన రాజశేఖర్‌ను ఏయూ వీసీగా నియమించామని తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీలో విద్యా ప్రమాణాలను పెంచి, గత వైభవం తెస్తామన్నారు.

చర్చించి పరిష్కరించుకుందాం

బెదిరింపులతో వచ్చేవి ప్రతికూల ఫలితాలే: అమెరికాకు చైనా హితవు

బీజింగ్: చైనాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించడం, ప్రతీకార సుంకాలను అమలు చేయాలని చైనా కూడా నిర్ణయించడంతో రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య యుద్ధం తరహా పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు చైనా ముందుకొచ్చింది. చర్చలకు రావాలని అమెరికాకు సూచించింది. ఎంతటి సమస్యనైనా చర్చించి పరిష్కరించుకోవచ్చని హితవు పలికింది. ఆర్థిక, వాణిజ్య రంగాల్లో విభేదాలు, వివాదాల పరిష్కారం విషయంలో చైనా - అమెరికా దేశాలు సానుకూల, సహకార వైఖరిని అవలంభించాలని కోరుకుంటామని ఆ దేశ వాణిజ్య శాఖ అధికార ప్రతినిధి యంగ్‌కియాన్ వెల్లడించారు. బెదిరింపులతో ప్రతికూల ఫలితాలే వస్తాయని, సామరస్యంగా సంప్రదింపులు జరుపుకోవడం శ్రేయస్కరమని అన్నారు.

చర్చలతో సమస్యను పరిష్కరించుకోవడమే ఉత్తమ మార్గమని తెలిపారు. చైనా ఉత్పత్తులపై 10శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ గతంలో ప్రకటించారు. ఇటీవలే ఆ సుంకాలను 20శాతానికి పెంచుతున్నట్లు వెల్లడించారు. దీనికి దీటుగా అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు, పోర్క్ చికెన్ వంటి వాటిపై 15 శాతం వరకు సుంకాలను చైనా ప్రకటించింది. అమెరికా ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటే తమ ప్రతిస్పందన కూడా అలాగే ఉంటుందని హెచ్చరించింది. కానీ ఇప్పుడు పరిస్థితిని చక్కబెట్టేందుకు చైనా యత్నిస్తోంది.

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

కాదు... కాంగ్రెస్ పార్టీనేనని జగదీశ్‌రెడ్డి ఎదురుదాడి చేశారు. మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ బీఆర్ఎస్ వైఫల్యాలను తమ సభ్యులు చెప్పారని, గత పదేళ్లలో చేయలేనిది తాము ఏడాదిలోనే చేసి చూపించామని అన్నారు. స్పీకర్ కలుగజేసుకుని... గవర్నర్ ప్రసంగంలోని అంశాలే మాట్లాడాలని సూచించారు. స్పీకర్ వ్యాఖ్యలపై జగదీశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సభా సాంప్రదాయాలకు ఏది విరుద్ధమో చెప్పాలని, సభ స్పీకర్ సొంతం కాదు, అందరిది అంటూ వ్యాఖ్యానించారు.

స్పీకర్ స్పందిస్తూ తనను ప్రశ్నించ డమే సభా సంప్రదాయాలకు విరుద్ధమని అనడంతో జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. జగదీశ్ రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దళిత స్పీకర్‌పై జగదీశ్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్నారు. ప్రజాస్వామ్యంలో స్పీకర్ చైర్‌కు కొన్ని అధికారాలు ఉంటాయని, దీనిపై కఠినమైన నిర్ణయం తీసుకోవాలని ఉత్తమ్ అన్నారు. ఈ క్రమంలోనే మంత్రి శ్రీధర్ రెడ్డి జోక్యం చేసుకుని జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను బెదిరిస్తున్నారని, వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని అన్నారు.

స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతాం: హరీశ్‌రావు

స్పీకర్ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని... లేకుంటే ఆయనపై అవిశ్వాస తీర్మానం పెడతామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. జగదీశ్ రెడ్డి స్పీకర్‌ను అవమానించలేదని, 'సభ మీ ఒక్కరిదీ కాదు - సభ అందరిదీ' అని అన్నారని వివరించారు. మీ అనే పదం సభ నిబంధనలకు విరుద్ధం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఈ పదం అన్ పార్లమెంటరీ పదం కాదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎందుకు నిరసన చేశారో ... సభను ఎందుకు వాయిదా వేశారో తెలియదని అన్నారు. స్పీకర్‌ను కలిశామని, రికార్డు తీయాలని అడిగామన్నారు. దళితుడిని అగౌవరం పరిచే విధంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడలేదన్నారు. మీడియా పాయింట్ వద్ద మాట్లాడకుండా బ్లాక్ చేశారని హరీశ్‌రావు అన్నారు.

అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్

అబద్దాలకు, అసత్యాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ గా మారారని హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీలో అవే అబద్దాలు, బయటా అవే అబద్దాలు, 13 రోజులు గడుస్తున్నా వైద్యారోగ్య శాఖలోని టీవీవీపీ విభాగంలో 13 వేల మందికి జీతాలు చెల్లించనిది వాస్తవం కాదా అని నిలదీశారు. డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నది మీ కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఉన్న జీతాలు ఇప్పటికీ రాక హోం గార్డులు ఆవేదన చెందుతున్నది నిజం కాదా అంటూ ధ్వజమెత్తారు. ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామనే అబద్దాన్ని, అవకాశం ఉన్న చోటల్లా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. దుష్ప్రచారంతోనే ఏడాదిన్నర గడిపారని, ఇంకెంత కాలం వెళ్లదీస్తారని అడిగారు.

జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయాలి: కాంగ్రెస్

జగదీశ్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, ఆయన్ను సభ నుంచి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో సభను కొద్దిసేపు స్పీకర్ వాయిదా వేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబుతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేశ్ భేటీ అయి సభలో జరిగిన గందరగోళంపై చర్చించారు. జగదీశ్‌రెడ్డి స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ సభ్యులకు సూచించారు.

సభా సంప్రదాయాలను మార్చింది: భట్టి

పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ సభా సాంప్రదాయాన్ని మార్చిందని, నిబంధనలను నిర్వీర్యం చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసెంబ్లీలో శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ... శాసనసభ ఎన్ని రోజులు జరగాలి అన్నది బీఆర్ఎస్ పాలనలో స్పష్టత లేదన్నారు. అందరితో మాట్లాడి సభ ఎక్కువ రోజులు నడిపించేందుకు ప్రయత్నం చేస్తామని చెప్పారు. సంస్కరణలు చేపట్టి సభ ఔన్నత్యాన్ని కాపాడుతామన్నారు.

అస్త్ర పరీక్ష విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

మైలురాయిని చేరుకున్నదని రక్షణశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అస్త్ర క్షిపణి 154 కిలోల బరువు, 3.8 మీటర్ల పొడవు ఉంటుంది. సాలిడ్ ఫ్యుయల్ ప్రొపెలెంట్‌ను వినియోగిస్తుంది. దీనికి 15 కిలోల హై-ఎక్స్‌ప్లోజివ్ వార్‌హెడ్ అమర్చబడింది. 20 కిమీల నుంచి 100 కిమీల పరిధిలోని లక్ష్యాలను ఛేదించే విధంగా దీనిని రూపొందించారు. తాజా పరీక్ష విజయవంతం కావడంతో డీఆర్‌డీఓ, ఐఏఎఫ్, ఏడీఏ, హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)తో పాటు భాగస్వాములైన అందరినీ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

హైజాక్ ఆపరేషన్‌పై పాక్ అబద్ధాలు

(మొదటిపేజీ తరువాయి)

బోలన్ జిల్లాలో ఆపరేషన్‌ను ముగించినట్లు పాక్ ఆర్మీ చేసిన ప్రకటన అబద్ధం. రెండువర్గాల మధ్య పోరాటం జరుగుతోంది. పాక్ సైన్యం మరణించిన సైనికులు, రెబెల్స్ ఫొటోలు ఇంకా విడుదల చేయలేదు. సైన్యం వైపు భారీగా నష్టం జరుగుతోంది. బందీలుగా ఉన్న తమ సిబ్బందిని రక్షించుకోలేకపోయింది. సైనికుల స్థైర్యం దెబ్బతినకుండా చూసుకునేందుకు వాస్తవ సంఖ్యను దాచి... తప్పుడు ప్రచారం చేస్తోంది' అని తన ప్రకటనలో పేర్కొంది. ఆర్మీ రక్షించిందని చెబుతున్న సిబ్బందిని యుద్ధనీతిని అనుసరించి తామే విడుదల చేశామని పేర్కొంది. యుద్ధంలో తమను ఓడించలేక... నిరాయుధులైన బలూచ్ ప్రజలపై పాక్ ఆర్మీ దాడులు చేస్తోందని మండిపడింది. ఇదిలాఉంటే... రైలును హైజాక్ చేసిన వేర్పాటువాద బలూచ్ మిలిటెంట్లు 33 మందిని హతమార్చినట్లు పాకిస్థాన్ సైన్యం బుధవారం ప్రకటించింది.

'21 మంది ప్రయాణికులను వేర్పాటువాదులు హత్య చేశారు. ఈ ఆపరేషన్‌లో నలుగురు సైనికులు కూడా ప్రాణాలు కోల్పోయారు. మిలిటెంట్ల చెరలోని బందీలను రక్షించాం' అని సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ తెలిపారు. సుమారు 425 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బీఎల్ఏ వేర్పాటువాదులు బోలన్ ప్రాంతంలో మంగళవారం హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రకటనలతో హైజాక్ ఘటనకు తెరపడిందా లేదా అన్న విషయంలో అయోమయం నెలకొంది. కాగా, బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పర్యటించారు. స్థానికంగా శాంతిభద్రతలను సమీక్షించడంతో పాటు బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపేందుకు ఆయన అక్కడకు వెళ్లారు.

'తెలంగాణ రైజింగ్'కు మద్దతివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

చెందుతున్న హైదరాబాద్‌లో చేపట్టే కార్యక్రమాలకు తమ మంత్రిత్వ శాఖ మద్దతుగా నిలుస్తుందని కేంద్ర మంత్రి జైశంకర్ ... రేవంత్ రెడ్డికి భరోసా ఇచ్చారు.

విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, నాగర్ కర్నూలు, భువనగిరి లోక్‌సభ సభ్యులు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ఉన్నారు.

సిసోదియా, జైన్‌పై ఎఫ్ఐఆర్‌కు రాష్ట్రపతి ఓకే

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి (సీఎస్)కు నివేదిక ఇచ్చింది. ఈ కేసులో సిసోదియా, జైన్‌పై ఎఫ్ఐఆర్ నమోదునకు రాష్ట్రపతి అంగీకారం తెలిపినట్లు సంబంధిత వర్గాలు గురువారం వెల్లడించాయి. పీడబ్ల్యూడీ ద్వారా దిల్లీ ప్రభుత్వ పాఠశాలల్లో 2,400కుపైగా తరగతుల నిర్మాణంలో అక్రమాలు జరిగినట్లు 2020, ఫిబ్రవరి 17న ఇచ్చిన నివేదికలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) పేర్కొంది. కాగా, సిసోదియా, జైన్ మాజీ మంత్రులు. వీరిద్దరు కేజ్రీవాల్ ప్రభుత్వంలో పనిచేశారు.

కేంద్రం కుట్రను తిప్పికొడతాం

(మొదటిపేజీ తరువాయి)

లేదని... దక్షిణాది రాష్ట్రాల్లో ఓటమితో ఈ రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోందని మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సూత్రప్రాయంగా ఇప్పటికే నిర్ణయించిందని వెల్లడించారు. కాంగ్రెస్ అధిష్ఠానం అనుమతి తీసుకొని తాను చెన్నై సమావేశానికి హాజరవుతానని రేవంత్ చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ రాష్ట్రంలోనూ చర్చలు జరిపేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని పార్టీల నేతలను అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మాజీ మంత్రి జానా రెడ్డిలకు సూచించినట్లు సీఎం తెలిపారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆహ్వానిస్తున్నామని... ఆయన సమావేశంలో పాల్గొని అక్కడ వెల్లడైన అభిప్రాయాలను కేంద్ర క్యాబినెట్ దృష్టికి తీసుకెళ్లాలని సీఎం అన్నారు. మన హక్కుల రక్షణకు తెలంగాణ నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి పాటుపడాల్సి ఉన్నందున ఆయనను పిలుస్తామని, ఆయన దీనికి సమాధానం చెప్పాల్సి ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా దక్షిణాది రాష్ట్రాల హక్కుల పరిరక్షణకు అంతా పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. 22న చెన్నైలో నిర్వహించే సమావేశంలో నియోజకవర్గాల పునర్విభజనతో కలిగే నష్టాలు... వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణను రూపొందిస్తామని సీఎం స్పష్టం చేశారు. అన్ని పార్టీలు, పౌర సంఘాల అభిప్రాయాలు సేకరించేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారని సీఎం అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ఏవిధంగా వ్యవహరించాలనే అంశంపై స్టాలిన్ కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయనను ప్రోత్సహిస్తామని సీఎం తెలిపారు.

మాజీ సీఎం బూర్గులకు నివాళి

హైదరాబాద్ రాష్ట్రానికి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, ముఖ్యమంత్రిగా, రెండు రాష్ట్రాలకు గవర్నర్‌గా, సాహితీవేత్తగా, బహు భాషా వేత్తగా బూర్గుల బహుముఖ ప్రజ్ఞ కనపర్చారని సీఎం కొనియాడారు. నాగర్‌కర్నూల్, భువనగిరి ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

(మొదటిపేజీ తరువాయి)

ఉద్దేశిస్తూ జగదీశ్ రెడ్డి చులకనగా మాట్లాడటం చూస్తే... ఆయన మిమ్మల్ని సభాపతిగా చూడటం లేదన్నారు. బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం నిర్వహించి కేసీఆర్ ఇదే ఉద్బోధ చేశారా అని ప్రశ్నించారు. మీ సంస్కారం చూస్తుంటే బాధగా ఉంది. ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసినట్టుగా చేసిన వ్యాఖ్యలను సభలో సభ్యులందరూ ముక్త కంఠంతో ఖండిస్తున్నామని చెప్పారు. అసెంబ్లీ ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటిదని, అలాంటి అసెంబ్లీలో సభను నియంత్రిస్తూ, ఆర్డర్లో పెడుతూ, సజావుగా నడిపించడానికి, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి భారత రాజ్యాంగం స్పీకర్‌కు విశేష అధికారాలు ఇచ్చిందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభ స్పీకర్ గురించి ఒక సభ్యుడు శాసనసభ వెలుపల అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయమై ఆనాడు ఎథిక్స్ కమిటీకి పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆనాడు ప్రతిపక్ష సభ్యులుగా ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ కుమార్‌ల సభ్యత్వాన్ని రద్దు చేసిందన్నారు. సభ సాంప్రదాయాలు కాపాడటానికి కఠిన నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. మూడ్ ఆఫ్ ది హౌస్ ప్రకారం ప్రకారం శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కొంత మంది సభ్యులు కోరినట్లు చెప్పారు. ప్రజాస్వామ్యం, సభ సాంప్రదాయాలపై గౌరవం ఉంది కాబట్టి, ఈ సెషన్ సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సభ సాంప్రదాయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. సభాపతిని గౌరవించాల్సిన అవసరం ప్రతి సభ్యుడుపై ఉందని నొక్కి చెప్పారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానంపై చాలా ఉన్నతంగా, గొప్పగా చెప్పాల్సిన ప్రతిపక్ష సభ్యులు అవహేళనగా మాట్లాడటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా ఉందని అన్నారు.

సస్పెన్షన్ అప్రజాస్వామ్యం

నేడు నిరసనలు, దిష్టిబొమ్మల దహనానికి కేటీఆర్ పిలుపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ శాసనసభలో ప్రజాస్వామ్య విలువలకు పాతరేస్తూ నిరాధార ఆరోపణలతో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని సస్పెండ్ చేయడం దారుణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అనని మాటల్ని అన్నట్టుగా చెప్పి అబద్దాల ఆధారంగానే జగదీశ్‌రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం సస్పెండ్ చేసిందని ఆరోపించారు. బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ ఉంటే కాంట్రాక్టులు, కమీషన్లు, దిల్లీకి పంపుతున్న మూటల విషయాలు చర్చకి వస్తాయనే భయంతోనే తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా అంబేద్కర్ విగ్రహం ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిరసన తెలిపిన కేటీఆర్, సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా శుక్రవారం అన్ని నియోజకవర్గాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఉభయ సభల్లో గవర్నర్ చేసిన ప్రసంగంలోని అసత్యాలు, అర్థసత్యాలను ఎత్తిచూపుతున్న జగదీశ్‌రెడ్డిని కుట్రపూరితంగానే ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. అటు మంత్రులు ఇటు కాంగ్రెస్ శాసనసభ్యులు రన్నింగ్ కామెంట్రీ చేస్తూ ప్రసంగానికి అంతరాయం కలిగించినా జగదీశ్ రెడ్డి ఏమాత్రం సంయమనం కోల్పోలేదన్నారు. ఎండిపోతున్న పంటలు, అధోగతిపాలైన వ్యవసాయం, రైతుల కష్టాలు, జరగని రుణమాఫీ, పడని రైతుబంధు, అమలుగాని ఆరు గ్యారెంటీలు, 420 హామీల వాగ్దాన భంగంపై ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే తట్టుకోలేక నీతి బాహ్యంగా, నిస్సిగ్గుగా ఆయనను సస్పెండ్ చేసిందన్నారు. ఆయన ఎక్కడా అన్ పార్లమెంటరీ పదాలు వాడలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. నియంతృత్వ పోకడలతో ఐదు గంటలు సభను వాయిదా వేసి దిల్లీలో ఉన్న రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు ఈ చర్య తీసుకున్నారని కేటీఆర్ మండిపడ్డారు. స్పీకర్ బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేయమన్న కేసీఆర్ ఆదేశాలతో స్పీకర్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిని కలిసి మూడ్ ఆఫ్ ది హౌజ్ తెలుసుకోవాలని తాము చేసిన సూచనను ఈ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జగదీశ్‌రెడ్డిని కనీసం వివరణ కూడా అడగకుండా, ఏం తప్పు చేశారో చెప్పకుండానే సస్పెండ్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం దురహంకారానికి నిదర్శమన్నారు.

భవిష్యత్తులో కాంగ్రెస్‌కు ప్రజాకోర్టులో శిక్ష పడుతుందని కేటీఆర్ హెచ్చరించారు. ఒక గొంతు నొక్కినంత మాత్రాన ఏదో సాధించామని భ్రమ పడుతున్న కాంగ్రెస్ అప్రజాస్వామిక వైఖరిని నిరసిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకార నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనానికి కేటీఆర్ పిలుపునిచ్చారు.

క్రమశిక్షణ పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు : ఎస్పీ

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : క్రమశిక్షణ పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. గురువారం గ్రూప్-2 పరీక్షలో ప్రతిభ చూపించి 25వ ర్యాంక్ సాధించిన ఎస్ఐ శివను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించి, సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, క్రమశిక్షణ, కఠిన సాధన, పట్టుదల ఉంటే ఏ లక్ష్యమైనా సాధించవచ్చని తెలిపారు. మహబూబాబాద్ టౌన్ ఎస్సై శివ తన విధులను నిర్వహిస్తూ చదువుపై ఆసక్తి కనబరచి, ఉన్నత ర్యాంక్ సాధించడం ఇతర పోలీస్ అధికారులకు ప్రేరణగా నిలుస్తుందని ఎస్పీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ శ్రీనివాస్, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ నరేందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ చంద్రమౌళి, డీసీఆర్బి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, టౌన్ సీఐ దేవేందర్, ఆర్ఐలు నాగేశ్వరరావు, అనిల్, పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు మండల కేంద్రంలో గురువారం మార్చి 23వ తేదీన జరిగే ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు బానోతు లక్ష్మణ్ నాయక్ ఎస్ఎఫ్ఐ పోస్టర్లను ఆవిష్కరించారు. పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు అనేక ఉద్యమాల్లో పాల్గొని అక్రమ కేసులను ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో ఎస్ఎఫ్ఐ లో పనిచేసిన వారందరూ సమ్మేళనంగా ఏర్పడడం శుభ పరిణామం అని తెలిపారు. స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో ఏర్పడ్డ ఎస్ఎఫ్ఐ సంఘంలో విద్యార్థుల సమస్యల కోసం గూడూరులో ఎస్ఎఫ్ఐ నాయకులు పెద్ద ఎత్తున ఉద్యమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎస్ఎఫ్ఐ మాజీ కార్యదర్శి బానోతు రాజన్, గూడూరు మండల మాజీ కార్యదర్శి మంగ మహేందర్, మండల మాజీ అధ్యక్షులు బట్టు సురేందర్ ,బోడ వీరన్న, వీరన్న, అశోక్, జిల్లా కార్యదర్శి పుట్ట మధు, సురేష్ పాల్గొన్నారు.

శుద్ధమైన త్రాగునీటిని అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమురం భీం : సమీకృత కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్ భవనంలో ఏర్పాటుచేసిన ఫ్రిడ్జ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు శుద్ధమైన చల్లని త్రాగునీటిని అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ పరిపాలన అధికారి మధుకర్ ను ఆదేశించారు. త్రాగునీటి కొరకు ఏర్పాటు చేసిన ఫ్రిడ్జ్ లో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే మరమ్మత్తులు చేపట్టాలని, తక్షణమే త్రాగునీటి ఏర్పాటు చేయాలని తెలిపారు.

అంగన్వాడి కేంద్రాలలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు : కలెక్టర్

జిల్లాలోని అంగనవాడి కేంద్రాలలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలోని కౌటగూడ గ్రామంలోని అంగన్వాడి కేంద్రం, ఆసిఫాబాద్ పట్టణంలోని జనకాపూర్ అంగన్వాడి కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా అంగనవాడి కేంద్రాల లో భవనాల మరమ్మత్తు పనులు, త్రాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని. పనులలో నాణ్యత పాటించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులు పనులను పర్యవేక్షించాలని అంగన్వాడి కేంద్రం పరిధిలో నమోదయి ఉన్న గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలకు నాణ్యమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు.

వందేళ్ల ప్రజా పోరాటాల చరిత్ర సిపిఐ సొంతం

విశాలాంధ్ర - వనపర్తి : భారతదేశంలో వందేళ్ళ ప్రజా పోరాటాల చరిత్ర గల ఏకైక పార్టీ సిపిఐ అని సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయరాములు అన్నారు. మార్చి 23న జిల్లా కేంద్రంలో సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ముఖ్య సమావేశంలో మాట్లాడారు. ముందుగా శతజయంతి ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభలో సిపిఐ పక్ష నేత కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగాపాల్గొంటారన్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో సిపిఐ ఆవిర్భవించిందన్నారు. సంపూర్ణ స్వాతంత్రం కావాలని పిలుపునిచ్చిన తొలి పార్టీ సిపిఐ అన్నారు. బిజెపి పూర్వరూపం జనసంఘ్ అన్నారు. అనేక రూపాలు మార్చుకొనినేడు బిజెపిగా మారిందన్నారు. 1885లో జాతీయ కాంగ్రెస్ గా అవతరించిన కాంగ్రెస్ అనేక రూపాలు మార్చుకొని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అయిందన్నారు. సిపిఐ ఆవిర్భావం నుంచి నేటి వరకు అదే పేరుతో కొనసాగుతోందన్నారు. ఘన చరిత్ర గల సిపిఐ శతజయంతి ఉత్సవాలు వనపర్తి జిల్లా కేంద్రంలో మార్చి 23న భగత్ సింగ్ జయంతి రోజు జరుపుకోవటం గర్వకారణం అన్నారు. పట్టణంలో భారీ ర్యాలీ, దాచే లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ లో గొప్ప సభ జరుగుతుందని జిల్లా నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సిపిఐ పోరాట ఉద్యమ స్ఫూర్తిని చాటాలన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, గోపాలకృష్ణ, ఎత్తం మహేష్ , విష్ణు, ఏఐఎస్ఎఫ్ నాయకులు నరేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి నిధులు మంజూరు

విశాలాంధ్ర - వనపర్తి : ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేస్తున్న పెబ్బేరు ప్రెస్‌క్లబ్‌కు నూతనంగా స్థలం కేటాయించడంతో పాటు శాశ్వత భవన నిర్మాణానికి నిధులు మంజూరు కోసం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డికి గత కొన్ని రోజుల క్రితం పెబ్బేరు ప్రెస్‌క్లబ్ తరఫున వినతిపత్రం అందజేయగా ఎమ్మెల్యే అందుకు సానుకూలంగా స్పందించి ప్రెస్‌క్లబ్ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు ప్రొసీడింగ్ కాపీని గురువారం విడుదల చేశారు. పెబ్బేర్ ప్రెస్‌క్లబ్‌పై సానుకూలంగా స్పందించి నిధులు కేటాయించిన ఎమ్మెల్యేకు ప్రెస్‌క్లబ్ తరఫున అధ్యక్షులు గొడుగు బాలవర్ధన్, ప్రెస్‌క్లబ్ సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ం

సీతారామ టన్నెల్ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - సత్తుపల్లి : సీతారామ ప్రాజెక్టు కాలువలు, టన్నెల్స్ పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 7 నుండి 8 లక్షల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు అందుతాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మండల పరిధిలోని యాతాలకుంట సమీపంలో నిర్మిస్తున్న సీతారామ కాలువ నిర్మాణ పనులను తుమ్మల శుక్రవారం పరిశీలించారు. సంబంధిత అధికారులను వెంట తీసుకొని స్వయంగా తుమ్మల ట్రాక్టర్ నడుపుతూ టన్నెల్ లోపలకి వెళ్ళడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రూ.21 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల మేర రుణ మాఫీ చేశామని అన్నారు. 10 వేల కోట్లతో రైతు బంధు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు దాన్యంపై ఇచ్చే బోనస్ రూ.11 వందల కోట్లకు ఇప్పటికే రూ.900 కోట్లు అందజేయగ మిగతా రూ.200 కోట్లు తొందరలోనే అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే సత్తుపల్లి ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, అన్ని రంగాల్లోనూ ఇంత అభివృద్ధి చెందిన ప్రాంతం రాష్ట్రంలోనే ఎక్కడా లేదని, ఆ అభివృద్ధి లో తాను పాలు పంచుకున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఏ ప్రాజెక్టును నమ్ముకున్న ఏదో ఒక నాటికి ఎండిపోతున్నాయని, వీటి నుంచి శాశ్వత పరిష్కారం జీవనది గోదావరి ఒకటేనని భావించి, సీతారామ ప్రాజెక్టును రూపకల్పన చేశామన్నారు. జిల్లాకు గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జాతీయ రహదారులు కూడా అన్ని మార్గాల్లో అందుబాటులో ఉన్నాయని, జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెం వరకు మరో రహదారికి ప్రతిపాదనలు జరుగుతు న్నాయని తెలిపారు. వ్యవసాయ రంగానికి భవిష్యత్తు ఉంటుందని రైతులంతా హార్టికల్చర్ సాగుపై దృష్టి సారించి ఆర్థిక సుస్థిరత సాధించాలని ఆయన కోరారు. జిల్లా రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచే ఈ ప్రాజెక్ట్ కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 నాటికి ప్రాజెక్టు పనులు పూర్తిచేసి గోదావరి జలాలు అందజేస్తామన్నారు. ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్లు ముజామిల్ ఖాన్, జితేష్ వి పాటిల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, ఆర్ డి ఓ రాజేందర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దయానంద్ విజయకుమార్ సహా పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా స్వామి వారి కళ్యాణం

విశాలాంధ్ర - కారేపల్లి : ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలో గల సంత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామివారి కళ్యాణం వైభవంగా జరిగింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వామి వారికి కల్యాణ మహోత్సవం పవిత్ర వేద మంత్రోచ్చరణల మధ్య,మంగళ వాయిద్యాలు మోగుతుండగా స్వామి వారు అమ్మవారి మెడలో మంగళసూత్ర ధారణ చేశారు రంగురంగుల పూలతో అలంకరించిన వేదిక పైన ఆసీనులను చేసి శాస్త్రోక్తంగా కళ్యాణ తంతును నడిపించారు భక్తుల గోవింద నామ స్మరణ మధ్య వేద పండితులు బి వాసుదేవ శర్మ దేవేంద్ర ధోని శర్మ బొల్లోజు సతీష్ చార్యులు ఆధ్వర్యంలో కల్యాణాన్ని జరిపించారు. అనంతరం తలంబ్రాల ఘట్టం నిర్వహించారు. కళ్యాణ పీటల మీద భక్తులు సురేందర్ మనియార్-వందన నాగేశ్వరరావు-రేవతి తంగేళ్లపల్లి సుధాకర్-కరుణ శ్రీనివాసరావు-అనురాధ దంపతులు కూర్చున్నారు. కార్య నిర్వహణాధికారి నల్లమోతుల శేషయ్య సహాయకుడు మూడు మోహన్-జ్యోతి విగ్రహ దాత పెండ్యాల లక్ష్మీనారాయణ-నాగమణి లతోపాటు గ్రామ పెద్దలు, ప్రముఖ వ్యాపారులు, పాత్రికేయులు మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర- తొర్రూర్ : పాలకుర్తి చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు ప్రముఖ డాక్టర్ యన్.సుధాకర్‌రావు వర్ధంతి వేడుకలను స్థానిక గెస్ట్ హౌస్‌లో ఆయన చిత్రపటానికి లెఫ్ట్ పార్టీలు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, సిపిఎం జిల్లా నాయకులు బొల్లం అశోక్ లు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా కొనసాగిన ఐదు సంవత్సరాలలో ప్రజలకు అవసరమైన సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి చిత్తశుద్ధితో కృషి చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఉద్యమాన్ని నడిపించిన నాయకుడు అన్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంగా ఏర్పడటం కోసం ఎంతో కృషి చేశారని, డాక్టర్‌గా పేద దళిత గిరిజన సామాన్య ప్రజానికానికి సేవలు చేశాడని కొనియాడారు. హైదరాబాద్ వరంగల్ ఖమ్మం తదితర కార్పొరేట్ ప్రైవేట్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్న వారికి బిల్లును తగ్గించడం, డాక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడి వైద్య సేవలు అందించడానికి కృషి చేశాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నలగొండ పట్టణంలో వివిధ వార్డులలో లింక్ రోడ్లు, స్మశాన వాటికల అభివృద్ధి, డ్రైనేజీ నిర్మాణాలు, మంచి నీరు, విద్యుత్తు తదితర సమస్యల పరిష్కారం కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం కోరారు. గురువారం సిపిఎం నల్గొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా హాశం మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సిపిఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా మార్చి 1 నుండి 10 వరకు సిపిఎం నాయకులు పలుబృందాలుగా పట్టణ ప్రజల సమస్యలను పరిశీలించడం జరిగింది. అట్టి సమస్యలను క్రోడీకరించి సుమారు 60 రకాల సమస్యలను కమీషనర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. పట్టణంలో ప్రధానంగా పానగల్లు పెద్ద బండ తదితర శివారు ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నరసింహ, దండెంపల్లి సరోజ, కోట్ల అశోక్ రెడ్డి, గాదె నరసింహ, పాక లింగయ్య, పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, గుండాల నరేష్, భూతం అరుణ, సలివోజు సైదాచారి, మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్, సర్దార్ అలీ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా మొల్లమాంబ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : కుమ్మరి శాలివాహన సంఘం దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు తోటపల్లి కిరణ్, కుమ్మరి శాలివాహన సంఘం కొండమల్లేపల్లి మండల కన్వీనర్ ఏరుకొండ రాము ఆధ్వర్యంలో గురువారం కొండమల్లేపల్లి చౌరస్తాలో ప్రముఖ కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. కవయిత్రి మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొల్ల కుమ్మరి కులంలో ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లాలో గోపవరం అనే గ్రామంలో కేసన శెట్టి కుటుంబంలో జన్మించిందని అన్నారు. తల్లి చిన్నతనంలోనే చనిపోవడంతో తండ్రి కేసన సంరక్షణలో ఆమె పెరిగిందన్నారు. తండ్రి శివ భక్తుడు కావడంతో ఆమె చిన్నతనం నుండి దైవానుగ్రహంతో ముందుకెళ్లిందని, తనకు శాస్త్రీయ విద్యతో కాకుండా భగవద్దత్తమైన వర ప్రసాదం వల్లనే కవిత్వంలో రాణించిందన్నారు. సంస్కృతంలో వాల్మీకి రచించిన రామాయణాన్ని తెలుగులో సరళమైన భాషలో రాసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. అప్పటినుండి మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందన్నారు. మొల్లమాంబ 1440 నుండి 1530 కాలంలో 16వ శతాబ్దానికి చెందిన ప్రముఖ కవిగా ప్రాచుర్యం పొందిందని శ్రీకృష్ణదేవరాయల కాలంలో తన కవిత్వాన్ని చూపించిందని మొల్ల ఏ విధమైన సంప్రదాయ విద్యను నేరవకుండా దైవాంశ అనుగ్రహంతో రామాయణాన్ని తెలుగులో రాసిందని, అట్టి రామాయణం ఆరుకాండములలో ఎనిమిది వందల డెబ్బై పద్యాలతో రచింపబడిందన్నారు. తాను రచించిన రామాయణాన్ని ఆ కాలంలో కవుల లాగా మణులకు, మాణిక్యాలకు, కీర్తి ప్రతిష్టలకు అమ్ముకోలేదని సాక్షాత్తు శ్రీరామచంద్రుడికి అంకితం చేసిందన్నారు.

మార్చ్ 31లోగా అన్నిరకాల పన్నులు చెల్లించండి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : రామగుండం మున్సిపల్ కార్పోరేషన్‌లో ఇంటి పన్నులతో పాటు అన్ని రకాల పన్నులను మార్చ్ 31 లోగా చెల్లించాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్, కార్పోరేషన్ కమీషనర్ జె.అరుణశ్రీ గురువారం ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. పన్నులు చెల్లించేందుకు వీలుగా ఈ నెలాఖరు వరకు అన్ని సెలవు దినాలలో కూడా మున్సిపల్ కార్యాలయంలో కౌంటర్లు యధాతధంగా పని చేస్తాయని ఆమె తెలిపారు. ఆఫీసుకు వచ్చి చెల్లించని పరిస్థితుల్లో ఆన్‌లైన్‌లో కూడా మున్సిపల్ వెబ్సైట్ ద్వారా కూడా చెల్లించవచ్చునని ఆమె అన్నారు. పన్నులు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. పన్ను బకాయదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

వైద్యాధికారుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరణ

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ. టి. డి. ఎ.), ఏటూరునాగారం పరిధిలోని ఏజన్సీ ఏరియా గిరిజన మండలల్లో వైద్య %ఆ% ఆరోగ్య విభాగము జాతీయ ఆరోగ్య మిషన్ నందు మాతశిశు ఆరోగ్య ఎపిడమిక్ బృందాల నందు ఖాళీగాఉన్న (3) వైద్య అధికారి పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయుటకు, అర్హులైన అభ్యర్థులు నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి అని, ఏటూరునాగారం ఐటిడిఏ జిల్లా ఉప వైద్య శాఖ అధికారి కె. క్రాంతికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ అభ్యర్థులు మల్టీటోన్- 1 (కాళేశ్వరం జోన్, బాసరజోన్, రాజన్న జోన్, భద్రాద్రి జోన్) స్థానికత కలిగి ఉండవలెను తెలిపారు. విద్యార్హతలు వైద్యాధికారి, పోస్టుకు ఎంబిబిఎస్ పట్టభద్రులై ఉండి, మెడికల్ కౌన్సిల్ లో పేరు నమోదు చేసుకొని యుండాలన్నారు. నియామకము ఒక సంవత్సరం కాంట్రాక్టు పద్ధతిపై తీసుకోబడునని, కావున 'అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు తమ జిరాక్స్ సర్టిఫికెట్స్‌తో జతపరచిన దరఖాస్తులను 21 సాయంత్రం 5 గంటలలోపు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ.) కార్యాలయంలోని జిల్లా ఉప వైద్యాధికారి కార్యాలయంలో అందజేయవలసినదిగా కోరారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు అంగీకరించబడవు" అని పేర్కొన్నారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కుల గణన చేపట్టడం చారిత్రాత్మకమని విశ్వబ్రాహ్మణ-విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నారు. విలేఖరు లతో భీమోజు సురేందర్ మాట్లాడుతు మేము ఎంతో మాకు అంతా అనే నినాదంతో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ముఖ్యమంత్రి నిర్ణయించడం హర్షణీయనియమని పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేందర్ తెలుపారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో రానున్న రోజులలో తెలంగాణలో కాంగ్రెస్ వైపు ప్రజలున్నరని 42 శాతం రిజర్వేషన్లు అమలకోసం అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారని ప్రజల సంతోషం కొరకు కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేందర్ కోరారు.

ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ నియామకం

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ మార్కెట్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారిచేసింది. ఛైర్మెన్ కడం మండలం బెల్లల్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పడిగేల భూమన్న. వైస్ చేర్మెన్ ఖానాపూర్‌కు చెందిన అబ్దుల్ మజీద్‌ను నియమించారు. వీరితో పాటు మరో 16 మందిని మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా నియమించారు. డైరెక్ట ర్లుగా నియమితులైన వారిలో నాగవత్ పుల్యానాయక్, సోమరెడ్డి నారాయ ణరెడ్డి, దాతుర్క గంగాధర్, సాగి అశోక్‌రావు, దండుగుల యాదగిరి, తోకల మహేందర్, ఊరే జలజ, అద్వాలా చిన్న రాజన్న, లక్కవత్తుల నారాయణ, తొడసం విట్టల్, గంప దయాకర్, కట్కమ్ శేఖరయ్యతో పాటు మండల ప్యాక్ చేర్మెన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ఖానాపూర్ మున్సిపల్ ప్రత్యేక అధికారి సభ్యులుగా ఉత్తర్వులు జారీ త్వరలో ఖానాపూర్ ఎమ్మెల్యే, వెడుమ బొజ్జు పటేల్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారాలు చేయనున్నారు.

జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : హెూలీ పండుగను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్.జిల్లా ప్రజలకు హెూలీ వేడుక శుభాకాంక్షలు తెలియజేశారు. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్క చోట చేర్చే ఈ హెూలీ వేడుక ప్రజలందరి జీవితాలలో సంతోషపు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో హెూలీ వేడుక జరుపుకోవాలని అభిలషించారు. సహజ రంగులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా హెూలీ నిర్వహించుకోవాలని హితవు పలికారు.

అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు:కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : రాష్ట్ర వ్యాప్తంగా యువతలో వృత్తి నైపుణ్యాలను పెంచెందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో కొత్తగా గ్రామీణ నియోజకవర్గాలలో ఏటీసీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్‌కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నట్లు చెప్పారు. ఇంకా సుమారు 45 ఏటీసీ కేంద్రాలను గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలలో నెలకొల్పాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఇదే తరహాలో ఐ.టి.ఐ, ఏ.టీ.సీ సెంటర్లు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో కనీసం ఒకటి ఏర్పాటు చెయ్యాలన్నది ప్రభుత్వ ఆలోచన అన్నారు. దీని కోసం అనువైన ప్రదేశం, స్థలాన్ని గుర్తిస్తూ వివరాలతో నివేదికలను త్వరగా సమర్పించాలని కలెక్టర్లకు ఆయన సూచించారు. ఈ సెంటర్ల స్థాపనకు అనువుగా రోడ్డు, రవాణా వసతితో పాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటీసీ కేంద్రాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు అనువుగా ఉంటుందన్నారు. తద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే యువతకు స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు వుంటాయన్నారు.

ఏటిసి, ఐటిఐలకు కొత్తగూడెం జిల్లా బెస్ట్...

ఈ జూమ్ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ జితేష్ మాట్లాడుతూ వివిధ పరిశ్రమలు ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏటిసి, ఐటిఐలకు చాలా అనుకూలమని కలెక్టర్ జితేష్ అన్నారు. జిల్లాలోని అశ్వరావుపేటలో ఐటిఐ స్థాపనకు స్థల గుర్తింపు ప్రక్రియ పూర్తి అయిందన్నారు. గుర్తించిన స్థలం రహదారికి దగ్గరలో ఆర్టీసీ రవాణా సౌకర్యం కూడా ఉందని చెప్పారు. దగ్గరలో పరిశ్రమలు కూడా ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలోనే అశ్వరావుపేట ఆయిల్ ఫామ్‌కు హబ్‌గా ఉందన్నారు. ఇక్కడ వ్యవసాయ కళాశాల కూడా ఉన్నందున ఏటిసి, ఐటిఐ స్థాపనకు అనువయిందన్నారు.

సింగరేణిలో క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఏ ఉద్యోగంలో ఉన్నప్పటికీ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తేనే ప్రజల్లో, అధికారుల్లో మంచి గుర్తింపు ఉంటుందని సింగరేణి శిక్షణ అధికారి ఎండి. జాకీర్ హుస్సేన్ అన్నారు. ఈ నెల10 నుండి నాలుగు రోజులు గురువారం వరకు జరిగిన 49వ ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా జాకీర్ హుస్సేన్ మాట్లాడారు. సింగరేణిలో సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యమన్నారు. మనం నిజాయితీగా, క్రమశిక్షణతో పని చేస్తున్నపుడే సంస్థలో గుర్తింపు వస్తుందన్నారు. ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ సెక్యూరిటీ సిబ్బంది అందరికీ అవసరం అన్నారు. ఈ నాలుగు రోజుల శిక్షణా కాలంలో ట్రాఫిక్ రెగ్యులేటరీ చట్టం, మాండేటరీ, కాషనరీ, ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్, ట్రాఫిక్ పాయింట్ మన్ డ్యూటీస్, క్రౌడ్ కంట్రోల్ వంటి అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీచే పూర్తి అవగాహన కలిగించడం జరిగినదన్నారు. ఈ శిక్షణ వల్ల డ్యూటీ జీవితంలోనే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ఉపయోగకరమైనదని వివరించారు. యస్ అండ్ పిసి ట్రైనింగ్ సెంటర్ అభివృద్ధికి అన్ని రకాల సహకారాలు యాజమాన్యం అందిస్తుందన్నారు. కావున సెక్యూరిటీ సిబ్బంది మెరుగైన వృత్తి నైపుణ్యంతో, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ, సింగరేణి ఆస్తులు, స్థలాలను పరిరక్షించాలని కోరారు. అనంతరం 49వ బ్యాచ్ యస్ అండ్ పిసి సెక్యూరిటీ సిబ్బంది జాకీర్ చేతుల మీదుగా జ్యోతి అనాథ వృద్ధుల శరణాలయ నిర్వాహకులకు నిత్యావసర వస్తువులు వితరణ అందించారు. ఉత్తమ ట్రైనీ లుగా ఎంపికైన ఏ.మల్లికార్జున్, బొటుకు శ్రీనివాసరావులకు బహుమతి ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్స్పెక్టర్ డి.నారాయణరెడ్డి, జి.భాస్కర్ రెడ్డి, జమేదార్, ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ బంజారా సంఘం ప్రధాన కార్యదర్శిగా హరీష్ నాయక్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : సేవాలాల్ బంజారా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా భూక్యా హరీష్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం కొత్తగూడెం టౌన్ ఏరియాలో అసంఘం సమావేశం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు నునావత్ రాంబాబు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు. బంజారాలు తమ హక్కులకోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తోపాటు జిల్లా గౌరవ అధ్యక్షులు అజ్మీరా రమేష్ నాయక్, సుజాతనగర్ మండల అధ్యక్షుడు బానోత్ బాలాజీ నాయక్ లను కూడా ఎన్నుకున్నారు. ఈ మేరకు నియామకపు పత్రాన్ని ప్రసాద్ నాయక్ చేతులమీదుగా తీసుకున్నారు. ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ కొత్తగా నియమితులైన వారు జాతి కోసం జాతి అభివృద్ధి, హక్కుల కోసం సంఘం నిర్ణయం మేరకు పని చేయాలని కోరారు. ఏజెన్సీ ఏరియాల్లో 1/70 యాక్టు, పిసా చట్టాలు కేవలం పేరుకేఉన్నాయని ఆక్రమణలు అధికారుల అండదండలతో జరిగిపోతున్నాయని విమర్శించారు. గిరిజన భూ సమస్యలు చుంచుపల్లి, లక్ష్మీదేపల్లి మండలాల్లో అనేకం ఉన్నాయని వివరించారు. ఏజెన్సీ ఏరియాల్లో ఎక్కువ భూ సమస్యలు ఉన్నందున వీటి పరిష్కారానికి కొత్తగా నియమితులైన సంఘం నాయకులు కృషి చేయాలని కోరారు. గిరిజనుల సమస్యలు ఎప్పటికప్పుడు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి తేజావత్ రవికుమార్ నాయక్, జిల్లా కార్యదర్శులు ధరావత్ నాగరాజు నాయక్, బోడ మంగ్యా నాయక్, భానోత్ లక్ష్మణ్ నాయక్, గణేష్ నాయక్ పాల్గొన్నారు.

కోగిల మహేష్ అక్రమ అరెస్టుకు ఖండన

విశాలాంధ్ర - నేరేడుచర్ల : దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేష్ ను గురువారం పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం హుజూర్ నగర్ నియోజకవర్గ దళిత బంధు సాధన సమితి కన్వీనర్ నందిపాటి గురవయ్య ఇది అక్రమ అరెస్ట్ అని తీవ్రంగా ఖండించారు. అనంతరం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పక్షాన ఎలాంటి పిలుపు లేకున్నా దళిత బంధు లబ్ధిదారులు ఎలాంటి కార్యక్రమాలు చేయకున్నా, ఈ ప్రభుత్వం ఏర్పడి 15 నెలల కాలం పూర్తవుతున్న ఓపికతో ప్రభుత్వ అధికారులకు, మంత్రులకు వినతిపత్రం ద్వారా విన్నవించుకున్నామే తప్ప ప్రభుత్వం పైన ఎక్కడ కూడా విమర్శలు కానీ ఒత్తిడి కాని తీసుకురాలేదు. కానీ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ ని కలిసి వినతి పత్రం ఇచ్చారన్న అక్కసు తోటి ఈ ప్రభుత్వం బుధవారం రోజు నుండి దళిత బంధు నాయకులను అరెస్టు చేయడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శించారు. ఇదే కనుక పునరావృతం అయితే భవిష్యత్తులో అన్ని పార్టీలలో ఉన్న దళిత నాయకులను, దళిత ప్రజాప్రతినిదులను,ప్రతిపక్ష నాయకులను కలిసి మాకు మద్దతు తెలిపే విధంగా,మా పోరాటానికి సంఘీభావం తెలిపే విధంగా కోరుతామన్నారు.గత ప్రభుత్వం మాకు ఇచ్చిన నిధులను విడుదల చేయకుండా ఇలాంటి అక్రమ అరెస్టులు చేయడం ప్రభుత్వ దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. ఇలాంటి అరెస్టులు ఎన్ని చేసినా మా దళిత బంధు లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు ఎలాంటి అరెస్టులకు భయపడేది లేదన్నారు.

సంపాదకీయం

ఎయిర్‌టెల్, జియో పిల్లిమొగ్గ

మన దేశంలోని ఇంటర్నెట్ సదుపాయం కల్పించే స్టార్ లింక్‌తో అంటే ఎలాన్ మస్క్ అధీనంలోని స్పేసెక్స్‌తో భారతీ మిత్తల్ అధీనంలోని ఎయిర్ టెల్ సంబంధాలు పెట్టుకుని ఉపగ్రహం ద్వారా ఇంటర్నెట్ సదుపాయం అందిస్తుందట. ఎలాన్ మస్క్ కంపెనీతో మన దేశంలోని దిగ్గజ కంపెనీ జోడీ కట్టడం అంటే పిల్లి మొగ్గ వేసినట్టే. ఎలాన్ మస్క్ అధీనంలోని స్పేసెక్స్ మన దేశంలో అడుగుపెట్టడానికి వీల్లేదని మొన్నటి దాకా ఎయిర్ టెల్ వాదించేది. లైసెన్స్ రుసుము, స్పెక్ట్రం ధర గురించి ఎయిర్ టెల్ స్టార్ లింక్‌తో విభేదించేది. స్టార్ లింక్ ద్వారా ఇంటర్నెట్ సదుపాయం అంటే నేరుగా ఉపగ్రహం ద్వారా ఇంటర్నెట్ సౌకర్యం అందించడం. ఎయిర్‌టెల్, జియో కూడా ఇదివరకు ఉపగ్రహం ద్వారా ఇంటర్నెట్ సదుపాయం కల్పించడానికి సిద్ధ పడ్డవే. స్పెక్ట్రం అందజేయడానికి కేంద్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని టెలీకాం బిల్లులో చేరుస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2024లో ఇండియా మొబైల్ కాంగ్రెస్ జరిగినప్పుడు ఉపగ్రహ కంపెనీలు లైసెన్స్ రుసుము చెల్లించాల్సిందేనన్న జియో వాదనను సునీల్ మిత్తల్ సమర్థించారు. అయితే స్టార్ లింక్ తో లైసెన్స్ రుసుము చెల్లించే విషయంలో తనకు ఎలాంటి విభేదమూ లేదని కూడా మిత్తల్ అన్నారు. టెలీకాం కంపెనీల్లాగే స్టార్ లింక్ కూడా స్పెక్ట్రం కొనుక్కోవాల్సిందేనని ఆయన అన్నారు. అంతకు ముందు జియో కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. సునీల్ మిత్తల్ 2024లో ఇండియా మొబైల్ కాంగ్రెస్ లో మాట్లాడినప్పుడు ప్రధానమంత్రి మోదీ కూడా అక్కడే ఉన్నారు. స్టార్ లింక్ మన దేశంలో సేవలు అందించడం అంటే భారీ సమస్య ఎదుర్కోవడమేనన్న అభిప్రాయం అప్పుడు వ్యక్తం అయింది. మన దేశంలో ప్రవేశించాలని స్టార్ లింక్స్ 2022 నుంచి ప్రయత్నిస్తూనే ఉంది. స్టార్ లింక్‌కు స్పెక్ట్రం కేటాయించడానికి మొన్న మొన్నటి దాకా వ్యతిరేకించిన ఎయిర్ టెల్, జియో కంపెనీలు అమాంతం తమ వైఖరి మార్చుకోవడంలో ఏదో గుట్టు ఉండే ఉంటుంది. మన దేశంలోని ఎయిర్‌టెల్‌తో స్టార్ లింక్ ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల రెండు ప్రభావాలు ఉండొచ్చు. ఒకటి మన కంపెనీలు స్టార్ లింక్స్‌తో ఒప్పందం చేసుకుని తమ సేవలు అందించడం, రెండో వేపున స్టార్ లింక్ నేరుగా ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం. ప్రధానమంత్రి మోదీ ఇటీవల అమెరికా పర్యటన సందర్భంగా ఎలాన్ మస్క్‌తో చర్చలు జరిపిన పర్యవసానంగానే ఎయిర్ టెల్ స్టార్ లింక్‌పై వ్యతిరేకతను విడనాడిందని అర్థం అవుతూనే ఉంది. మొబైల్ టెలిఫోన్లు, ఇంటర్నెట్ సదుపాయం కల్పించే వ్యాపారంలో విపరీతమైన పోటీ ఉంటుంది. అందుకే ఎయిర్‌టెల్, జియో ప్రధాని అమెరికా పర్యటన తరవాత పిల్లి మొగ్గ వేసి ఉంటాయి. ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖేశ్ అంబానీ హాజరైన విషయాన్ని కూడా ఇక్కడ గమనంలో ఉంచుకోవాలి. పోటీ పడడం కన్నా సహకరించుకుని పని చేయడమే మేలని ఎయిర్ టెల్ భావించి ఉంటుంది. స్టార్ లింక్‌తో ఎయిర్ టెల్ పొత్తు కుదుర్చుకుంటే అంబానీ విపరీతమైన పోటీ ఎదుర్కోవలసి ఉంటుంది. అంబానీ టెలీకాం సామ్రాజ్య ఆధిపత్యం అంతమవుతుందేమో! ఇదంతా చూస్తే మోదీకి సన్నిహితులు ఎవరు అన్న ప్రశ్న ఎదురవుతుంది. అంబానీని మోదీ దూరం పెడ్తున్నారని కూడా అనిపించక తప్పదు. ఈ ఊహా గానాలన్నీ సాగుతున్న దశలోనే బుధవారం అంబానీ అధీనంలోని జియో కూడా పొత్తు కుదుర్చుకుంటుందన్న వార్త వచ్చింది. భరించరాని పోటీ ఎదుర్కోవడం కన్నా స్టార్ లింక్‌తో తాము కూడా సంబంధం పెట్టుకుని తమ వాటా వ్యాపారం తాము చేసుకోవడం మంచిదని అంబానీ నిర్ణయానికి వచ్చారనుకోవాలి. మస్క్ అధీనంలోని కంపెనీ ఒకటే. అదే స్టార్ లింక్ ద్వారా ఇంటర్నెట్ సదుపాయం కల్పించే స్పేసెక్స్. అలాంటప్పుడు పరస్పరం పోటీ పడుతున్న ఎయిర్‌టెల్, జియో ఎలాన్ మస్క్ కంపెనీతో పొత్తు ఎలా పెట్టుకోగలవన్నది ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్నే.

తాము స్టార్ లింక్‌తో సంబంధాలు పెట్టుకుంటామని మిత్తల్ ప్రకటించినప్పుడు జియో ప్రస్తావనే తీసుకు రాలేదు. అలాగే స్టార్‌లో ఒప్పందం కుదుర్చుకుంటున్నామని జియో అధినేత ముఖేశ్ అంబానీ ప్రకటించినప్పుడే ఎయిర్‌టెల్ ప్రస్తావన తీసుకు రాలేదు. ప్రధాన మంత్రి అమెరికా వెళ్లినప్పుడు మస్క్ కుటుంబ సమేతంగా మోదీని కలుసుకున్నారు. మస్క్ కుటుంబంతో పాటు వచ్చారు కాని ఆ సమావేశంలో మోదీతో పాటు ఆయన వెంట వెళ్లిన ఉన్నతాధికార బృందం అంతా మస్క్-మోదీ చర్చిస్తున్నప్పుడు అక్కడే ఉంది. ప్రధాని అమెరికా పర్యటన ముగిసిన సందర్భంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో కూడా టెలీకాం రంగంలో ఎలాన్ మస్క్‌తో కలిసి పనిచేస్తామన్న ప్రస్తావనే లేదు. ఈ ప్రకటనలో ఉన్నదల్లా అమెరికా జాతీయ విజ్ఞాన శాస్త్ర ఫౌండేషన్, భారత్ లోని విజ్ఞాన శాస్త్ర సంబంధ సంస్థలు కలిసి పని చేస్తాయని మాత్రమే ఉంది. ఇంతకు ముందు అమెరికా వ్యాపారస్థులు భారత్ తో వ్యాపారం చేయాలనుకుంటే వారు భారత్ వచ్చి ఉన్నతాధికారులతో సహా ప్రధానమంత్రిని కూడా దర్శించుకునే వారు. కానీ మన దేశంలో రెండు టెలీకాం దిగ్గజాలతో వ్యాపార సంబంధాలు ఏర్పాటు చేసుకోవడానికి, లేదా ఏర్పాటు చేసుకుంటామని ప్రకటించడానికి ఎలాన్ మస్క్ మన దేశానికి రానే లేదు. మొత్తం వ్యవహారం అంతా వాషింగ్టన్ లోనే జరిగిపోయినట్టుంది. మన దేశంతో వ్యాపారం చేయాలనుకునే వారు మన దేశంలోని చట్టాలకు లోబడి పని చేయాల్సి ఉంటుంది. మన దేశంలో మస్క్ పెద్ద వాటాదారుగా ఉన్న టెస్లా కార్ల అమ్మకం కేంద్రం ఏర్పాటు చేస్తారన్న వార్తా వచ్చింది. స్టార్ లింక్ అంటే మస్క్ అధీనంలోని స్పేసెక్స్‌లో అంతర్భాగమే. ఈ కంపెనీకి చెందిన 6.400 కన్నా ఎక్కువ ఉపగ్రహాలు అంతరిక్షంలో తిరుగుతూ ఉంటాయి. అంతరిక్షంలో తిరుగుతున్న ఉపగ్రహాలలో మూడింట రెండువంతుల ఉపగ్రహాలు మస్క్ యాజమాన్యంలోనే ఉన్నాయి. స్టార్ లింక్ వల్ల ఇంటర్నెట్ వేగం పెరుగుతుంది. మధ్యమధ్యలో అంతరాయాలూ ఉండవంటున్నారు. స్టార్ లింక్ సేవలు అందాలంటే మన దేశంలో లాగా ప్రతి నాలుగు రోజులకు ఒక సారి రోడ్లు తవ్వి ఆప్టికల్ ఫైబర్ పరచవలసిన పనీ లేదు. స్టార్ లింక్ చాలా ఖరీదైన వ్యవహారం అన్నది మరిచిపోవాల్సిందే. ఎందుకంటే అమెరికాలో స్టార్ లింక్ సదుపాయం పొందాలంటే నెలకు 120 డాలర్లు చెల్లించాల్సి వస్తుంది. ఈ మొత్తాన్ని రూపాయల్లోకి మార్చి చూస్తే అది నెలకు 10,000 రూపాయలకన్నా ఎక్కువ అని తెలిస్తే గుండె గుభేల్ మంటుంది. కెన్యాలో మస్క్ ఈ సదుపాయం నెలకు పది డాలర్లకే అందిస్తున్నారు. అన్నింటికన్నా పెద్ద ప్రశ్న గ్రామ గ్రామానికీ ఆప్టికల్ ఫైబర్ పరిచేయాలన్న ప్రభుత్వ ఆలోచన భవిష్యత్తు ఏమిటి? ఇప్పటికే దీనికోసం కోట్లాది రూపాయలు వెచ్చించారు. ఆప్టికల్ ఫైబర్ గురించి 2020 నుంచి మోదీ గొప్పలు చెప్తూనే ఉన్నారు. వెయ్యి రోజుల్లో గ్రామ గ్రామానికీ ఆప్టికల్ ఫైబర్ పరిచేస్తామన్నారు. 2022 ఎర్రకోట మీంచి ప్రసంగిస్తూ ఇదే మాట చెప్పారు. మన దేశంలో ఆరు లక్షలకు పైగా గ్రామాలు ఉన్నాయి. 2024 డిసెంబర్ రెండో తేదీ దాకా కేవలం 2, 14, 313 పంచాయితీలకు మాత్రమే ఆప్టికల్ ఫైబర్ పరిచే పని పూర్తి అయిందట. ఇదీ మన వేగవంతమైన అభివృద్ధి పథం!

ప్రత్యేక కోశల్‌పై మళ్లీ ఉద్యమం

డా॥ జ్ఞాన్‌పాఠక్

ఒడిశా రాష్ట్రాన్ని విభజించేందుకు బీజేపీ నాయకత్వం కుయుక్తులు ప్రారంభించింది. పశ్చిమ ప్రాంతంలోని కోశల్ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని గతంలో చేసిన ఉద్యమం మళ్లీ తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీ సీనియరు నాయకుడు జయ నారాయణ మిశ్రా ఇటీవల మాట్లాడుతూ కోశల్ ప్రాంతాన్ని ఒడిశాలో కలిపి వేయాలని పిలుపు ఇవ్వడం చారిత్రక తప్పిదమని అన్నారు. అయితే తమ నాయకుడితో విభేదిస్తున్నామని బీజేపీ ప్రకటించింది. దీర్ఘకాలం నుంచి కోశల్ ప్రాంత ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం జరుపుతూనే ఉన్నారు. 2004 లో డిప్యూటీ ప్రధానిగా ఉన్న బీజేపీ నాయకుడు లాల్‌కృష్ణ అద్వానీ బొలంగీర్‌లో పర్యటించినప్పుడు ఒడిశా అసెంబ్లీ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమోదించినట్లయితే తాము కూడా ప్రత్యేక రాష్ట్రానికి అనుకూలంగా ఉన్నామని అన్నారు. 2004 లో బిజూ జనతాదళ్ (బీజేడీ) పాలక పార్టీగా ఉన్నది. అందువల్ల అద్వానీ బాధ్యతను బీజేడీపైకి నెట్టారు. రెండు దశాబ్దాలు గడిచిన తరువాత పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు కేంద్రంలోను, రాష్ట్రంలోను బీజేపీ పరిపాలన చేస్తున్నది. రాష్ట్రానికి చెందిన బీజేపీ సీనియరు నాయకుడు జయ నారాయణ్ మిశ్రా కోశల్ ప్రాంతం ఒడిశాలో కలిసిపోవటం 'చారిత్రక తప్పిదం' అన్నారు. గతంలో చాలామంది బీజేపీ నాయకులు ప్రత్యేక కోశల్ రాష్ట్రం ఏర్పాటుకు డిమాండ్ చేశారు. ఆనాడు జరిగిన ఉద్యమానికి తోడ్పాటు పలికారు. అయితే ప్రస్తుతం కోశల్ ప్రాంతంలో ప్రత్యేక రాష్ట్రం కోసం మళ్లీ ఉద్యమం ప్రారంభమవుతోంది. ఉదాహరణకి బీజేపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే, ఎంపీ బాల్‌గోపాల్ మిశ్రా మాట్లాడుతూ కోశల్ ప్రత్యేక రాష్ట్రం కోసం డిమాండ్ పెరుగుతోందని అన్నారు. కొత్తగా ఎన్నికైన ఎంపీ, బొలంగీర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమ సూచనలను గమనించడంలో విఫలమయ్యారని చెప్పారు. 2004 ఉద్యమ సందర్భంగా బీజేపీ వైఖరి వేరుగా ఉంది. ప్రస్తుతం కొంతమంది బీజేపీ నాయకులు కోశల్ ప్రత్యేక రాష్ట్రానికి చేస్తున్న ఉద్యమానికి తోడ్పాటు ఇవ్వాలని కూడా భావిస్తున్నారు. ఒడిశా పశ్చిమ ప్రాంతంలో గిరిజనులు ఎక్కువగా ఉన్న పది జిల్లాలు ఉన్నాయి. ప్రత్యేక రాష్ట్రం కోసం ఈ జిల్లాలలో ఎక్కువగా ఆందోళన చేయనున్నారు. సంబల్‌పూర్, జెర్సగుడా, సుందర్‌ఘర్, బర్గరహ్, కలహండి, నౌపడ, దియోఘర్, సోనేపూర్, బౌద్ధ్, బలంఘీర్ జిల్లాలలో గిరిజనులు చాలా ఎక్కువగా ఉన్నారు.

బీజేపీ ఎంపీ బాలగోపాల్ మిశ్రా 'కోశల్ ముక్త్ రథ్' పేరుతో ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని ఉద్యమం కోసం జనాన్ని సమీకరించడానికి సిద్ధపడుతున్నారు. సంబల్‌పూర్ 1936 లో ఒడిశాలో విలీనం అయింది. దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత 1948లో కోశల్ ప్రాంతాలు విలీనమయ్యాయి. భూస్వామ్య రాజ్యాలు సంస్థానాల విలీనాన్ని వ్యతిరేకించాయి. అయితే స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ఒడిశాలో చేరడానికి అంగీకరించాయి. పాట్నా, కలహండి, సోనేపూర్ పాలకులు ఒడిశాలో విలీనానికి ప్రధానంగా వ్యతిరేకించారు. స్వయం ప్రతిపత్తి లేకుండా ఉండి ఒడిశాలో చేరితే కోస్తా ఒడిశా రాజకీయంగా తమను నియంత్రిస్తుందని భయపడ్డారు. 1948 లో ఈ ప్రాంతాలు ఒడిశాలో విలీనం అయినప్పటికీ ప్రత్యేక కోశల్ డిమాండ్ మాత్రం సమసిపోలేదు. బొలంగీర్‌కు చెందిన స్వతంత్ర పార్టీ నాయకుడు రాజేంద్రసింగ్‌దేవ్ ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన పాలనలో ప్రత్యేక కోశల్ రాష్ట్రానికి ఉద్యమం సమసిపోయింది. 1990 లలో మళ్లీ కోశల్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం తలెత్తింది. సంబల్‌పూర్‌కు చెందిన న్యాయవాది ఒడిశా ప్రభుత్వం కోశల్ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపిస్తూ మరోసారి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ప్రారంభించారు. కోశల్ సేన పేరుతో జనాన్ని సమీకరించారు. ప్రచారం కోసం కోశల్ ఖబర్ పత్రికను ప్రారంభించారు. ఈ ఉద్యమం క్రమంగా పెరిగింది. అనేక సంఘాలు ఈ ఉద్యమంలో చేరాయి. వీటిలో వెస్ట్రన్ ఒడిశా, యువ మంచ్, కోశల్ యూత్ కో ఆర్డినేషన్ కమిటీ, కోశల్ స్టేట్ కో ఆర్డినేషన్ కమిటీ, కోశల్ ముక్త్ బహనీ, కోశల్ ముక్త్ మోర్చా, కోశల్ ముక్త్ సేన తదితర సంఘాలు ఉద్యమంలో చేరాయి. ఈ నేపథ్యంలో బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే జయ నారాయణ్ మిశ్రా ఒడిశాలో కోశల్ విలీనంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒడిశా అసెంబ్లీలో కాంగ్రెస్ ఈ సమస్యను తిరిగి ప్రేరేపించింది. మంగళవారం ఈ సమస్య పైన బీజేపీ గందరగోళాన్ని సృష్టించింది. ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్షం, పాలక పక్షానికి చెందిన సభ్యుల మధ్య తోపులాట జరిగింది.

జయనారాయణ్ మిశ్రా అయిదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రభుత్వం తరఫున సంబల్‌పూర్ నియోజక వర్గంలో ఒక సమావేశం జరిగింది. ఇందులో ఆయన ప్రసంగం చేస్తూ "అన్ని రంగాలలో అనగా గనుల తవ్వకం, వ్యవసాయం, అటవీ ఫలాలు, సేవలు తదితరాలలో మేము దోపిడీకి గురయ్యాం. మా సాంస్కృతిక హక్కులను తిరస్కరించారు. కోశల్ ప్రాంతం ఒడిశాలో విలీనమైనట్లయితే అది చరిత్రాత్మక తప్పిదం అవుతుంది." అని అన్నారు. తాను ఏ మాత్రం తప్పుగా మాట్లాడలేదని ఒడిశాలో విలీనం కావటం కంటే ఈ ప్రాంతం అభివృద్ధి కావాలన్నదే తన లక్ష్యం అన్నారు. ఈ అంశంపై సమీక్షించేందుకు 1991 లో ముఖ్యమంత్రిగా ఉన్న బిజూపట్నాయక్ ఒక కమిటీని వేశారు. ఈ కమిటీ మూడు సంవత్సరాల తర్వాత తన నివేదికను అందజేసింది. ఈ నివేదికలో 25 వెనుకబడిన బ్లాకులను, 34 తీవ్రంగా వెనుకబడిన డెవలప్ మెంట్ బ్లాక్‌లను గుర్తించింది. పశ్చిమ ఒడిశా అభివృద్ధి మండలిని 1998 లో ఏర్పాటు చేశారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి బీజేడీ నాయకుడు నవీన్‌పట్నాయక్ ఈ ప్రాంతంలో వెనుకబాటు తనాన్ని అధ్యయనం చేసేందుకు కమిషన్ ఏర్పాటు చేశారు. ఎస్.కె.మొహంతి కమిషన్‌కు అధిపత్యం వహించి 2008 లో నివేదికను సమర్పించారు. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో కేటాయించినట్లుగానే 2025-26 వ ఆర్థిక సంవత్సరానికి ఈ ప్రాంత అభివృద్ధి కోసం బడ్జెట్‌లో 500 కోట్లు కేటాయించారు. ఉద్యమం మరింత తీవ్రం అవడానికి ముందే డబుల్ ఇంజన్ ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందా?

సమాజోన్నతికి మార్క్స్ మార్గదర్శి

డి.వి.వి.యస్.వర్మ

మార్క్సిస్టు మహామహోపాధ్యాయుడు కార్ల్ మార్క్స్ 1883 మార్చి 14న మరణించారు. మార్చి 17న లండన్‌లోని హైగేట్‌లో మార్క్స్ సమాధి దగ్గర ఆయన జీవన సహచరుడు ఏంగెల్స్ ప్రసంగిస్తూ "డార్విన్ ఏ విధంగా జీవ ప్రకృతి అభివృద్ధి నియమాన్ని కనుగొన్నారో సరిగ్గా అదే విధంగా మార్క్స్ మానవ చరిత్ర అభివృద్ధి నియమాన్ని కనుగొన్నారు. కారల్ మార్క్స్ పేరు యుగయుగాల వరకు సజీవంగా వుంటుంది. ఆయన కృషి చిరస్థాయిగా వుంటుంది " అని చెప్పిన మాటలు అక్షర సత్యాలు. మార్క్స్ 142వ వర్ధంతికి ఒక వ్యాసం రాయాలని కార్ల్ మార్క్స్ పేరును బింగ్ సెర్చ్‌లో చూస్తే 1 కోటి 55 లక్షల ఫలితాలు వచ్చాయి. ఇతర ప్రముఖులకు అందనంత ఎత్తులో మార్క్స్ ఉన్నాడు. 141 సంవత్సరాల తర్వాత కూడా ప్రపంచం అంతా చర్చిస్తున్న అత్యంత ప్రభావశీలిగా మార్క్స్ కొనసాగుతున్నాడు. ఈ వెతుకులాటలో మరో పుస్తకం కనిపించింది. "మార్క్స్ ఇండియాకు వచ్చారు" (Marx comes to India) అన్న పేరు ఆకర్షించింది. ఈ పుస్తకాన్ని 1975లో మనోహర్ బుక్ సర్వీసెస్ వారు ప్రచురించారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు పీసీ జోషి, కె దామోదరన్ సంయుక్తంగా సుదీర్ఘమైన ముందుమాట రాశారు. ఈ ముందుమాటలో రెండు ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి.

మొదటిది: మార్క్స్ జీవించి వున్న కాలంలోనే ఆయనతో కలకత్తాకు చెందిన తొలి సోషలిస్టు భావజాలికులు నెలకొల్పుతున్న సంబంధాల ప్రస్తావన ఆశ్చర్య పరిచింది. మార్క్స్ సారథ్యంలో 1866లో ప్రారంభమైన ఇంటర్‌నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్‌లో భారతదేశపు విభాగాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతించమని కోరుతూ ఈ కలకత్తా మిత్రులలో ఒకరు లేఖ పంపించారు. 1871 ఆగస్టు 15న జరిగిన ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్‌లో ఆ లేఖను చర్చించినట్లు మినిట్స్‌లో పేర్కొన్నారు. ఈ విభాగం ఏర్పాటుకు అనుమతిస్తూ, స్వయం పోషకంగా వుండాలని, స్థానికులను సభ్యులుగా చేసుకోవాలని సలహా ఇచ్చినట్లు మినిట్స్‌లో వున్న దానిని ముందుమాటలో ఉటంకించారు. అంతేకాదు 1871 ఆగస్టు 19న 'ది ఈస్టర్న్ పోస్టు నంబరు 151'లో ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్ సమావేశంపై ప్రచురించిన వార్తలో కలకత్తా నుంచి అందిన ఉత్తరంలోని కొన్ని భాగాలను ఉటంకిస్తూ వచ్చిన వార్తను యథాతథంగా మన ముందుంచారు. అధికారయుతంగా ఇంత సమాచారం దొరికినప్పటికీ కలకత్తా బృందం పేర్లు మాత్రం రికార్డులలో కనిపించలేదని ముందుమాటలో రాశారు.

రెండో అంశం : సోవియట్ విప్లవం తర్వాత మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ రచనలు చాలా వచ్చాయి. కాని, రష్యన్ విప్లవానికి ముందే 1912లో ఉత్తర భారతదేశానికి చెందిన హరదయాళ్, కేరళకు చెందిన రామకృష్ణ పిళ్ళై మార్క్స్ జీవిత చరిత్రలు రాశారు. ఆ రెండు పుస్తకాలను ఇందులో ప్రచురించారు. మార్క్స్ జీవించి వున్న కాలంలో, రష్యన్ విప్లవం జరగడానికి ముందుగానే ఇలా మార్క్స్ భారతదేశానికి వచ్చిన అపురూపమైన విషయాలను ఈ పుస్తకం వెల్లడిస్తుంది. రష్యన్ విప్లవ ప్రభావం మన దేశంలో జరుగుతున్న జాతీయోద్యమం మీద గొప్ప ప్రభావాన్ని చూపించింది. మార్క్స్ భావజాలం, రష్యన్ విప్లవ ప్రభావంతో జాతీయోద్యమంలో భాగంగా 1920 లో కార్మిక వర్గాన్ని సంఘటిత పరిచే అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ఏర్పడింది. 1923 లోనే తొలి మేడేను మద్రాసులో సింగారవేలు చెట్టియార్ నిర్వహించి, ఎర్ర జెండాను మొదటిసారి ఎగురవేశారు. వివిధ ప్రాంతాల్లో వున్న కమ్యూనిస్టులు 1925 లో కమ్యూనిస్టు పార్టీగా సంఘటితం అయ్యారు. కార్మిక సంఘాలతోపాటు వివిధ ప్రజా సంఘాలను నిర్మించి జాతీయోద్యమంలో ప్రజల భాగస్వామ్యాన్ని విస్తరింపజేశారు. గాంధీజీ స్వాతంత్ర్యోద్యమానికి సారథిగా గుర్తింపు పొందినా ఈ ప్రజా సంఘాల ఉద్యమాల ఒత్తిడితోనే గాంధీజీ సహాయ నిరాకరణ నుంచి పూర్ణ స్వరాజ్యానికి, ఉప్పు సత్యాగ్రహం పేరుతో శాసనోల్లంఘనకీ అంతిమంగా "సాధించడం లేదా మరణించడం " నినాదంతో క్విట్ ఇండియా ఉద్యమానికి పూనుకున్నారు. ఈ ప్రజా ఉద్యమాల వెనుక మార్క్స్ భావజాలం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అలాగే మార్క్స్ భారతదేశం మీద న్యూయార్క్ టైమ్స్‌కి అపురూపమైన వ్యాసాలు రాశారు. 1857 తిరుగుబాటును తొలి భారత స్వాతంత్ర్య సంగ్రామంగా పేర్కొన్నారు. భారతదేశాన్ని బ్రిటిష్ పాలకులు దోచుకున్న సంపదను అణాపైసలతో లెక్కలు గట్టి ప్రకటించారు. స్వదేశీ ఉత్పత్తులను, చేతి వృత్తులను ఎలా నాశనం చేసింది బైట పెట్టారు. భారతీయ గ్రామీణ వ్యవస్థ ప్రత్యేకతలను, కులవ్యవస్థ పాత్రను విశ్లేషించే వ్యాసాలు రాశారు. అవి నేటికీ అపురూపమైన రచనలుగానే ఉన్నాయి. స్వాతంత్ర్యానంతరం తొలి ఎన్నికల్లో కమ్యూనిస్టులు ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగిన క్రమంలో మార్క్స్ భావజాలం దేశ ప్రజలలో పొందిన విశేష ఆదరణకి తార్కాణంగా నిలుస్తుంది.

తెలుగు రాష్ట్రాలలో మార్క్స్ భావజాలం రాజకీయరంగాన్నే కాదు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో విప్లవాత్మక పరిణామాలను తెచ్చింది. 1990 వ దశకంలో మార్క్స్‌కు గ్రహణం పట్టినట్లు అనిపించింది. సోవియట్ యూనియన్, సోషలిస్టు దేశాలు కనుమరుగు కావడంతో పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు మార్క్స్ భావజాలానికి కాలం చెల్లిందని ప్రకటించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ చిరస్థాయిగా వుంటుందని ప్రచారం చేశారు. ఈ ప్రచారం మూణ్ణాల ముచ్చటే అయింది. 2008 నుంచి పెట్టుబడిదారీ దేశాలు ఒక దాని తర్వాత మరొకటి చివరికి అన్నీ సంక్షోభంలో కూరుకుపోయాయి. ఉద్దీపనల చిట్కాలు వాటిని గట్టెక్కించలేకపోతున్నాయి. దాంతో పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు బుర్రలు గోక్కుంటున్నారు. పెట్టుబడి చలన సూత్రాల కోసం మార్క్స్ రచనలే శరణ్యం అంటున్నారు. ఇప్పుడు ప్రపంచ వ్యాపితంగా మార్క్స్ రచనల అధ్యయనం విస్తారంగా పెరిగింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంపద కేంద్రీకరణ అనివార్యం అని అదే స్థాయిలో పేదరికం, దారిద్ర్యం మరొక చోట పేరుకుపోతుందని మార్క్స్ చేసిన విశ్లేషణ నేటి అంతరాల ప్రపంచం తిరుగులేని వాస్తవంగా నిరూపిస్తున్నది. ఈ నేపథ్యంలో 10 సంవత్సరాలు పైబడిన మోదీ పాలనను పరిశీలన చేసుకోవాలి.

మోదీ పాలనలో ప్రపంచంలోనే అత్యధికంగా అంతరాలు పెరిగిన దేశంగా భారత్ మారింది. 2013 నాటికి 50 మంది బిలియనీర్లు అంటే 100 కోట్లకు పైబడిన డాలర్ల సంపద గల వారు లేదా 8000 కోట్ల రూపాయలకు పైబడిన సంపదగల వారు వుంటే 2024 నాటికి 169 మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. ప్రపంచ బిలియనీర్లలో అమెరికా, చైనా తర్వాత మూడో స్థానానికి దూసుకు పోయింది. ఈ 169 మంది బిలియనీర్ల దగ్గరే 78 లక్షల కోట్ల సంపద పోగుపడింది. ఆక్స్ ఫామ్ నివేదికల ప్రకారం దేశంలో 1 శాతం మంది దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడగా 10 శాతంగా వున్న బిలియనీర్లు, కార్పొరేట్లు, కుబేరుల దగ్గర



నేడు కారల్ మార్క్స్ 142 వర్ధంతి

> **సోవియట్ విప్లవం తర్వాత మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ రచనలు చాలా వచ్చాయి. కాని, రష్యన్ విప్లవానికి ముందే 1912లో ఉత్తర భారతదేశానికి చెందిన హరదయాళ్, కేరళకు చెందిన రామకృష్ణ పిళ్ళై మార్క్స్ జీవిత చరిత్రలు రాశారు. ఆ రెండు పుస్తకాలను ఇందులో ప్రచురించారు.**

మొత్తం దేశ సంపదలో 77 శాతం గుట్టపడింది. ఒక దశాబ్ద కాలంలోనే విపరీతంగా దేశంలో సంపద కేంద్రీకరణ జరిగింది. స్థూలంగా 10 ఏళ్ల మోదీ పాలన ప్రధానంగా కార్పొరేట్ల కోసం సాగిన పాలన. దాని పర్యవసానంగానే దేశ సంపద వారి పంచకు చేరింది. ఈ 10 ఏళ్లలో 35 శాతం గావున్న కార్పొరేట్ పన్నును అంచెలంచెలుగా 22 శాతానికి తగ్గించారు. వారికే దాదాపు 20 లక్షల కోట్ల అప్పులను రద్దు చేశారు. గతంలో 10 శాతం వున్న వారసత్వ పన్నును పూర్తిగా తొలగించారు. ఇది మోదీ పాలన సంగ్రహ చిత్రం.

దేశ సంపదను కార్పొరేట్లు స్వంతం చేసుకుంటూ పోతున్నారు. మరో పక్క రైతులు , సామాన్యులు , పేదలు కార్పొరేట్ల అనుకూల పాలనలో నలిగి పోతున్నారు. 10 శాతంగా వున్న కార్పొరేట్ల దోపిడీకి- 75 శాతం నలిగి పోతున్న దేశ ప్రజలకీ మధ్య నెలకొన్న వైరుధ్యమే ప్రస్తుత ప్రధాన వైరుధ్యంగా గుర్తించాలి. మార్క్స్ ఏనాడో చెప్పిన సంపద కేంద్రీకరణ దాని పర్యవసానాలు ఇప్పుడు మోదీ పాలనలో ప్రత్యక్షంగా చూస్తున్నాం. కార్పొరేట్ల దోపిడీని కట్టడి చెయ్యడానికి, శ్రమజీవుల సంక్షేమ విస్తరణకి పోగుపడ్డ సంపద పునఃపంపిణీ తక్షణ అవసరం అయ్యింది. ఈ దిశగా అన్ని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ప్రజలను సమీకరించే ఉద్యమాలకు సన్నద్ధం కావాలి. మోదీ పాలనాపరంగా బలహీనుడే, ప్రజల మీద భారాలు మోపే సాధారణ రాజకీయ నాయకుడే, కార్పొరేట్ దోపిడీకి ద్వారాలు తెరిచేవాడే. ఆయన ప్రజాకర్షణ ఆయన అనుసరిస్తున్న రాజకీయవిధానాలలో లేదు. విభజన రాజకీయంలో విద్వేష భావజాలం లో వుంది. దానిని తన ఆకర్షణగా మార్చుకునే పరిభాషలో వుంది. అందువల్ల మోదీ రాజకీయం మీదచేసే పోరాటం కేవలం ఆర్థిక అంశాల మీద చేస్తేసరిపోదు. మోదీ రాజకీయం మీద పోరు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటా జరగాలి. ఇందులో సాంస్కృతిక రంగంలో జరిగే పోరాటం కీలకం అవుతుంది. అలాంటి బహుముఖ పోరాటాలకు, ప్రజా ఉద్యమాలకు మార్క్స్ భావజాలమే మనకు దారి చూపిస్తుంది. సమ సమాజ సాధనకు ఆయనే దిక్సూచి.

దారి దీపం సంపాదకులు, 8500678977

దేశ రాజకీయాల్లో వామపక్ష ప్రభావం

ఆర్వీ రామారావ్

భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర అంటే వామపక్ష ఉద్యమ చరిత్రే. మన దేశంలో స్వాతంత్ర్యోద్యమ క్రమంలో కాంగ్రెస్ సైతం సామ్రాజ్యవాద వైఖరి అనుసరించడానికి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రభావం చాలా బలంగా ఉండేది. స్వాతంత్ర్యోద్యమం పొడవునా సీపీఐ సామ్రాజ్యవాద, వలసవాద వ్యతిరేక విధానాలు అనుసరించడంలోనే ఎక్కువ దృష్టి పెట్టింది. స్వాతంత్ర్యానికి ముందే సీపీఐ ఈ వైఖరి అనుసరిస్తున్న సమయంలోనే వలసవాద పాలన కొనసాగుతున్న దేశాలలో కూడా ఇదే ధోరణి కొనసాగింది. వలసవాద వ్యతిరేక పోరాటంలో సీపీఐ కచ్చితమైన సామ్రాజ్యవాద వ్యతిరేక, వలసవాద వ్యతిరేక విధానం అనుసరించేది. ఆ సమయంలో ఈ వైఖరికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. కమ్యూనిస్టు ఉద్యమం అడుగుజాడలు చాలా చోట్ల కనిపించేవి. ఆ దశలో రైతులను, కార్మికవర్గాన్ని సమీకరించడంలో సీపీఐ కీలక పాత్ర పోషించింది. ప్రజలను విప్లవోన్ముఖులుగా మలిచింది. తెలంగాణాలో నిజాం నిరంకుశత్వాన్ని పడదోయడానికి సాగిన సాయుధ పోరాటం, బెంగాల్‌లో చైతన్యవంతమైన రైతు ఉద్యమాలను నిర్మించడం వల్లే వామపక్ష పార్టీలు బలం పుంజుకున్నాయి. అదే పద్ధతిలో మహారాష్ట్రలోని థానేలో సీపీఐకి అనుబంధంగా ఉన్న రైతు సంఘం నిర్ణయాత్మక పాత్ర పోషించింది. త్రిపురలో గణముక్తి పరిషత్ పోరాటాలు సైతం చెప్పుకోదగ్గవే.



1930లు, 1940ల్లో సీపీఐ ఉధృతంగా పోరాటం కొనసాగించినప్పటికీ ఆ సమయంలోనూ, ఆ తరవాత 1964లో కమ్యూనిస్టు పార్టీలో చీలిక ఏర్పడిన తరవాత వామపక్ష ప్రభావం కొన్ని ప్రాంతాలకే పరిమితం అయిందన్నది వాస్తవం. ఈ ప్రభావం మౌలికంగా రైతులకు, గిరిజనులకు, ముస్లింలకు మాత్రమే పరిమితమైంది. ఈ వర్గాల మద్దతు కూడా క్రమంగా తగ్గుతూ వచ్చినందువల్లే ఇప్పుడు వామపక్ష పార్టీలు బలహీనంగా కనిపించడానికి ప్రధాన కారణం అయింది. అయినప్పటికీ శ్రమ జీవుల గొంతుకగా కమ్యూనిస్టులు ప్రయత్నించిన ప్రతి సందర్భంలోనూ జనం మద్దతు సమకూరింది. రైతుల సమస్యల మీద, ఆశావర్కర్ల ప్రయోజనాల పరిరక్షణకు సీపీఐ, ఇతర వామపక్ష పార్టీలు కొనసాగిస్తున్న పోరాటానికి మెచ్చదగిన ప్రోత్సాహమే కనిపిస్తోంది. సంఖ్యా బలం బలహీన పడ్డప్పటికీ సీపీఐ పార్లమెంటులో నిరంతరం ప్రజాసమస్యలను లేవనెత్తుతూనే ఉంది. 1980లలో రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు బోఫోర్స్ కుంభకోణం బయట పడ్డప్పుడు ప్రతిపక్షాలను ఒక్క తాటి మీదకు తెచ్చేందుకు వామపక్ష పార్టీలు గణనీయమైన కృషి చేశాయి. అందులో సీపీఐ పాత్ర చెప్పుకోదగ్గది. 1990లలో జాతీయ స్థాయి రాజకీయాలను ప్రభావితం చేయడంలో సీపీఐ ఎన్నదగిన పాత్ర పోషించింది. 2004లో పార్లమెంట్‌లో ఏ పార్టీకీ నిర్దిష్టమైన మెజారిటీ రాని దశలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో వామపక్ష ప్రజాతంత్ర శక్తులను ఏకం చేయడానికి సీపీఐ శక్తి మేరకు కృషి చేసింది. నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు ఏర్పడినప్పుడూ సీపీఐ నిర్ణాయక పాత్ర పోషించింది. సీపీఐ, ఇతర వామపక్షాల ఒత్తిడి కారణంగానే కేంద్రంలో అధికారంలో ఉన్న పక్షాలు కొన్ని సందర్భాల లోనైనా ప్రజానుకూల విధానాలు అనుసరించక తప్పలేదు. వామపక్షాలకు పార్లమెంటరీ రాజకీయాలలో ప్రాబల్యం తగ్గుతుండడంవల్ల దుష్ఫలితాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. మతోన్మాద ప్రమాదాన్ని గురించి ముందు నుంచి హెచ్చరిస్తున్నది సీపీఐ, ఇతర వామపక్షాలు మాత్రమే. ఆ ప్రమాదం 2014 నుంచే మనం ఎదుర్కొంటున్నాం.

విశాలాంధ్ర

బ్రిటిష్ మహిళపై అత్యాచారం

న్యూఢిల్లీ: సోషల్ మీడియా వేదికగా పరిచయమైన స్నేహితుడి మాయమాటలు నమ్మి... అతడిని కలిసేందుకు ఓ యువతి బ్రిటన్ నుంచి భారత్‌కు వచ్చింది. ఇక్కడికి వచ్చిన ఆమె అతడి చేతిలోనే ఘోరంగా మోసపోయింది. హోటల్ గదిలో అత్యాచారానికి గురైంది. ఢిల్లీలో మహిపాల్‌పూర్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. ఢిల్లీలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న కైలాశ్‌కు బ్రిటన్‌కు చెందిన మహిళతో ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. అతడిని చూసేందుకు ఇటీవల ఆమె భారత్ వచ్చింది. మహిపాల్‌పూర్‌లోని ఒక హోటల్ గదిని బుక్ చేసుకుంది. ఆమెను కలిసేందుకు వచ్చిన కైలాశ్... మహిళతో అభ్యంతరకరంగా వ్యవహరించాడు. మరో స్నేహితుడితో కలిసి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. వారి నుంచి తప్పించుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. తొలుత కైలాశ్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, అక్కడి నుంచి తప్పించుకొని రిసెప్షన్ వద్దకు చేరుకునేందుకు లిఫ్ట్ ఎక్కిన తనను అతడి స్నేహితుడు లైంగికంగా వేధించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. భారత్‌కు వచ్చిన ఆ మహిళ తొలుత మహారాష్ట్ర, గోవాల్లో పర్యటించింది. కైలాశ్‌ని అక్కడికి రమ్మని అడిగింది. అయితే తాను రాలేనని చెప్పి, ఆమెనే ఢిల్లీకి రావాలని కోరాడు. ఆమెతో ఇంగ్లిష్‌లో మాట్లాడేందుకు ఇబ్బందిపడిన కైలాశ్... గూగుల్ ట్రాన్స్‌లేట్ వాడినట్లు బాధితురాలు ఫిర్యాదులో వెల్లడించింది. ప్రస్తుతం ఈ ఘటనను భారత్‌లోని బ్రిటన్ హైకమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

రన్యారావు కేసులో దర్యాప్తు ముమ్మరం

బెంగళూరు: బంగారు స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యా రావు అరెస్టయిన సంగతి విదితమే. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు ముమ్మరమైంది. బెంగళూరు సహా కర్నాటకలోని అనేక ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం సోదాలు చేపట్టింది. కొన్ని ఇతర ప్రదేశాలలో దాడులు నిర్వహించింది. రన్యారావుపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నమోదు చేసిన ఎఫ్ఐఆర్, డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ) కేసును పరిగణనలోకి తీసుకుని ఈడీ పీఎంఎల్‌ఏ కింద కేసు నమోదు చేసి ంది. ఈ వ్యవహారంలో భారీ కుట్ర దాగి ఉన్నట్లు అనుమానిస్తున్న ఈడీ ఆ దిశగా దర్యాప్తు చేస్తోంది. దుబాయ్, మలేసియాలకు హవాలా మార్గంలో నగదు తరలిస్తున్నట్లు గుర్తించడంతో ఇందులో అంతర్జాతీయ రాకెట్ హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. రన్యాతోపాటు మరి కొంత మంది పాత్ర ఉండవచ్చని దర్యాప్తు సంస్థలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. విమానాశ్రయాల ద్వారా సాగిస్తున్న ఈ స్మగ్లింగ్‌లో రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, ప్రముఖుల పాత్రపైనా దృష్టి సారించాయి. వీటికి సంబంధించిన సాక్ష్యాలను వెలికితీసేందుకు ఈడీ బెంగళూరు సహా ఇతర ప్రాంతాల్లో సోదాలు కొనసాగిస్తోంది. కాగా ఈ కేసులో సీఐడీ దర్యాప్తును ఉపసంహరించుకోవడంలో తనపై ఎటువంటి ఒత్తిడి లేదని కర్నాటక హోంమంత్రి జీ పరమేశ్వర పేర్కొన్నారు. రన్యా తండ్రి రామచంద్రరావు ఐపీఎస్ అధికారి అయినందువల్ల ఈ కేసును సిబ్బంది, పాలనా సంస్కరణల విభాగం (డీపీఏఆర్)తో దర్యాప్తు చేయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. ఒకేసారి రెండు దర్యాప్తులు అవసరం లేనందున ఇందులో నుంచి సీఐడీని తప్పించామన్నారు.

డీలిమిటేషన్ వ్యతిరేక సభకు సిద్ధరామయ్య మద్దతు

బెంగళూరు : పార్లమెంటరీ నియోజకవర్గాల ప్రతిపాదిత పునర్విభజనకు వ్యతిరేకంగా డీఎంకే నేతృత్వంలోని ప్రతిపక్షానికి కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం మద్దతు తెలిపారు. ఈ అంశంపై చర్చించడానికి చెన్నైలో జరిగే సమావేశానికి హాజరు కావాలని తన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కోరారు. ముందస్తు పనుల కారణంగా తాను సమావేశానికి హాజరు కాలేనని సిద్ధరామయ్య తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. 'రాష్ట్రాల స్వయంప్రతిపత్తికి సంబంధించిన కీలకమైన అంశాలను లేవనెత్తుతూ, మన రాజకీయాలను నియంత్రించే సూత్రాలపై తీవ్రమైన ప్రభావాలను చూపే మీ మార్చి 7వ తేదీ నాటి లేఖ నాకు అందింది. ముఖ్యంగా, కొత్త జనాభా ప్రమాణాల ఆధారంగా పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల డీలిమిటేషన్ అంశాన్ని సారూప్య రాష్ట్రాలు విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉంది. నా ముందస్తు కార్యక్రమాల కారణంగా నేను సమావేశంలో పాల్గొనాలనుకుంటున్నప్పటికీ, నేను అలా చేయలేకపోతున్నాను' అని ఆయన మార్చి 13వ తేదీ నాటి లేఖలో రాశారు. అయితే మార్చి 22న జరగనున్న సమావేశం ప్రాముఖ్యతను అంగీకరిస్తూ, 'ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను చర్చలలో పాల్గొనమని నేను అభ్యర్థించాను' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక, దక్షిణాది వ్యతిరేక వైఖరి' కి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల గురించి చర్చించడానికి బుధవారం, తమిళనాడు అటవీ శాఖ మంత్రి కె.పొన్ముడి, రాజ్యసభ ఎంపీ మహమ్మద్ అబ్దుల్లా ఇస్మాయిల్ సిద్ధరామయ్యను ఆయన నివాసం కావేరిలో కలిశారు. డీఎంకే ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో 'ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదాన్ని బలహీనపరిచేందుకు కేంద్రం చేసిన ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఖండించారు. డీలిమిటేషన్ అంశంపై చర్చించడానికి డీఎంకే, ఎన్డీఏలోని చంద్రబాబు నాయుడు వంటి వివిధ పార్టీల నాయకులతో సహా వివిధ పార్టీల నాయకులను సంప్రదిస్తోంది.

పార్కింగ్ వివాదం... యువ శాస్త్రవేత్త హత్య

మొహాలీ: ద్విచక్ర వాహనం పార్కింగ్ వద్ద జరిగిన ఘర్షణలో ఓ యువ శాస్త్రవేత్త మృతిచెందాడు. ఈ ఘటన పంజాబ్‌లోని మొహాలీలో జరిగింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ అభిషేక్ స్వర్ణకార్ (39) ప్రాణాలు కోల్పోయాడు. సెక్టార్ 67లో తన అద్దె ఇంటి వద్ద పార్కింగ్ వివాదం చెలరేగింది. పక్కింటి వారితో గొడవ తలెత్తడంతో మాంటీ అనే వ్యక్తి దాడికి దిగాడు. అభిషేక్‌ను కిందపడేసి పంచ్‌లు విసిరాడు. జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌కు చెందిన డాక్టర్ స్వర్ణకార్ అంతర్జాతీయ జర్నల్స్‌కు అనేక వ్యాసాలు రాశాడు. అతడు స్విట్జర్లాండ్‌లో పనిచేశాడు. ఇటీవల భారత్‌కు తిరిగి వచ్చి ఐఐఎస్ఈఆర్‌లో ప్రాజెక్టు శాస్త్రవేత్తగా చేరాడు. దాడి సమయంలో కొందరు స్థానికులు ఉన్నట్లు సీసీటీవీ కెమెరాల ద్వారా తెలుస్తోంది.

మసీదులపై టార్పాలిన్ కవర్లు

జేడీయూ సహా విపక్షాల మండిపాటు

అలీఘర్ (యూపీ): మార్చి 14 శుక్రవారం హోలి పండుగ జరగనుంది. మరోవైపు రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించుకుటున్నారు. హోలి, రంజాన్ పండుగల సమయంలో మత ఘర్షణలు చోటుచేసుకోకుండా శాంతి భద్రతల పేరుతో మసీదులపై నల్లటి టార్పిలిన్ కవర్లు కప్పేందుకు అలీఘర్ జిల్లా యంత్రాంగం పూనుకుంది. హోలి వేడుకల్లో ఉపయోగించే రంగులు మసీదులపై పడకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. షాజహాన్‌పూర్‌లోని కొన్ని మసీదులపైనా టార్పిలిన్ కవర్లు కప్పారు. హోలీ వేడుకల్లో 'లాత్ సాహెబ్' ఊరేగింపు జరుగుతుంది. ఓ ఎద్దుల బండిపై ఒక వ్యక్తిని లాత్ సాహెబ్‌గా ఎంచుకుని ఎక్కిస్తారు. అప్పుడు అతనిపై ప్రజలు రంగులు, బూట్లు, చెప్పులు విసురుతారు. ఇది 300 ఏళ్ల నాటి సంప్రదాయం. ఈ లాత్ సాహెబ్ ఊరేగింపులో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకుండా నిరోధించడానికే సుమారు 3,500 మంది భద్రతా సిబ్బందిని మోహరించామని, అందుకవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు షాజహాన్ ఎస్పీ రాజేశ్ తెలిపారు. కాగా, ఉత్తరప్రదేశ్ పోలీసు అధికారుల చర్యలను కేంద్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీ అయిన జేడీయూ సహా రాష్ట్రంలోని విపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శించాయి. బీహార్‌కు చెందిన జేడీయూ నేత అభిషేక్ ఝా ఉత్తరప్రదేశ్‌లోని మసీదులపై టార్పాలిన్ కవర్లు కప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ చర్యలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ 'శుక్రవారం హోలి పండుగ వచ్చిందని, ఈ సందర్భంగా మత ఘర్షణలు జరుగుతాయని ముందుగా మసీదులపై టార్పాలిన్ కవర్లు కప్పడం దురదృష్టకరం. గత పదేళ్లలో హోలి పండుగ శుక్రవారం రోజే నాలుగుసార్లు వచ్చింది. మార్చి 18, 2022లో శుక్రవారం రోజున హోలీ జరుపుకున్నాం. అప్పుడు ఎటువంటి వివాదాలు తలెత్తలేదు. కొంతమంది మీడియా ముందు ఇలాంటి ప్రకటనలు చేస్తారు. మీడియా కూడా టీఆర్‌పీ రేటింగ్ పెంచుకునేందు ఈ వివాదాలను పెద్దది చేస్తోంది. భారతదేశం లౌకిక, ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ అన్ని కులాలు, మతాల ప్రజలకు తమ విశ్వాసాన్ని ఆచరించే హక్కు ఉంది. ఇలాంటి సందర్భాల్లో మత ఘర్షణలు చోటుచేసుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. మత సామరస్యం, సామాజిక సామరస్యాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ జవాబుదారీగా ఉంటారు. దేవాలయాలపైనా, మసీదులపైనా కవర్లు కప్పడం వంటి అతి జాగ్రత్తలు మంచిది కాదు. వివాదాలు తలెత్తుతాయని పోలీసులు ఇలాంటి చర్యలకు పూనుకోవడం తగదు. అలాంటి ప్రకటనల్ని నివారించాలని విశ్వసిస్తున్నాను. ప్రస్తుతం బీహార్‌లో అలాంటి ఘర్షణలకు తావులేదు' అని ఆయన అన్నారు.

ప్రమాదంలో విద్యార్థుల భవిత

పేపర్ లీకేజీపై రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: ప్రశ్నపత్రాల లీక్‌లపై కాంగ్రెస్ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మరోసారి స్పందించారు. ఈ లీక్‌ల కారణంగా కష్టపడి చదివే విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. దీనిపై పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా గురువారం ఓ పోస్టు చేశారు. 'ప్రశ్నపత్రాల లీకులతో 6 రాష్ట్రాల్లోని 85 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. వీటి కారణంగా కష్టపడి చదివే పిల్లలతో పాటు వారి కుటుంబాలు ఒత్తిడికి గురవుతున్నాయి. వారి కష్టానికి తగిన ఫలితం అందడం లేదు. దీనివల్ల కష్టపడి పనిచేయడం కంటే నిజాయతీగా లేకపోవడమే మంచిదనే తప్పుడు సందేశం భవిష్యత్తు తరాలకు వెళ్తుంది. అది ఆమోదయోగ్యం కాదు. నీట్ పేపర్ లీక్ దేశాన్ని కుదిపేసి ఏడాది కూడా కాలేదు. దీనిపై మేము పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తంచేశాం. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం లీకులను అడ్డుకోలేకపోయింది. ఇది వారి వైఫల్యానికి నిదర్శనం. అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు విభేదాలు పక్కనబెట్టి దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వీటిని అరికట్టగలం. ఈ పరీక్షలు మన పిల్లల హక్కు. దాన్ని ఎలాగైనా రక్షించాలి' అని రాహుల్ రాసుకొచ్చారు. పేపర్‌లీక్‌లపై ఓ వార్తా సంస్థ రాసిన కథనాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ పోస్టు చేశారు.

డాక్టరు కుటుంబం అనుమానాస్పద మృతి

చెన్నై: సొంత ఇంట్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనుమానాస్పద రీతిలో మృతిచెందారు. భార్యాభర్తతో పాటు ఇద్దరు టీనేజ్ కుమారులు ప్రాణాలు కోల్పోయారు. డాక్టరు, అడ్వకేట్ అయిన వీరితో పాటు ఇద్దరు కుమారులు వేర్వేరు రూముల్లో శవాలుగా పడి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. డాక్టర్ డ్రైవర్ ... గురువారం ఉదయం పని కోసం ఇంటికి వచ్చాడు. అతనికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీళ్లు అన్నానగర్‌లోని ఇంటి తలుపులు తీశారు. మృతిచెందిన వారిలో బాలమురుగన్ (52), భార్య సుమతి (47) ఉన్నారు. భార్యాభర్తలు ఒక రూమ్‌లో.. మరో రూమ్‌లో పిల్లల మృతదేహాలను గుర్తించారు. తిరుమంగళం పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. దర్యాప్తు కొనసాగనున్నట్లు చెప్పారు. సుమారు రూ.ఐదు కోట్ల వరకు అప్పు ఉన్నట్లు తెలుస్తోంది.

పెరియార్‌ను విమర్శిస్తారా?

నిర్మలా సీతారామన్‌పై విజయ్ మండిపాటు

చెన్నై: ప్రముఖ సంఘసంస్కర్త పెరియార్‌పై కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చేసిన విమర్శలను తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్ గురువారం తీవ్రంగా ఖండించారు. ఏళ్లు గడిచినా ఆయన పేరు వాడకుండా ఉండలేని విధంగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారని విజయ్ పేర్కొన్నారు. తమిళాన్ని అవమానించిన వ్యక్తికి పూలమాలలు వేస్తున్నారంటూ ఈవీకే పెరియార్‌ను పరోక్షంగా ప్రసావిస్తూ రాజ్యసభలో సీతారామన్ ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై విజయ్ స్పందిస్తూ సమాజంలో సాంఘిక దురాచారాలు పారదోలడానికి పెరియార్ చేసిన కృషిని కొనియాడారు. 'బాల్య వివాహాలను వ్యతిరేకించారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారు. కులం పేరిట జరిగిన అకృత్యాలను ఖండించారు. సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు ఉండాలని మనం ఇప్పుడు మాట్లాడుతున్నాం. కానీ ఆయన ఆ మాటలను వందసంవత్సరాల క్రితమే పిలుపునిచ్చి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. పెరియార్ తమిళ భాషను అవమానించినందుకు కేంద్రమంత్రి నిజంగానే బాధపడ్డారా? మీరు నిజంగా బాధపడి ఉంటే... త్రిభాషా సూత్రాన్ని మాపై రుద్దడం ఆపేస్తారా? పెరియార్ గురించి ఎవరైనా అవమానకర వ్యాఖ్యలు చేస్తే... అవి వివాదాస్పదమవుతుంటాయి. తమిళనాడు ప్రజల మనసులో ఆయన ఎలా నిలిచి ఉన్నారో, ఆయన్ను ఎలా గౌరవిస్తున్నారో ఈ ఒక్క ఉదాహరణ చాలు' అని విజయ్ అన్నారు.

కేంద్రం అవమానించింది: ఉదయనిధి

తమిళనాడు ప్రజలను, పెరియార్‌ను కేంద్ర ప్రభుత్వం అవమానించిందని తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైతే తమను అనాగరికులమని విమర్శించారో... వారికి రాష్ట్ర ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. 'కేంద్ర ప్రభుత్వం తమిళనాడును, పెరియార్‌ను అవమానిస్తోంది. మనం అనాగరికులమా? వాస్తవానికి మమ్మల్ని అనాగరికులమని పిలిచేవారే అనాగరికులుగా ప్రవర్తిస్తున్నారు. మాకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తమిళ ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారు' అని అన్నారు. తమిళనాడు అధికార డీఎంకే ఒకప్పుడు తమిళాన్ని అనాగరిక భాషగా కొట్టిపారేసిన వ్యక్తిని ఆరాధిస్తోందని కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ మంగళవారం ఆరోపించారు.

క్రిప్టో కరెన్సీ నిర్వాహకుడి అరెస్టు

తిరువనంతపురం: ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లకు క్రిప్టో ద్వారా మనీల్యాండరింగ్ నిర్వహించే అలెక్సీ బెసికోవ్‌ను కేరళ పోలీసులు అరెస్టు చేశారు. లిథువేనియా పౌరుడు, రష్యా నివాసితుడు అయిన బెసికోవ్... తిరువనంతపురం సమీపంలోని ఓ హోమ్‌స్టేలో ఉంటున్న సమయంలో అతడిని పట్టుకున్నారు. బెసికోవ్‌పై అమెరికాతో పాటు పలు దేశాల్లో కేసులు ఉన్నాయి. అమెరికా మోస్ట్ వాంటెడ్ జాబితాలో బెసికోవ్ ఉన్నాడు. రష్యాకు చెందిన క్రిప్టో కరెన్సీ గారెంటెక్స్ సంస్థలో అడ్మినిస్ట్రేటర్‌గా చేశాడు. ఆ క్రిప్టో లావాదేవీలన్నీ అతనే చూసుకునేవాడని అమెరికా న్యాయశాఖ రిపోర్టు ద్వారా తెలిసింది. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న బెసికోవ్ ఇప్పటి వరకు ఎటువంటి విషయాన్ని వెల్లడించలేదు. గారెంటెక్స్ సంస్థ కూడా స్పందించడానికి నిరాకరించింది. రష్యాలో ఉండే బెసికోవ్ ఎందుకు ఇండియాకు వచ్చాడో స్పష్టంగా తెలియదు. అమెరికా అభ్యర్థన మేరకు.. కేరళ పోలీసులు అతన్ని అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారులు చెప్పారు. ఢిల్లీ కోర్టులో అతన్ని ప్రవేశపెట్టనున్నారు. గారెంటెక్స్‌లో 2019 నుంచి సుమారు 96 బిలియన్ల డాలర్ల క్రిప్టో లావాదేవీలు జరిగాయి. లైసెన్స్ లేకుండానే వందల మిలియన్ల డబ్బు ట్రాన్స్‌ఫర్ వ్యాపారం చేసినట్లు అతడిపై ఆరోపణలు ఉన్నాయి.

ట్రంప్ మెప్పు కోసమే!

స్టార్‌లింక్‌తో జియో, ఎయిర్‌టెల్ ఒప్పందంపై కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఎయిర్‌టెల్, జియో రెండూ స్టార్‌లింక్‌తో భాగస్వామ్యాలను ప్రకటించడంపై కాంగ్రెస్ మండిపడింది. స్టార్‌లింక్ యజమాని ఎలోన్ మస్క్ ద్వారా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'మెప్పు' పొందడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వీటిని ఏర్పాటు చేశారని ఆ పార్టీ గురువారం విమర్శించింది. 12 గంటల్లోనే ఎయిర్‌టెల్, జియో రెండూ స్టార్‌లింక్‌తో భాగస్వామ్యాలను ప్రకటించాయని, భారతదేశం లోకి దాని ప్రవేశంపై ఉన్న అన్ని అభ్యంతరాలను అధిగమించాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్) జైరాం రమేశ్ తెలిపారు. 'స్టార్‌లింక్ యజమాని ఎలోన్ మస్క్ ద్వారా అధ్యక్షుడు ట్రంప్ మెప్పు పొందడానికి ప్రధాన మంత్రి స్వయంగా ఈ భాగస్వామ్యాలను ఏర్పాటు చేశారని స్పష్టంగా తెలుస్తుంది' అని ఆయన విమర్శించారు. కానీ చాలా ప్రశ్నలు మిగిలి ఉన్నాయి. బహుశా అతి ముఖ్యమైన విషయం జాతీయ భద్రతకు కావచ్చు. జాతీయ భద్రత కోరినప్పుడు కనెక్టివిటీని ఆన్ లేదా ఆఫ్ చేసే అధికారం ఎవరికి ఉంటుంది? అది స్టార్‌లింక్ లేదా దాని భారతీయ భాగస్వాములు కాగలరా?. ఇతర ఉపగ్రహ ఆధారిత కనెక్టివిటీ ప్రొవైడర్లను కూడా అనుమతిస్తారా, ఏ ప్రాతిపదికన?' అని కాంగ్రెస్ నాయకుడు 'ఎక్స్' లో ప్రశ్నించారు. భారతదేశంలో టెస్లా తయారీకి సంబంధించిన చాలా పెద్ద ప్రశ్న మిగిలి ఉందని ఆయన అన్నారు. భారతదేశంలోకి స్టార్‌లింక్ ప్రవేశం సులభతరం చేయబడినందున ఇప్పుడు దానికి కొంత నిబద్ధత ఉందా అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. బిలియనీర్ ముకేశ్ అంబానీకి చెందిన జియో ప్లాట్‌ఫామ్‌లు స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలను భారతదేశానికి తీసుకురావడానికి మస్క్ నేతృత్వంలోని ఏరోస్పేస్ కంపెనీ స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. మస్క్ వెంచర్‌కు స్పెక్ట్రమ్ హక్కులను ఎలా మంజూరు చేయాలనే దానిపై నెలల తరబడి జరిగిన తగాదాల తర్వాత ఈ ఆశ్చర్యకరమైన చర్య జరిగింది. టెలికాం వ్యాపారవేత్త సునీల్ భారతి మిట్టల్‌కు చెందిన ఎయిర్‌టెల్ స్పేస్‌ఎక్స్‌తో ఇలాంటి భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు కుడిభుజంగా పరిగణించబడే మస్క్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. గత కొన్ని నెలలుగా ప్రత్యర్థులు జియో, ఎయిర్‌టెల్ భారతదేశంలో ఉపగ్రహ సేవలకు స్పెక్ట్రం ఇవ్వడానికి వేలం వేయాలని కలిసి డిమాండ్ చేస్తున్నాయి. ఎందుకంటే పరిపాలనా కేటాయింపు గతంలో వేలం ద్వారా చెల్లించిన దానికంటే తక్కువ ధరకు మస్క్ ఎయిర్‌వేవ్‌లను ఇస్తుందని వారు భయపడ్డారు. జియో రిటైల్ అవుట్‌లెట్‌లు, ఆన్‌లైన్ స్టోర్‌లలో స్టార్‌లింక్ పరికరాలను అందిస్తుంది. పరికరాల్లో కస్టమర్ ఇన్‌స్టలేషన్, యాక్టివేషన్‌కు కూడా మద్దతు ఇస్తుంది. జియో, స్పేస్‌ఎక్స్ ఒకరికొకరు ఆఫర్‌లను ఎలా పెంచుకోవచ్చో కూడా అన్వేషిస్తాయి. స్టార్‌లింక్ అనేది స్పేస్‌ఎక్స్ ద్వారా నిర్వహించబడుతున్న ప్రపంచంలోనే అతిపెద్ద తక్కువ భూమి కక్ష్య (లియో) కూటమి. కాగా మంగళవారం భారతీ ఎయిర్‌టెల్ స్టార్‌లింక్‌కు చెందిన హై-స్పీడ్ ఇంటర్నెట్ సేవను భారతదేశానికి ప్రత్యేకత లేని ప్రాతిపదికన తీసుకురావడానికి స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు ప్రకటించింది.

నాణ్యతా పరీక్షలో 'యమున' విఫలం

- **33కుగాను 23 పర్యవేక్షిత క్షేత్రాలు కలుషితం**
- **ఢిల్లీలో అంతరించిపోతున్న నది**
- **పార్లమెంటరీ ప్యానల్ నివేదిక**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లో కాలుష్యం తీవ్రస్థాయికి చేరుకుంది. సీవేజ్ ట్రీట్‌మెంట్లు ప్రాంట్లు ఉన్నాగానీ పరిస్థితిలో మార్పు లేదు. ఇదే క్రమంలో ఢిల్లీలో యమునా నది అంతరించిపోయే పరిస్థితి నెలకొన్నది. యమునకు సంబంధించిన 33 పర్యవేక్షిత క్షేత్రాల్లో 23 (ఇందులో ఆరు ఢిల్లీలో ఉన్నాయి) ప్రాథమిక నాణ్యతా పరీక్షల్లో విఫలమయ్యాయని పార్లమెంటరీ ప్యానల్ తాజాగా నివేదించింది. ఢిల్లీలో యమునా ప్రవాహం 40కిమీల మేర ఉన్నది. ఇది హర్యానా నుంచి ఢిల్లీలోకి ప్రవేసిస్తుంది, ఆస్గర్‌పూర్ నుంచి యూపీకి వెళుతుంది. నది మనుగడను అంచనా వేసేందుకు జలాల్లో ఉండే ఆక్సిజన్ (డీఓ) స్థాయిని పరిగణనలోకి తీసుకుంటారు. అయితే ఢిల్లీలోని యమునాలో డీఓ స్థాయి దాదాపు శూన్యానికి చేరుకున్నట్లు జల వనరులపై పార్లమెంటరీ స్థాయి సంఘం ఇటీవల పార్లమెంటుకు తెలిపింది. ఎగువ యమున నది ప్రక్షాళన ప్రాజెక్టు, ఢిల్లీలో రివర్ బెడ్ నిర్వహణపై నివేదిక సమర్పించింది. ఢిల్లీ, యూపీలో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్‌టీపీలు) ఏర్పాటు చేసినా కాలుష్యం తీవ్రంగానే ఉన్నట్లు తెలిపింది. కాలుష్యాన్ని తగ్గించి నదిని పునరుద్ధరించడం కోసం భాగస్వాములంతా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. 33 పర్యవేక్షిత క్షేత్రాల్లో నుంచి ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లోని చెరో నాలుగు స్థానాల్లో మాత్రమే ప్రాథమిక జల నాణ్యతా అంచనాలకు తగ్గట్లు ఉన్నదని పేర్కొంది. 2021 జనవరి నుంచి 2023 మే వరకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులతో కలిసి 33 క్షేత్రాల్లోని నీటి నాణ్యతను కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) పరీక్షించింది. నది జలాల్లో ఆక్సిజన్ (డీఓ), పీహెచ్, బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ), ఫీకల్ కొలిఫోమ్ (ఎఫ్‌పీ) స్థాయిలను అంచనా వేసింది. ఉత్తరాఖండ్, హిమాచల్‌లోని చెరో నాలుగు క్షేత్రాలు మినహా అన్నిచోట్ల నాణ్యతా పరీక్షల్లో నది జలాలు విఫలమైనట్లు వెల్లడించింది. నది కబ్జాకు గురికావడంపై పార్లమెంటరీ ప్యానల్ ఆందోళన వ్యక్తం చేసింది. కబ్జాలపై ఢిల్లీ, హర్యానా సమాచారం ఇవ్వగా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ నుంచి పూర్తి వివరాలు అందలేదు.

జల వనరుల విభాగంలో మురిగిపోతున్న నిధులు

జల వనరుల విభాగం, గంగా పునరుజ్జీవనం, నది అభివృద్ధి కోసం నిధులు పూర్తిస్థాయిలో వినియోగం కావడం లేదని పార్లమెంటరీ ప్యానల్ నివేదించింది. 2024-25 కోసం రూ.21,640.88 కోట్లు కేటాయిస్తే అందులో 58 శాతమే వినియోగమైనట్లు వెల్లడించింది. ఈ క్రమంలో పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని జల్ శక్తి మంత్రిత్వ శాఖకు ప్యానల్ విజ్ఞప్తి చేసింది. నిధుల పంపిణీ, ప్రాజెక్టుల అమలులో జాప్యం జరుగుతోందని పార్లమెంటు దృష్టికి తీసుకెళ్లింది. రూ.3 వేల కోట్లు విలువ చేసే ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని తెలిపింది. జల్ శక్తి శాఖ కింద కీలక పథకాల కోసం బడ్జెట్ పెంచాలని సిఫార్సు చేసింది. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ (ఎన్‌హెచ్‌పీ)కి బడ్జెట్ కేటాయింపులో 98శాతం కోత పడటాన్ని తెలిపింది. 2024-25లో రూ.66.20 కోట్లు కేటాయించగా 2025-26 కోసం కేవలం రూ.13కోట్లు ఇచ్చారని పేర్కొంది. అలాగే, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అండ్ వాటర్ మేనేజ్‌మెంట్ (సీఏడీడబ్ల్యూఎం) పథకం కోసం కేటాయింపులో 39.28 శాతం కోత విధించి రూ.850 కోట్లు ఇచ్చారని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టు గురించీ ప్రస్తావించింది. ఈ ప్రాజెక్టు కోసం 2025-26లో రూ.5,936 కోట్లు కేటాయించారని, అంతకుముందు సంవత్సరం రూ.5,512.50 కోట్లు ఇచ్చారని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 కింద ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించారని, 2026 మార్చి నాటికి ఇది పూర్తి అయ్యే అంచనా ఉన్నదని పార్లమెంటరీ ప్యానల్ వెల్లడించింది.

కిడ్నాప్ డ్రామా... కుమారుడి అరెస్ట్

లక్నో: కంచే చేను మేసిన చందాన తండ్రి నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ఓ పుత్రరత్నం కిడ్నాప్ డ్రామా ఆడాడు. తనను కిడ్నాప్ చేశారంటూ తండ్రికి మెసేజ్ పంపాడు. ఆందోళనతో తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో అతడి ఆచూకీని పోలీసులు గుర్తించారు. నకిలీ కిడ్నాప్ డ్రామా ఆడినట్లు నిర్ధారించి అతడిని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని భదోహి జిల్లాకు చెందిన ప్రదీప్ చౌహాన్ (28) తన తండ్రి నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రణాళిక రచించాడు. ఈ నెల ఏడో తేదీన తండ్రి రామ శంకర్ చౌహాన్‌కు అతడు మెసేజ్ పంపాడు. తాను కిడ్నాప్‌నకు గురయ్యానని, కిడ్నాపర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు అందులో పేర్కొన్నాడు. ఆ తర్వాత మొబైల్ ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. కాగా, తండ్రి తన కుమారుడు ప్రదీప్ కిడ్నాపైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూణేలోని పింప్రి-చించ్వాడ్ ప్రాంతంలోని హింజెవాడిలో ప్రదీప్ ఉన్నట్లు సాంకేతిక ఆధారాల ద్వారా తెలుసుకున్నారు. పోలీసులు అక్కడకు వెళ్లి అతడిని అదుపులోకి తీసుకుని ఉత్తరప్రదేశ్‌కు తరలించారు. అతడిని ప్రశ్నించగా... తండ్రిని డబ్బులు రాబట్టేందుకు నకిలీ కిడ్నాప్ డ్రామా ఆడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో ప్రదీప్‌ను అరెస్ట్ చేశారు. తన కుమారుడిని విడుదల చేయాలంటూ పోలీసులను ప్రాధేయపడడంతో తండ్రి నుంచి డబ్బులు కట్టించుకుని బెయిల్‌పై విడుదల చేశారు.

దిగ్గజ క్రికెటర్ అబిద్ అలీ



విశాలాంధ్ర- హైదరాబాద్: దిగ్గజ క్రికెటర్ సయ్యద్ అబిద్ అలీ (83) కన్నుమూశారు. హైదరాబాద్‌కు చెందిన ఆయన తన క్రికెట్ ప్రస్థానం ముగిశాక అమెరికాలోని కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. అబిద్ ... అనారోగ్యంతో మృతి చెందినట్లు ఆయన బంధువు రెజా ఖాన్ సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. ఆయన 1967 నుంచి 74 మధ్య భారత క్రికెట్ జట్టుకు 29 టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించారు. పేస్ బౌలర్, లోయర్ మిడిలార్డర్ బ్యాటర్ అయిన అబిద్... మంచి ఫీల్డర్‌గానూ పేరు తెచ్చుకున్నారు. 29 టెస్టుల్లో 49 వికెట్లు పడగొట్టి, 1,018 పరుగులు సాధించారు. 1967-68 సీజన్లో ఆస్ట్రేలియాపై ఆడిన తన తొలి టెస్టులోనే 55 పరుగులకు ఆరు వికెట్లు తీసి అదరగొట్టారు. సిడ్నీ టెస్టులో 81 బంతుల్లో 78 విలువైన పరుగులు చేసి బ్యాటర్‌గా సత్తా చాటారు. 1975లో తొలి వన్డే ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌పై ఏడో స్థానంలో ఆడి 70 పరుగుల చేయడం ప్రశంసలందుకుంది. వన్డేల్లో ఐదు మ్యాచ్‌లాడి 93 పరుగులు చేసిన ఆయన... అనివార్య కారణాలతో క్రికెట్‌కు గుడ్‌బై చెప్పేశారు. దేశవాళీ క్రికెట్లోనూ అబిద్ ఉత్తమ ప్రదర్శన చేశారు. హైదరాబాద్ తరపున 212 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 8,732 పరుగులు సాధించారు. అందులో 13 శతకాలు, 31 అర్ధశతకాలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 173 నాటౌట్. 397 వికెట్లు పడగొట్టారు. 14 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశారు. రిటైరయ్యాక కొన్నేళ్ల పాటు హైదరాబాద్ జూనియర్ జట్టుకు శిక్షణ ఇచ్చిన అబిద్... తర్వాత అమెరికాలోని కాలిఫోర్నియాకు వెళ్లి స్థిరపడ్డారు. అక్కడ ఉత్తర అమెరికా క్రికెట్ లీగ్ (ఎన్ఏసీఎల్)తో కలిసి పని చేశారు. 2001-02 మధ్య అబిద్ ఆంధ్ర రంజీ జట్టుకు కోచ్‌గా వ్యవహరించారు. సౌత్ జోన్ ఛాంపియన్స్‌గా నిలిపారు. మాల్దీవులు, యూఏఈ జట్లకు సైతం ఆయన శిక్షణ ఇచ్చారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఏ పథకాలనూ ఆపుతామని చెప్పలేదు

మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాలను కూడా అపుతామని చెప్పలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గురువారం బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. నూతనంగా ఉద్యోగాలు అందించే ప్రయత్నం చేశామని, విద్యా బోధన సక్రమంగా అందించాలని నూతనంగా నియామకమైన అధ్యాపకులకు చెప్పే ప్రయత్నం చేశామని తెలిపారు. అప్పులు ఉన్నాయని తెలిసే ఆర్థిక వ్యవస్థీకరణ చేస్తున్నామని వివరించారు. కాంగ్రెస్ పార్టీకి ఇవన్నీ పరిపాలించే అనుభవం ఉందని, పాత పథకాలు కొనసాగిస్తూనే కొత్త పథకాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇన్ని కార్యక్రమాలు జరిగే సందర్భంలో కేంద్ర ప్రభుత్వ పెద్దన్న లాగా రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం ఉండాలని సూచించారు. అందమైన భవనాలు కట్టి తెలంగాణ ఆర్థికంగా గొప్పగా ఉందని చూపెట్టే ప్రయత్నం చేశారన్నారు. ఎక్కడ మేము తప్పించుకునే ప్రయత్నం చేస్తలేమని, మాట్లాడితే తులం బంగారం గురించి మాట్లాడుతున్నారని కాని మీరు చెప్పిన 15 లక్షల రూపాయలు ఇచ్చారా అని నిలదీశారు. రైతులకు పెన్షన్ ఇస్తామన్నారు. కానీ చివరకు రైతులకు ఉరి చట్టాలు తెచ్చారన్నారు. బీజేపీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఎన్ని ఇచ్చారో చెప్పాలని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం నుండి వచ్చే నిధులు కూడా వాపసు ఇచ్చే పరిస్థితి లేదు బాత్రూం మీద ఫోటో పెట్టాలని రేషన్ షాపులో మీద ఫోటోలు పెట్టాలని అంటారని మండిపడ్డారు. నిర్మల్ నియోజకవర్గంలో 23,906 మంది రైతులకు 202.55 కోట్ల రూపాయలు రుణమాఫీ చేశామని, రెండు లక్షల లోపు వరకు రైతు రుణమాఫీ చేశామని తెలిపారు.

నోటిఫికేషన్‌లపై కోర్టుకు వెళ్లి ఆపిందెవ్వరు...

ఉద్యోగ నియామకాలపై ఎమ్మెల్సీ తాత మధుసుధన్ చేసిన వ్యాఖ్యల మంత్రి పొన్నం ప్రభాకర్ మండలిలో స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 10 సంవత్సరాలు పరిపాలించారు. మేము 14 సంవత్సరాల క్రితం ఇచ్చిన నోటిఫికేషన్ లా గురించి చెప్తున్నారని దుయ్యబట్టారు. అసలు నోటిఫికేషన్ రిక్రూట్మెంట్ ప్రాసెస్‌లు కావాలనే కోర్టుకు వెళ్లి ఆపేల చేసింది ఎవరని నిలదీశారు. నోటిఫికేషన్‌లు వేసి పెపేర్ లీక్‌లు చేసి మళ్ళీ కోర్టు కేసులకు పోతే లాభం ఏముందన్నారు.

మీకు ఉద్యోగాలు నింపాలి అని తెలంగాణ ఉద్యమంలో అదే ప్రధాన డిమాండ్ అంటే ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఉద్యోగాలు పోతే ఆరు నెలల్లో రాజకీయ ఉద్యోగాలు పొందారని తప్ప ఉద్యోగ నియామకాలపై ఎందుకు శ్రద్ధ పెట్టలేదన్నారు. 10 ఏళ్లలో ఒక్క గ్రూప్ 1 నోటిఫికేషన్ అయినా పడిందా, 10 సంవత్సరాల్లో ఒకే ఒక్క డీఎస్సీ మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని మండిపడ్డారు. వైస్ ఛాన్సలర్‌లను ఎందుకు నియమించకుండా 10 సంవత్సరాల్లో విద్యా వ్యవస్థ మొత్తం నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. 2 లక్షల 32 వేల ఖాళీలు ఉన్నాయని చెప్పి 10 సంవత్సరాల్లో ఎన్ని ఉద్యోగాలు నియమించారన్నారు. ప్రాసెస్ ఉంచి నోటిఫికేషన్‌లు, కోర్టుల్లో ఎన్ని లిటిగేషన్‌లో ఉన్నవి, అన్నిటినీ మేము సాల్వ్ చేశామన్నారు.

కుటుంబాలతో సమేతంగా పిలిచి నియామక పత్రలు ఇచ్చామని, ఉద్యోగాలు ఇస్తుంటే వద్దన్నమా, మీరు ఉద్యోగాలు ఇస్తుంటే జెఏసి చైర్మన్ కోదండరాం అడ్డంపడారా అని అడిగారు. ఉద్యోగాలు ఇవ్వమనీ డిమాండ్ చేస్తే తలుపులు పగుల గొట్టి అరెస్టులు చేశారని విమర్శించారు. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో ఉద్యోగ నియామకాలు చేపట్టామని, నోటిఫికేషన్‌లు ఇస్తే ఉద్యోగాలు ఇచ్చినట్టేనా లేదా నియామకాలు చేపట్టినప్పుడా అంటూ ప్రశ్నించారు. నోటిఫికేశన్‌లు మీరు ఇస్తే మేము ఏమైనా కోర్టుకు పోయామా.. ఇష్యూస్ క్రియేట్ చేస్తే మేము సాల్వ్ చేసి ఉద్యోగాలు ఇచ్చామన్నారు.

నోరు అదుపులో పెట్టుకోండి : ఆది శ్రీనివాస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్టేచర్ గురించి ముందు మాట్లాడింది కేటీఆర్ అని కానీ రాష్ట్రంలో సీఎం పదవి కంటే స్టేచర్ ఇంకేమైనా ఉంటుందా అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. "కేటీఆర్ మీకు నాయకుడు కావొచ్చు కానీ సీఎం రాష్ట్రానికి పెద్దన్న లాంటి వారన్నారు. తెలంగాణలో సీఎం పదవి కంటే ఇంకేమి స్టేచర్ ఉండదని స్పష్టం చేశారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకుడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవుపలికారు. కేసీఆర్ కుటుంబంలో నలుగురు పదవులు తీసుకొని వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అందుకే ప్రజలు మీ స్టేచర్‌ను దింపి... సీఎంగా రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారన్నారు. 'హరీష్‌రావు మీ నోరును అదుపులో పెట్టుకోండి. ఇష్టానుసారంగా మాట్లాడితే ఇక్కడ ఎవరు చూసుకుంటూ ఊరుకోరు.. 10 ఏళ్లు పందికొక్కులాగా రాష్ట్రాన్ని దోచుకున్న మీరు మాట్లాడుతున్నారా. ఈ రోజు 18 గంటలు కష్టపడి సీఎం రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు జాగ్రత్తగా మాట్లాడాలి" అని హెచ్చరించారు.

నగర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంగుల పండుగ హెూలీ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, "హెూలీ మన సమాజంలో ఐక్యతను, ప్రేమను, స్నేహాన్ని ప్రతిబింబించే పండుగని అన్నారు. హెూలీ రంగుల పండుగని, ఈ పండుగ అందరికీ సంతోషాన్ని, ఆరోగ్యాన్ని, శాంతిని కలిగించాలని ఆకాంక్షించారు. నగర ప్రజలు హెూలీ వేడుకలను జాగ్రత్తగా, సంతోషంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హెూలీ పండుగను పురస్కరించుకుని నగర ప్రజలకు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "హెూలీ పండుగ అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిలోకి తెచ్చే మతసామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా, స్నేహపూర్వకంగా హెూలీ పండుగ సంబరాలు జరుపుకోవాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ హెూలీ వేడుకలను నిర్వహించాలని, హానికరమైన రంగుల నుండి దూరంగా ఉండాలని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు.

కమిషనర్ ఇలంబర్తి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హోలీ పండుగను పురస్కరించుకొని నగర ప్రజలకు జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ భారతీయ సంస్కృతిలో ఎంతో ప్రత్యేకమైనదని, ఇది రంగుల పండుగగా ప్రసిద్ధి చెందిందని, హోలీ పండుగ ప్రజల మధ్య ఆనందాన్ని, ఐక్యతను, ప్రేమను చాటి చెప్పే ఉత్సవంగా జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. హోలీ పండుగ ఆనందం, ఉల్లాసం, సామరస్యానికి సంకేతంగా, కొత్త శుభారంభానికి సూచికగా జరుపుకుంటారని అన్నారు. ప్రజలు సురక్షితంగా, ఆనందంగా హోలీ వేడుకలను జరుపుకోవాలని, పర్యావరణానికి హాని చేయని రంగులను ఉపయోగించాలని సూచించారు.

ఆశ వర్కర్‌పై అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడిని కఠినంగా శిక్షించాలి : సీఐటీయు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : బాధిత ఆశ వర్కర్ దళిత మహిళకు న్యాయం చెయ్యాలని మల్కాజి గిరి మండల కమిటీ ఆశ వర్కర్స్ యూని యన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సీఐటీయూ ఆఫీస్ నుండి మల్కాజిగిరి క్రాస్ రోడ్, అనుటెక్స్ సర్కిల్, మున్సిపల్ ఆఫీస్, మల్కాజిగిరి గవర్నమెంట్ ఆసుపత్రి మీదుగా మల్కాజిగిరి చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏ.హేమలత ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాతూ జగిత్యాల జిల్లాలో ఆశా వర్కర్స్‌పై అత్యాచారానికి పాల్పడ్డ నిందితున్ని అరెస్టు చేయాలని, నిందితునిపై ఎస్సి, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి, ఫస్ట్ ట్రాక్ కోర్ట్ ఏర్పాటు చేసి విచారణ జరిపి కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, వారి కుటుంబానికి రక్షణ కల్పించాలని, ఆశా వర్కర్లపై పని భారం తగ్గించాలని, ఆశ వర్కర్స్‌కు రక్షణ చర్యలు చేపట్టాలని, నైట్ డ్యూటీలు వెయ్యకూడదనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా నాయకులు, మల్కాజిగిరి మండల కార్యదర్శి బి.నర్సింగరావు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా, మండల నాయకులు వాసంతి, కె.రాణి, బాలమణి, శశికళ, చంద్రకాంత,సంతోష, మాదవి, రాజ్యలక్ష్మి, నమ్రత, మీనా, అనురాధ, అర్చన, పావని, శాలిమ, పవిత్ర, సుజాత, భారతి, సురేఖ, మమత, మహేశ్వరి, సునీత, శాంతికుమారి, సుగంధ, కె.స్వప్న, పద్మ, అలివేలు, రేణుక, సౌజన్య, మౌనిక, శిరీష, సరిత, భాగ్యలక్ష్మి, దివ్య, రోహిణి, సుగుణ, స్వాతి, స్వప్న, అనిత, జయశ్రీ పాల్గొన్నారు.

డైవర్షన్ పాలిటిక్స్‌తో గొంతునొక్కే ప్రయత్నం : వేముల

విశాలాంధ్ర - హైదరాబాద్ : అసెంబ్లీలో అధికార పక్షం కాంగ్రెస్ ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీమంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. సభలో అందరూ సమానమే అని జగదీష్ రెడ్డి అన్నారని ఇందులో తప్పు ఎక్కడ ఉందని నిలదీశారు. మాకు స్పీకర్ పట్ల గౌరవం ఉందని, నిన్న ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలు పక్కదారి పట్టించేందుకు స్పీకర్‌ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మీరు ఇప్పటివరకు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారా అని అడిగితే డైవర్షన్ చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలో, చివరకు మీడియా పాయింట్‌లో కూడా మా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ ఎంత డైవర్షన్ పాలిటిక్స్ చేసినా ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. వంద రోజుల్లోనే ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తుంటే సమాధానం లేక ఇలాంటి కుట్రలు చేస్తున్నారని అన్నారు. మేము ఎన్నడూ స్పీకర్ పట్ల అగౌరవంగా ప్రవర్తించలేదని, మేము స్పీకర్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించామన్నారు. జగదీష్ రెడ్డి క్షమాపణ అడిగే మాటలు ఎక్కడా మాట్లాడలేదని స్పష్టం చేశారు.

నీటి అవస్థలు తీర్చేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వేసవి కాలంలో ప్రజల నీటి అవస్థలు తీర్చేందుకు, సమగ్ర మంచినీటి సరఫరాను అందించేందుకు, అవసరమైన చోట లీకేజిలకు మరమత్తులు చేయించేందుకు, కొత్త బోర్లు వేయించేందుకు, గత కొంతకాలంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులతో సమీసుక్షించడం విధితమే... గురువారం మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది డివిజన్లలోని మంచి నీటి సమస్యల పై ఎమ్మెల్యే సూచన మేరకు సైనిక్ పురి హెచ్.ఎమ్.డబ్ల్యూ.ఎస్.ఎస్.బి. కార్యాలయంలో జి.యం. సునీల్ కుమార్ ను కలిసి డివిజన్ల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, త్వరలో పరిష్కరించాలని బి.ఆర్.ఎస్. నాయకులు కోరారు. ఈ సంధర్భంగా జి.యం.సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల సమస్యలపై సమీక్షించారని, యం.డి. అశోక్ రెడ్డిని కూడా కలసి యుద్ధప్రాతిపదికన పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారని, సాధ్యమైనంత వరకు ఈ ఎండా కాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సీనియర్ నాయకులు జే.ఏ.సి వెంకన్న, దోలి రమేష్, లక్ష్మణ్ యాదవ్, భాగ్యనంద్ రావు, శివా గౌడ్, ఉస్మాన్, వాసు, సాయి గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిసారి ప్రజలను మోసం చేస్తున్న మోడీ : వియస్ బోస్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రధాని మోడీ చెప్పే మాటలకు, నిర్వహించే పనులకు పొంతన లేకుండా పోతున్నదని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్ అన్నారు. అవినీతిని సహించనని తన పాలనలో దేశంలోని అవినీతిపరులు నిద్రపోకుండా ఉంటారని అనేకసార్లు ప్రకటనలు చేశారు. కానీ దేశంలో మోడీ పాలనలో అవినీతి రోజురోజుకు పెరిగిపోతున్న విషయం ప్రజలు గ్రహిస్తున్నారని ఆయన అన్నారు. విదేశాలకు పారిపోయిన అవినీతిపరులు, మోసకారులు సంత్సరాల తరబడి గడుస్తున్నా వారిని స్వదేశానికి తీసుకురావటం మోడీతో ఇప్పటివరకు కాలేదని ఆయన మండిపడ్డారు. వారిపై ఏలాంటి చర్యలు తీసుకోకపోవటం దురదృష్టకరమన్నారు. విదేశాలకు పారిపోయిన లలిత్‌మోడీ తప్పుడు రికార్డులతో వనౌతులో పౌరసత్వం పొందినా మన దేశ ప్రధానికి పట్టింపు లేదు. కానీ వనౌతు చిన్న దేశమైనా లలిత్‌మోడీ భారతదేశంలో తాను చేసిన నేరాలను, ఘోరాలను తెలుసుకొని ఇచ్చిన పౌరసత్వాన్ని రద్దు చేసింది. ఆ చిన్న దేశానికి ఉన్న ధైర్యం, సహసం మన దేశంలోని ప్రధాని మోడీకి లేకపోవటం విచారకరం. ఈ మధ్యనే కర్నాటక రాష్ట్ర బిజెపి అధ్యక్షుడుగా అత్యంత అవినీతి కేసులు ఎదుర్కొని జైలు ఊసలు లెక్కబెట్టిన, గనుల అక్రమ తవ్వకాలకు పాల్పడి అక్రమ వ్యాపారంలో శిక్షలు అనుభవించిన గాలి జనార్ధన్‌రెడ్డిని నియమించటం తో మోడీ చెప్పేవన్ని గాలి మాటలని మరోసారి తేటతెల్లమైందన్నారు. తన వారిని అవినీతి నుండి కాపాడటం ప్రతిపక్ష నాయకులను అవినీతి కేసుల్లో ఇరికించటమే మోడీ తనపనిగా పెట్టుకున్నట్లు నిదర్శనమవుతుంది. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డిక్టేటర్ ట్రంప్ భారతీయులను సంకెళ్లు వేసి తిరిగి భారతదేశానికి పంపుతుంటే మోడీ కనీసం ఖండించకపోగా నిరసన కూడా తెలియజేయకపోవటం మోడీ లొంగుబాటు తనాన్ని తెలియజేస్తుందని ఆయన అన్నారు. మన దేశ పౌరులను అమెరికా నుండి సంకేళ్లు లేకుండా మనదేశ విమానంలో తీసుకొస్తే దేశ ప్రతిష్ట, ఆ దేశం నుండి అవమానభరితంగా తిరుగు ప్రయాణం కట్టిన భారత పౌరులకు ఆత్మగౌరవం మిగిలేది. ఈ చర్యతో మోడీ ఏ పాటి దేశభక్తుడో తేటతెల్లమవుతున్నదని అన్నారు. కనీసం ఇప్పటికైనా మోడీ పనికిమాలిన మాటలను ఆర్భాటంగా ప్రకటించటం మాని, ప్రజలను మోసం చేయటం నిలిపివేయాలని బోస్ సూచించారు. మోడీ మోసాలను ప్రజలంతా అర్థం చేసుకొని దేశాన్ని దుష్టపాలన నుండి కాపాడుకోవాలని ప్రజలను కోరారు.

సీఎం కుర్చీని అవమానించేలా హరీష్ వ్యాఖ్యలు: బీర్ల

విశాలాంధ్ర - హైదరాబాద్ : మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు గతంలో శాసనసభ వ్యవహారాల మంత్రిగా కూడా పనిచేసి నేడు సీఎం కుర్చీని అవమానపరిచేలా మాట్లాడడం సిగ్గుచేటని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం కూడా ఆయన గవర్నర్ ప్రసంగం అడ్డుకునే ప్రయత్నం చేశారని, దీని తెలంగాణ ప్రజానీకం గమనిస్తోందని తెలిపారు. బీఆరెస్ ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధుల్లా కాకుండా పందికొక్కుల్లా వ్యవహరిస్తున్నారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యం, గవర్నర్, ముఖ్యమంత్రి అంటే బీఆర్ఎస్‌కు విలువలేదన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిని నిలబెట్టే స్థాయి లేని వారు ముఖ్యమంత్రి గురించి మాట్లాడుతున్నారంటూ ఎద్దేవాచేశారు. వీళ్ళు పది సంవత్సరాలు చేయని అభివృద్ధిలో 15 నెలల్లో చేస్తే తల ఎక్కడ పెట్టుకోవాలో తెలుస్తలేదన్నారు. 'మీలా మేము దొంగ దీక్షలు చేయలేదు, లేదా పెట్రోల్ దొరికినా అగ్గిపెట్టె దొరకలేదు అనే విధంగా మేము చేయలేదలెదని చురకలు అంటించారు. ప్రజల ఆదరణ చూసి ఓర్వలేక చిల్లర రాజకీయాలు చేస్తున్నారని కావున నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. మీ బలుపు, వాపు మీ దగ్గరే పెట్టుకోండి హరీష్ రావు తస్మాత్ జాగ్రత్త బిడ్డ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. నిన్ను గ్రామాల్లో తరిమికొట్టే రోజులు ముందు ఉన్నాయని, మీరు చేసిన తప్పులు, అప్పులు సరిదిద్దుకుంటూ వస్తున్నామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం. ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. ఇది చూసి ఓర్వలేకే దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, ఈరోజు రాష్ట్రం దివాలా తీయడానికి కారణం మీ మామ అల్లుళ్లు అంటూ విమర్శలు గుప్పించారు. ఇపుడు మళ్ళీ వారి తప్పులు కప్పిపుచుకునేందుకు సిగ్గులేకుండా ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష హెూదా నిర్వహించలేని పరిస్థితుల్లో మీరు ఉన్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీష్‌రావు క్షమాపణలు చెప్పాలి' అంటూ ఐలయ్య డిమాండ్ చేశారు.

హోలీ పర్వదిన శుభాకాంక్షలు



విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గ సమస్త ప్రజలకు, కార్పొరేటర్లకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు,కాలనీల అసోసియేషన్ సభ్యులకు, కాలనీల వాసులకు, పాత్రికేయ మిత్రులకు, ఆత్మీయులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ హెూలీ పర్వదిన శుభాకాంక్షలు తెలియపారు. ప్రకృతి అనేక రంగులతో సింగారించుకునే సమయం, అదే వసంతోత్సవం.. హెూలీ పర్వదినం అని, హెూలీ మన జీవితాలలో ఆనంద పరిమళాలను, సుఖ, శాంతి సౌభాగ్య విజయాలను నింపాలని మనసారా కోరుకుంటున్నాను అని, హెూలీ రంగుల వేడుకల్లిక అని, సహజ సిద్ధ రంగుల ను వాడుతూ, అన్ని రకాల జాగ్రతలు పాటిస్తూ పిల్ల పాపాలతో కుటుంబ సభ్యుల మధ్య సుఖ సంతోషాలతో హెూలీ పండుగను జరుపుకోవాలని ప్రజలకు తెలిపారు.

సీఎంపై పాడి కౌశిక్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డిపై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మూడు లక్షల పిచ్చి కుక్కలు ఉన్నాయని ఆ పిచ్చి కుక్కల అధ్యక్షుడే రేవంత్ రెడ్డి అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యానించడం దుమారం రేపుతున్నాయి. గురువారం రెండో రోజు బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని ఇబ్బందులు పెడుతోందని విమర్శించారు. 4 వేల పెన్షన్ వస్తుంది అనుకుంటే ఇప్పుడు 4 ఎకరాల పంట ఎండిపోతుంది అనుకోలేదని చిన్నపిల్లవాడు చెప్తుంటే గుండె తరుక్కుపోతుందని పేర్కొన్నారు. పంటలు ఎండిపోతుంటే కనీసం నీళ్లు ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో వచ్చిన కరెంటు, రైతుబంధు ఇపుడు ఎందుకు రావడం లేదో ప్రభుత్వ పెద్దలు చెప్పాలన్నారు. కేసీఆర్ మీద ఉన్న కక్ష్యతోనే పంటలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెడుతోందని ఆరోపించారు. హుజురాబాద్ నియోజకవర్గంలో పంటలు ఎండిపోయి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నీళ్లు వదలకపోతే రైతులను తీసుకొని తాను రోడ్డెక్కుతా అని హెచ్చరించారు. కేసీఆర్ కంటే గొప్ప పాలన చేసే ప్రయత్నం చేయాలి కానీ ఇలాంటి పరిస్థితులు రాకూడదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి 15 నెలలు అయితే ప్రతినెల ఒక్కటి చొప్పున 15 స్కాములు జరిగాయన్నారు. ఈ స్కాంగ్రెస్ పాలలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి హెూదాలో రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న తీరును ప్రజలు గమణిస్తున్నారని అన్నారు. సభా ప్రతిపక్ష నేత చావు కోరుతున్నారన్నారని, వందల మంది ఎల్‌ఓపీ లీడర్లు అయ్యారు కానీ ఎవరు కూడా చావును కోరుకోలేదన్నారు. మొరిగే కుక్కలు మొరుగుతూనే ఉంటాయని, కొండను చూసి కుక్కలు మొరిగితే కొండకు చేటా అని అన్నారు. 'కేసీఆర్ చావాలని నువ్వు కోరుకుంటున్నావు. కానీ కేసీఆర్ చచ్చే వ్యక్తి కాదు తెలంగాణను చావు నోట్లో తలపెట్టి తెచ్చిన వ్యక్తి కేసీఆర్. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదా.. ఈ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి తర్వాత అయ్యేవాడా. నీకు రాజకీయ భిక్ష పెట్టింది కేసీఆర్ అనే విషయం గుర్తుపెట్టుకో' అని అన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. ప్రజలు పెడుతున్న శాపనార్థాలకు కుక్క చావు చచ్చేది రేవంత్ రెడ్డి అంటూ వ్యాఖ్యలు చేశారు. రైతులు రైతుబంధు రాలేదని, రుణమాఫీ కాలేదని నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయని ఒక జర్నలిస్టుకు ఇంటర్వ్యూ ఇస్తే ఆ జర్నలిస్టును బెయిల్ రాకుండా కేసులు పెట్టి జైలుకు పంపించారని ఇది ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు.

రేపటి నుండి ఒంటిపూట బడులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణలో మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్న అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పని చేస్తాయని పేర్కొంది. పిల్లలకు 12.30గంటలకు మధ్యాహ్న భోజనం అందించి ఇంటికి పంపనున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల్ని సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ స్పష్టం చేశారు. ఎస్ఎస్‌సీ పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలు మాత్రం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. 2024 - 25 విద్యా సంవత్సరంలో ఆఖరి రోజైన ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ ఆదేశాలను అన్ని మేనేజ్‌మెంట్లు అమలు చేసేలా పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్‌లు, జిల్లా విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సీపీఐ నూతన సభ్యత్వ కార్డులు అందజేత

విశాలాంధ్ర- ఎల్.బి.నగర్ : న్యూ నాగోల్‌లోని ఎస్సే డాంగే భవన్‌లో, కొత్తపేట డివిజన్, మోహన్ నగర్ శాఖ, సిపిఐ పార్టీ సభ్యులకు 2025 సంవత్సరం నూతన సభ్యత్వం కార్డులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉడుతల మల్లేష్ శాఖ కార్యదర్శి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారత దేశంలో సిపిఐ పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్మిక వర్గానికి, కర్షక వర్గానికి, పార్టీ సభ్యులకి విప్లవాభివందనాలు తెలియజేశారు. దేశ స్వాతంత్రానికి ముందే స్థాపించి, స్వాతంత్ర పోరాటంలో మరియు ఆ తర్వాత అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి, దేశం నలుదిక్కుల ప్రజా పోరాటాలకు చొక్కానిగా నిలబడి, నేటికీ మొక్కవోని దీక్షతో, ఎర్రజెండా నీడ కింద శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా సమానత్వం కోసం, కార్మిక రాజ్యం కోసం, వర్గ దృక్పథంతో నాయకత్వం వహిస్తూ ముందుకు సాగుతున్న సిపిఐ శత వార్షికోత్సవాలు జరుపుకోవడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. నేటి తరాన్ని చైతన్యం చేస్తూ మతతత్వానికి వ్యతిరేకంగా, అవినీతి వ్యతిరేకంగా శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, సమాన పనికి సమాన వేతనం కోసం, అన్ని వర్గాలను చైతన్య పరుస్తూ, ముందుకు సాగుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ. అంజనేయులు, బరిగేలా కృష్ణ, ఎస్.సుగుణ, కె.రవి, ఎండి.హైమద్, పి.మధు, జగన్, సిహెచ్. ఈశ్వర్ పాల్గొన్నారు.

మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తెలంగాణా మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమము స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సమావేశ మందిరంలో బాలరాజ్ మన్నె అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.ఉమా గౌరీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యన్.సునీల్ రాజు హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి జిల్లా కార్యదర్శి బి.జోసఫ్‌లు రాష్ట్ర రాష్ట్రంలోని ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఏ రాష్ట్రములో లేనివిధంగా మన ధనిక రాష్ట్రంలో ఇప్పటి వరకు 5 డి.ఏ.లు పెండింగులో ఉన్నాయి. 2024 జూలై నుండి పి.ఆర్.సి.ని అమలు చేయవలసి ఉన్నప్పటికీ ఇప్పటికీ పి.ఆర్.సి. నివేదికను కమిటీ నుండి తెప్పించుకోకుండా తాత్సారం చేస్తూ ఉద్యోగులకు ఆర్థికంగా, న్యాయంగా రావలసిన అనేక బిల్లులు (లీవు ఎంకాష్మేంట్, జి.పి.యఫ్. మెడికల్ రీయింబర్స్‌మెంట్ మొదలగునవి) పెండింగులోనే ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు న్యాయంగా రావలసిన అన్ని బకాయిలను విడుదల చేస్తూ, పి.ఆర్.సి. నివేదికను వెంటనే తెప్పించుకొని పి.ఆర్.సి. అమలు చేయవలసినదిగా కోరారు. అనంతరం జిల్లా సంఘం ద్వారా ఏర్పాటు చేయబడిన నూతన సంవత్సర క్యాలెండర్ డైరీని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. ఉమా గౌరీ ద్వారా అవిష్కరించబడినది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, తెలంగాణ గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా నెల్లికంటి సత్యం ఎన్నిక

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎమ్మెల్సీగా నెల్లికంటి సత్యం ఎన్నిక కావడం ఉమ్మడి నల్లగొండ జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి దక్కిన గౌరవమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. నెల్లికంటి సత్యం ఎంఎల్‌సీగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ హిమాయత్ నగర్ మగ్దూం భవన్ గురువారం అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించారు. మాజీ ఎంఎల్‌సీ ఉజ్జిని యాదగిరి రావు, సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహ రెడ్డి, మల్లెపల్లి యాదిరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, ఎన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, సిపిఐ సూర్యపేట కార్యదర్శి బేజవాడ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతులు, కార్మికులు ఎక్కువ జనాభా ఉందని, వారి సమస్యల పరిష్కారం కోసం నెల్లికంటి సత్యం కృషి చేయాలన్నారు. గత ఎన్నికల్లో పొత్తు ఉన్నా.. లేకున్నా.. మునుగోడు నియోజకవర్గంలో ఓటిరిగానే పోటీకి సిద్ధమయ్యామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ముందుకు వచ్చి పొత్తులో మునుగోడు నియోజకవర్గం లో పోటీ చేసేందుకు తమకు అవకాశం ఇవ్వాలని, అనంతరం రెండు ఎంఎల్‌సీ స్థానాలు ఇస్తామని హామీనిచ్చిందన్నారు. పొత్తులో భాగంగా గత ఎన్నికల్లో సహకరించడంతో కాంగ్రెస్ గెలిచిందన్నారు. మునుగోడులో పార్టీ బలంగా ఉండటంతోనే ఇది సాధ్యమైందని, ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలిచేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పల్లా వెంకట్ రెడ్డి దిశ నిర్దేశం చేశారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని పార్టీని పటిష్టం చేయాలన్నారు. మండలాల వారిగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని, గెలిచే సర్పంచ్, ఎంపిటిసి, జెడ్ స్థానాలను గుర్తించాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు.

టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్థానిక సంస్థల ఎన్నికలలో పరస్పరం సహకారంతో ఎన్నికల్లో పోటీ చేద్దామని కోరినట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధ్యమైనన్ని స్థానాల్లో పోటీ చేసి, గెలుపొందేందుకు పార్టీ శ్రేణులు శ్రమించాలని పల్లా వెంకట్ రెడ్డి సూచించారు. నూతనంగా ఎంఎల్‌సీగా ఎన్నికైన నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కార్పొరేట్ రాజకీయాలు వచ్చిన ప్రస్తుత తరుణంలో కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమం ఉందన్నారు. రావి నారాయణ రెడ్డి, బొమ్మగాని ధర్మభిక్షం, అరుట్ల రామచంద్రా రెడ్డి, అరుట్ల కమలాదేవి, రామశర్మల స్ఫూర్తితో కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత బలంగా నిర్మిస్తామన్నారు. మునుగోడు ఎన్నికల్లో మన పాత్ర ముఖ్యమైందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దేవరకొండతో ఇతర ప్రాంతాలలో పార్టీని పటిష్టం చేస్తామన్నారు. రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నెల్లికంటి సత్యం చెప్పారు. పశ్య పద్మ మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర పార్టీల కృషితో సత్యం ఎంఎల్ ఎన్నికయ్యారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుడాలన్నారు. పార్టీ ప్రతిష్ట పెరగడానికి కృషి చేయాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు ఎంఎల్ ఎన్నికైన నెల్లికంటి సత్యంను ఘనంగా సన్మానించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర- ఆమనగల్లు : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించి, సమస్యలు పరిష్కరించే విధంగా చొరవ చూపాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సిఐటియు నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు కోరారు. హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఆమనగల్ సిఐటియు ఏరియా కన్వీనర్ జె. పెంటయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అమనగల్లు, కడ్తల్ మండలాల అధ్యక్షురాలు పద్మ, లక్ష్మమ్మ కార్మికులతో కలిసి ఎమ్మెల్యేను గురువారం కలిసి తమ సమస్యలను వివరించారు. అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలపై చర్చ జరిపి వాటిని పరిష్కరించే విధంగా చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా మంత్రులతో చర్చిస్తామని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి, కమిటీ సభ్యురాలు యశోదమ్మ, మహేష్ తదితరులున్నారు.

కాంగ్రెస్ టార్గెట్ జగదీష్ రెడ్డి : తలసాని

విశాలాంధ్ర - హైదరాబాద్ : శాసనసభలో ప్రతిసారి కాంగ్రెస్ పార్టీ మాజీమంత్రి జగదీష్ రెడ్డిని ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ సభ ఎవరి సొంతం కాదని, స్పీకర్ అంటే మాకు గౌరవం ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలే ప్రతిసారి దళితుడు, దళితుడు అని స్పీకర్‌ని ప్రతిసారి మాట్లాడుతూ అవమనపరుస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు ఛాంబర్ లేకుండా అవమానపరిచారని, బుధవారం ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ చావును కోరుకుంటూ మాట్లాడారని ధ్వజమెత్తారు. మీడియా పాయింట్ వద్ద కూడా మమ్మల్ని మాట్లాడకుండా చేయడానికి మాకు అవకాశం ఇవ్వకుండా చేస్తున్నారని విమర్శించారు. పదేళ్ళలో బ్రహ్మాండమైన అభివృద్ధి చేశామని, ఈ సభలో అందరికి హక్కు ఉంటుందని జగదీష్ రెడ్డి మాట్లాడిన దానిలో తప్పు కనపడడం లేదన్నారు. ఎవరు వల్గర్‌గా మాట్లాడుతున్నారో ప్రజలు చూస్తున్నారని ఎంతసేపు సభలో బీఆరెస్‌ను బుల్ డోజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జ్జగదీశర్ రెడ్డి ఎక్కడా అన్ పార్లమెంటరీ భాష వాడలేదని అల్టిమేట్ తీర్పు ప్రజలు నిర్ణయిస్తారన్నారు.

సీఎం వ్యాఖ్యలు అభ్యంతరకరం

విశాలాంధ్ర - హైదరాబాద్ : 2009 నుంచి నేను అసెంబ్లీలో ఉన్న, వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కేసిఆర్ లాంటి సీఎంలను చూసాను ఇపుడు రేవంత్‌రెడ్డి లాంటి వారిని కూడా ముఖ్యమంత్రి చూస్తున్న అంటూ మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి కేవలం ఓ మాజీ ముఖ్యమంత్రి లాగా చూస్తున్నడని కానీ మేము ఆయాన్ను తెలంగాణ తెచ్చిన గొప్ప వ్యక్తిగా చూస్తున్నామని చెప్పారు. అలాంటి గొప్ప వ్యక్తి అయిన కేసిఆర్‌ను చావాలని కోరుకుంటావా అంటూ బీఆరెస్ నేతలు మండిపడుతున్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పోయింట్ వద్ద ఎమ్మెల్యేలు కెపి.వివేకానంద, సుధీర్ రెడ్డి, మణిక్‌రావు, అనిల్ జాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుకుంటే పితృ సమానులైన కేసిఆర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. ఒక తండ్రి లాగా ఉన్న కేసీఆర్ చావును ఎవరు కోరుకోలేదని, కావున తెలంగాణ సమాజానికి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత 15 నెలలుగా రేవంత్ రెడ్డి మాట్లాడిన భాష అభ్యంతరకరంగా ఉందని, ఎంత సేపు కేసిఆర్‌ను కేసిఆర్ కుటుంబాన్ని ఎలా తిట్టాలని చూస్తున్నడని దుయ్యబట్టారు. ఇలాంటి భాష మాట్లాడితే ఊరుకునేది లేదని, పండబెట్టి తొక్కుతా, లాగుల తిండలు విడుస్తా అంటూ గతంలో మాట్లాడారు.

జర్నలిస్టుల ఆరోగ్యాన్ని కాపాడండి

డిప్యూటీ సీఎంతో టీయూడబ్ల్యూజే

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత ఐదేళ్లుగా రాష్ట్రంలో జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుకాక పోవడంతో, అప్పులు చేసి చికిత్స పొందే పరిస్థితి నెలకొందని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందే ఆర్థిక స్తోమత లేక ఇప్పటికే పలువురు జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ప్రతినిధి బృందం వాపోయింది. గురువారం అసెంబ్లీ లాబిలో ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం కలిసి జర్నలిస్టుల ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. గత ప్రభుత్వం 2015లో ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు అందించిన హెల్త్ కార్డులు కొంతకాలం ఎంతో ప్రయోజనం చేకూర్చాయని, గడిచిన ఐదేళ్లుగా ఆసుపత్రుల్లో అవి చెల్లకపోవడంతో, అనారోగ్యలకు గురవుతున్న జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పడరాని తిప్పలు పడుతున్నట్లు విరాహత్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలుచేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల మెనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పొందుపర్చడంతో జర్నలిస్టులు ఎంతో సంతోషపడ్డారని ఆయన గుర్తుచేసారు. అయితే ఇంకా అది అమలు కాక పోవడంతో జర్నలిస్టులు నిరాశ చెందుతున్నట్లు ఆయన తెలిపారు. వెంటనే ఆరోగ్య పథకాన్ని అమలు పరిచి, జర్నలిస్టుల అకాల మరణాలను ఆపేందుకు చర్యలు చేపట్టాలని విరాహత్ అలీ కోరారు. అలాగే రాష్ట్రంలో జర్నలిస్టులు తమ విధులను సజావుగా నిర్వహించేందుకు, సంఘ వ్యతిరేక శక్తుల నుంచి వారికి రక్షణ కల్పించేందుకు, జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు అనేక జీవోలు తెచ్చి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాయని, రాష్ట్ర విభజన తర్వాత ఆ కమిటీలు నిర్వీర్యమై పోయినట్లు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వేజ్ బోర్డు సిఫార్సుల అమలును పర్యవేక్షించే త్రైపాక్షిక కమిటీ, వర్కింగ్ జర్నలిస్ట్ వేల్ఫేర్ ఫండ్ కమిటీ, జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపవర్ కమిటీతో పాటు ఇతర కమిటీలను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని అందించారు. టీయూడబ్ల్యూజే వినతిపై డిప్యూటీ సియం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టులకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందన్నారు. యూనియన్ ప్రతినిధి బృందంతో త్వరలో సమావేశమై సమస్యలపై కులంకుశంగా చర్చిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. డిప్యూటీ సియంను కలిసిన ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కలుకూరి రాములు, జర్నలిస్ట్ హెల్త్ కమిటీ కన్వీనర్ ఏ.రాజేష్, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజనీకాంత్‌తో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : అతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పివిఎన్ కాలనీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ వై.ప్రేంకుమార్ విచ్చేసి వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకి ఇచ్చిన వాగ్దానాలు అమలు పరుస్తూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధికి పెద్ద ఎత్తున పథకాలను ప్రకటించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి చెందిన అధికారులు డిప్యూటీ కమిషనర్ రాజు మాట్లాడుతూ మల్కాజిగిరిలో మహిళా సమాఖ్య సభ్యులు చాలా చురుకుగా పాల్గొంటున్నారని రాబోయే రోజుల్లో ప్రభుత్వ పథకాలను వారికి అందజేస్తామని తెలియజేశారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లికార్జున్, ఏ.ఎం.హెచ్.ఓ మంజుల, సానిటరీ సూపర్వైజర్ శ్రీనివాస్, లక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాఖ్య మహిళా సభ్యులు అతిథుల్ని సన్మానించారు.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పివిఎన్ కాలనీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి కార్యదర్శి రీన, మాధురి, వరలక్ష్మి, మాధవి, రిసోర్స్ పర్సన్ అఖిల, కార్యవర్గ సభ్యులు, స్థానిక నాయకులు సత్యమూర్తి, ఉమేష్ సింగ్, బాబు, సత్యనారాయణ, సంపత్, బ్రహ్మయ్య, రాము, కృష్ణంరాజు, నరసింహారెడ్డి, రత్న భూషణ్, హరికిషన్, రామకృష్ణ, లక్ష్మీ కవిత, రోజా రమణి, కిషోర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ నేతాజీ నగర్‌లో రూ. 20 లక్షలతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీ వాసులతో జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ సీసీ రోడ్ నిర్మాణ పనుల్లో నాణ్యతా విషయంలో ఎక్కడా కూడా రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలను పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని అదేవిధంగా రాబోవు కాలంలో కాలనీ వాసులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరి చూసుకుంటూ వీలైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు వారు సూచించారు. గచ్చిబౌలి డివిజన్‌లో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గచ్చిబౌలి డివిజన్‌లో మౌలిక వసతులను మెరుగుపరచేందుకు గత నాలుగేళ్లలో కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టామని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, రానున్న రోజుల్లో గచ్చిబౌలి డివిజన్‌ను ఇంకా వేగంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలకు మేలైన మౌలిక వసతుల కల్పనకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు భేరీ రామచందర్ యాదవ్, ఉపాధ్యక్షులు రాయుడు, సీనియర్ నాయకురాలు రాజేశ్వరమ్మ, జయ రెడ్డి, సీనియర్ నాయకులు రవి నాయక్, తిరుపతి, సంతోష్, శ్రీనివాస్, చారి, దశరథ్ నాయక్, గణేష్ నాయక్, నరసింహ యాదవ్, బాలరాజు సాగర్, శ్రీను, వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, నేతాజీనగర్ కాలనీ వాసులు, స్థానిక నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: జలమండలి ప్రధాన కార్యాలయంలో జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మర్యాద పూర్వకంగా కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పరిష్కారించవలసిన పలు సమస్యలపై, చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనుల కొరకై నిధుల మంజూరు గురించి చర్చించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అక్కడక్కడ నెలకొన్న డ్రైనేజి సమస్యల పరిష్కారానికి నిధులను మంజూరు చేయాలని కోరినారు. పెరుగుతున్న జనావాసలకు అనుగుణంగా కాలనీ వాసుల దాహార్తిని తీర్చడానికి, మిగిలిపోయిన అసంపూర్తి మంచి నీటి పైప్ లైన్ నిర్మాణానికి అదనంగా నిధులు మంజూరు చేయాలని, త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ఎండకాలంను దృష్టిలో పెట్టుకొని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే గాంధీ కోరారు. ఎండకాలంను దృష్టిలో పెట్టుకొని మంచి నీటి ఎద్దడి రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, మంచి నీటి కొరత రాకుండా అందరికి స్వచ్ఛమైన మంచి నీరు అందించాలని ప్రజావసరాలును దృష్టిలో పెట్టుకొని అదనపు మంచి నీటిని విడుదల చేయాలని, ప్రజల దాహార్తి తీర్చేవిధంగా, మంచి నీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కోరారు. దీనికి సానుకులంగా స్పందించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ పైన పేర్కొన్న సమస్యలపై సానుకూలంగా స్పందించడం జరిగింది. అదేవిధంగా డ్రైనేజి సమస్య పరిష్కారానికై యుజీడీ పైప్ లైన్ నిర్మాణం పనులకు నిధులు మంజూరు చేస్తామని, అదనపు మంచి నీటి పైప్ లైన్ నిర్మాణంకు నిధులు మంజూరు చేస్తామని, అదనపు మంచి నీటిని విడుదల చేస్తామని, సీవరేజ్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని దశల వారీగా నిధులను సమకూరుస్తానని ఎండీ అశోక్ రెడ్డి తెలియచేసారు. దీనికి గాంధీ జలమండలి ఎండీ అశోక్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నూతన గృహప్రవేశంలో పాల్గొన్న కొలను శ్రీనివాస్ రెడ్డి

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంద్రన్న కాలనీ నివాసులు శివ నాగరాజు యాదవ్ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నాగరాజుకు, అయన సతీమణికి శుభా కాంక్షలు తెలిపారు.

ఆమ్ ఆద్మీ పార్టీ వలంటీర్లు అరెస్టులకు లొంగరు

విశాలాంధ్ర - బషీర్‌బాగ్: ఆమ్ ఆద్మీ పార్టీ వాలంటీర్ల మనోబలాన్ని దెబ్బ తీయడానికి మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసు వారితో కుమ్మక్కు అయి తప్పుడు కేసులు బనాయించి ప్రజా గొంతుక అయిన నహీం పాషా, రాజేందర్‌లను అరెస్టు చేసి రిమాండుకు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. గతంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుల మీద వేస్తున్న అక్రమ కేసులు, నిరంతర దాడులు వీటి గురించి తాము ఇంతకుముందే డిజిపి ఇతర పోలీసు అధికారులకు చేశామన్నారు. గుండాలు దాడులు చేస్తున్నా తమ పార్టీ కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువ అవుతున్న సమయంలో, ప్రజలకు మరింత ఉపయోగకరమైన కార్యక్రమాలు చేయడం, అధికారులను ప్రశ్నించడం, ఇవన్నీ అక్కడ ఉన్న అధికారులకు కంటి తరుపున మారాయన్నారు. అధికారులను, డిపార్ట్మెంట్ వారిని ప్రశ్నిస్తున్నారనే ఉద్దేశంతో ఎలానైనా పార్టీ కార్యక్రమాలను ఆపాలని కక్షపూరిత ఉద్దేశంతో తమ పార్టీ కార్యకర్తలపై అనేక రకమైన అసత్య, అక్రమ కేసులు బనాయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాలను అడ్డుకునే విధంగా చేయడం కోసం జిల్లా పార్టీ నాయకులు నయీమ్ భాష, రాజేందర్, నాగేందర్ అరెస్ట్ చేయడం జరిగిందని, ఇలాంటి అక్రమ అరెస్టులతో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయాలని కార్యక్రమాలని ఆపాలని పోలీసు వారి ముఖ్య ఉద్దేశం అన్నారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే మద్దతు, ఇలాంటి అరెస్టులు అక్రమ కార్యక్రమాలతో ఆమ్ ఆద్మీ పార్టీని అడ్డుకోలేరన్నారు. ఇలాంటి సమయంలో పార్టీ కార్యకర్తలందరూ ఐకమత్యంగా ఉండి వీటిని ధైర్యంగా ఎదుర్కోవాలనీ పిలుపునిచ్చారు.

చర్చి నిర్మాణం వెంటనే నిలిపి వేయాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచర్లలోని కాకతీయ నగర్ కాలనీ పక్కన లేఅవుట్‌లో అనధికారికంగా చర్చి నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ పార్టీ ఈస్ట్ జోన్ అధ్యక్షులు ఎర్రుల మహేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శైలజకి కాలనీ వారితో కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గొనె శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి, బీజేపీ నాయకులు వేణుగోపాల్, ధర్మ రెడ్డి, నరసింహారెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మొల్లమాంబ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని హఫీజ్ పేట్ కుమ్మర సంఘం అధ్యక్షుడు కైతాపురం వెంకటేష్ కోరారు. రామాయణాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించిన కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను గురువారం హఫీజ్ పేట్ గ్రామం, కుమ్మర బస్తీలో హఫీజ్ పేట్ కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కైతాపురం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కైతాపురం జితేందర్ మాట్లాడుతూ రామాయణాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించిన గొప్ప కవయిత్రి, కుమ్మర కుల ఆడపడుచు కవయిత్రి ముల్లమాంబ 16వ శతాబ్దంకు చెందినదని అన్నారు. హైదరాబాదులోని ట్యాంక్ బండ్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహిస్తున్నదని కానీ రాష్ట్రవ్యాప్తంగా కూడా మొల్లమాంబ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హఫీజ్ పేట్ కుమ్మర సంఘం నాయకులు సందపేట్ సత్తయ్య, కైతాపురం పాపయ్య, సందపేట్ సురేష్, కైతాపురం కృష్ణ, సందపేట్ రాకేష్, కైతాపురం కౌశిక్, ఇతరులు పాల్గొన్నారు.

దేశప్రగతిలో విద్యార్థులే కీలక పాత్రధారులు

విశాలాంధ్ర - సత్తుపల్లి : నేటి విద్యార్థులు దేశ ప్రగతిలో కీలక పాత్రధారులని మండల విద్యాశాఖ అధికారి నక్క రాజేశ్వరరావు అన్నారు. కల్లూరు మండలం పెద్ద కోరుకొండి గ్రామానికి చెందిన నున్న నరేష్ లావణ్య దంపతుల కుమారుడు తక్షిత్ రామ్ జన్మదినం సందర్భంగా పదవ తరగతి పరీ క్షలు రాయబోయే విద్యార్థులకు మెటీరియల్ కోసం పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించిన నరేష్ లావణ్య దంపతులను మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు అభినందించారు. నవచైతన్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకర్లపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ తక్షిత్ రామ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని అందరూ బాగా చదువుకోవాలని 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు. 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందించే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి 10,000 రూపాయలు సాయాన్ని అందించిన నరేష్ - లావణ్య దంపతులకు నవచైతన్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కృతజ్ఞతలు తెలియచేశారు.

హోలీ ప్రశాంత వాతావరణంలో జరపుకోవాలి : డిఎస్పీ

విశాలాంధ్ర - ఇల్లందు : ఇల్లందు పట్టణ, సబ్ డివిజన్ పరిధిలో ప్రజలకు హెూలీ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డి.ఎస్.పి ఎన్. చంద్రభాను కోరారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ పలు సూచనలు చేసారు. తెలియజేస్తున్నాను. హెూలీ తో పాటు రంజాన్ ఉపవాసాలు కూడా ఉన్నందు వల్ల ఎవరికి ఎటువంటి ఆటంకం లేకుండా ప్రజలందరూ సోదరాభవంతో మెలగాలని డిఎస్పీ కోరారు. హెూలీ పండుగను ఆనందోత్సవంగా జరుపకోవాలని పండుగ అనంతరం గ్రామాలలో ఉండే చెరువులలో గాని, కాలువలలొ కానీ దిగి స్నానం చేయొద్దన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువకులు జాగ్రత్తలు తీసుకొవాలని విరిపై బయిటికి స్నానాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు నిఘా పెట్టాలని సూచించారు. సజమైన రంగులు చల్లుకోవాలని ప్రమాదకరమైన వాటిని వాడకూడన్నారు.

ప్రకృతి సభకు కలెక్టర్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో ఈ నెల 23 న నిర్వహించనున్న ప్రకృతి - ఆరోగ్య మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ నిర్వాహకులు కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌కు వెళ్లి ప్రకృతి ప్రేమికులు మొక్కను అందించి ఆహ్వాన పత్రిక ఇచ్చారు. జిల్లాలొ ప్రకృతి, పర్యావరణంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తు ముందుకెళుతున్న కలెక్టర్ ను సభలకు వచ్చి సందేశం ఇవ్వాలని సభ్యుల విజ్ఞప్తి చేశారు. ఆశ్రమ సభ్యులు గత కొన్నేళ్లుగా చేస్తున్న ప్రకృతి సేవతోపాటు ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సూచనలు, సభలు, కార్యక్రమాలపై కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. సభలో తప్పకుండ పాల్గొంటానని తెలియజేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమలొ కొత్తగూడెం మున్సిపల్ గ్రీన్ అంబాసిడర్ మొక్కల వెంకటయ్య, సభల కో-ఆర్డినేటర్ జి. సుగుణరావు, మొక్కల రాజశేఖర్, బంగారి శంకర్, దయానంద సాగర్, రాజేష్ లు పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధం కాదు

'తమిళ రూపాయి'పై డి.రాజా

న్యూఢిల్లీ: తమిళనాడు రాష్ట్ర బడ్జెట్‌లో రూపాయి జాతీయ చిహ్నం స్థానంలో తమిళ అక్షరం పెట్టడం ప్రస్తుతం దుమారం రేపింది. దీనిపై బీజేపీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నది. అయితే స్టాలిన్ ప్రభుత్వం చేసిన దాంట్లో తప్పేమీ లేదని సీపీఐ సమర్థించింది. ఇది ఏ విధంగానూ రాజ్యాంగానికి విరుద్ధం కాదని పార్టీ ప్రధాన కార్యదర్శి దొరైసామి రాజా (డి.రాజా) అన్నారు. 'సమాజంలోని అన్ని వర్గాలను మేల్కొలిపే దిశగా తమిళనాడు ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకున్నది. రాష్ట్ర బడ్జెట్ తమిళంలో ఉన్నది. అది తమిళనాడుకు సంబంధించినది. తమిళనాడు ప్రభుత్వం సంఖ్యలను మార్చలేదు... దీనిని అర్థం చేసుకోవడం అవసరం. రూపాయి చిహ్నాన్ని మాత్రమే మార్చింది. ఇందులో తప్పేమీ లేదు. ఇది ఏ రకంగానూ రాజ్యాంగానికి విరుద్ధం కాదు' అని రాజా అన్నారు. 2025-26 బడ్జెట్‌ను తమిళ 'రూపాయి'తో తమిళనాడు ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జాతీయ విద్యా విధానం-2020లో ప్రతిపాదిత త్రిభాషా విధానానికి వ్యతిరేకంగా కేంద్రంతో తమిళనాడు ప్రభుత్వం పోరాడుతోంది. ఈ క్రమంలో తాజా పరిణామం పెద్దఎత్తున చర్చకు దారితీసింది. దీనిపై బీజేపీ విమర్శలను డీఎంకే తిప్పికొట్టింది. తమ పార్టీపై రాష్ట్ర ప్రజల్లో వ్యతిరేకత రావాలనే బీజేపీ యత్నిస్తోందని, అన్ని అవసరాల కోసం మాతృభాషను వినియోగించడం కేంద్ర ప్రభుత్వ సిద్ధాంతాలలో ఉన్నదని ఎమ్మెల్యే నాగరత్నన్ గుర్తుచేశారు. అధికారిక అవసరాల కోసం మాతృభాష వినియోగం తప్పేలా అవుతుందని ప్రశ్నించారు. తమ సిద్ధాంతాల ఆచరణలో బీజేపీ వారు విఫలమవుతున్నారని దుయ్యబట్టారు.

బడ్జెట్ పత్రాలపై 'రూపే' ఔట్

- హిందీ 'రూ' స్థానే తమిళ 'రూ'
- తమిళనాడు సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ: తమిళనాడులో రోజు రోజుకూ త్రిభాషా వివాదం తీవ్రమవుతోంది. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) లో భాగంగా హిందీని మూడో భాషగా తప్పకుండా నేర్చుకోవాలని కేంద్రం చెబుతుండగా... దానికి తమిళనాడు తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం తమిళనాడు ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. 2025 - 26 బడ్జెట్‌లో హిందీ 'రూపే' గుర్తును తొలగించి తమిళ 'రూ' అక్షరాన్ని పెట్టింది. తమిళ చిహ్నం ఉన్న బడ్జెట్ ప్రతులను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. స్వయంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కొత్త లోగోను 'ఎక్స్'ఖాతాలో పోస్ట్ చేశారు. కొత్త జాతీయ విద్యా విధానం ద్వారా 'హిందీ విధించడం'పై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో.. అధికార డీఎంకే పోరాటం చేస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రూపాయి చిహ్నం మార్చేసింది. ఈ మార్పుపై ఇప్పటివరకు తమిళనాడు ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక సమాచారం రాలేదు. కాగా నాయకుడు శరవణన్ అన్నాదురై ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ "ఇందులో చట్టవిరుద్ధం ఏమీ లేదు... ఇది 'షోడౌన్' కాదు. మేము తమిళానికి ప్రాధాన్యత ఇస్తున్నాము... అందుకే ప్రభుత్వం దీనితో ముందుకు సాగింది" అన్నారు. అలాగే తమిళ సంఘాలు ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశాయి. తమపై బలవంతంగా హిందీని రుద్దవద్దని, ఎన్ఈపీని తమిళనాడులో అమలు చేయబోమని ఇప్పటికే అనేకమార్లు ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ తేల్చి చెప్పారు. చెన్నైలో జరిగిన డీఎంకే కార్యకర్తల సమావేశంలో కూడా ఎన్ఈపీ అనేది విద్యా విధానం కాదని, అది కాషాయ విధానమని ఆరోపించారు. దేశాన్ని అభివృద్ధి చేయడానికి ఎన్ఈపీ ని ప్రవేశ పెట్టలేదని కేవలం హిందీని డెవలప్ చేయడానికి మాత్రమే ఉద్దేశించిందని విమర్శించారు. ఎన్ఈపీతో తమిళనాడు విద్యాభివృద్ధి పూర్తిగా నాశనం అవుతుందని, అందుకే దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.

తమిళుడు రూపొందించిన చిహ్నాన్ని తీసేస్తారా? బీజేపీ

తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎక్స్ ' వేదికగా సీఎం స్టాలిన్‌పై విరుచుకుపడ్డారు. "తమిళుడు రూపొందించిన జాతీయ చిహ్నాన్ని డీఎంకే విస్మరిస్తోంది. స్టాలిన్ మీరు ఎంత తెలివ తక్కువారు అవుతారు" అని అన్నామలై ట్వీట్ చేశారు. బీజేపీ ఐటీ సెల్ అధిపతి అమిత్ మాల్వియా కూడా విమర్శలు గుప్పించారు. "ఉదయ కుమార్ ధర్మలింగం ఒక భారతీయ విద్యావేత్త, డిజైనర్, మాజీ డీఎంకే ఎమ్మెల్యే కుమారుడు. ఆయన భారత రూపాయి చిహ్నాన్ని రూపొందించారు. దీనిని భారత్ ఆమోదించింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తమిళనాడు బడ్జెట్ 2025-26 పత్రం నుండి ఆ చిహ్నాన్ని తొలగించడం ద్వారా తమిళులను అవమానిస్తున్నారు. ఎంత హాస్యాస్పదంగా ఉంది" అని పేర్కొన్నారు.

రామకృష్ణ, జల్లి విల్సన్ విజ్ఞప్తికి స్పందన

మాజీ ప్రజాప్రతినిధుల పెన్షన్ పెంపుదలకు సీఎం సానుకూలత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా మాజీ శాసన మండలి సభ్యులకు, మాజీ శాసన సభ్యులకు పెన్షన్ పెంపుదలకు సీఎం నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు. ఇటీవల వెలగపూడి సీఎం కార్యాలయంలో చంద్రబాబును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ, ఏపీ ఫార్మర్ లెజిస్లేటచర్స్ ఫోరమ్ వైస్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కలిసి మాజీ ప్రజాప్రతినిధుల పెన్షన్ల పెంపు, వారి సమస్యలపై స్వయంగా కలిసి విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు ఏళ్ల తరబడి ప్రజా జీవితంలో మమేకమై సేవలు అందిస్తున్నారని తెలిపారు. వారు వయస్సు మీరడంతో వృద్ధాప్యంలోను అనేక శారీరక రుగ్మతలతోను, ఆర్థిక ఇబ్బందులతోను, కుటుంబాల భారాలతోను సతమతమవుతున్నారని వివరించారు. వారిలో ఎక్కువ మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేదలే ఉన్నారని వివరించారు. అధిక ధరలు, నిత్యావసరాలు పెరిగిపోయిన దృష్ట్యా మాజీ ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం నెలకు ఇస్తున్న పెన్షన్ రూ.30వేలకు సరిపోవడం లేదని వివరించారు. పదేళ్ల నుంచి రాష్ట్రంలలో పెన్షన్ పెరుగుదల లేదని, మన నుంచి విడిపోయిన తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఐదు సంవత్సరాల నుంచి మాజీ ప్రజాప్రతినిధులకిచ్చే పెన్షన్‌ను కనిష్టంగా రూ.50 వేలు, గరిష్టంగా రూ.70 వేలు పరిగణలోకి తీసుకుందన్నారు. మన రాష్ట్రంలోని మాజీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు పెన్షన్‌ను కనీసం ప్రారంభంగా రూ.50 వేలకు పెంపుపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని రామకృష్ణ, జల్లి విల్సన్ విజ్ఞప్తి చేయగా... ఆ మేరకు చంద్రబాబు స్పందించారని తెలిపారు. వృద్ధులైపోయి కొంత మంది దీర్ఘకాలిక వ్యాధులతో మంచాలకే పరిమితమైన మాజీ ప్రజాప్రతినిధులకు, వారిపై ఆధారపడిన కుటుంబాలను ఆదుకుని ఉపశమనం కలిగించాలని రామకృష్ణ, జల్లి విల్సన్ ప్రత్యేకంగా కోరగా, దానిపై చంద్రబాబు స్పందిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌ను పరిశీలించి సానుకూల చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

'ఉపాధి' వేతన నిధులు విడుదల చేయాలి

పార్లమెంటరీ కమిటీ నివేదికపై కాంగ్రెస్

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) వేతన రేట్ల సవరణ, ప్రధాన పథకం కింద ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థను ఐచ్ఛికం చేయడం వంటి వాటిపై గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సులను కాంగ్రెస్ గురువారం లేవనెత్తింది. ఉపాధి హామీ పథకం, ఇతర పథకాల కింద పశ్చిమ బెంగాల్‌కు నిధులను నిలిపివేయడం 'తీవ్రమైన పరిణామాలకు' దారితీసిందని, ఇందులో కష్టాల వలసలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలలో అంతరాయాలు గణనీయంగా పెరిగాయని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. ఒడిశాకు చెందిన కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి ఉలక నేతృత్వంలోని ఈ కమిటీ ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో నిధుల స్తబ్దత ఉందని కూడా వెల్లడించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్) జైరాం రమేశ్ మాట్లాడుతూ సప్తగిరి ఉలక అధ్యక్షతన గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 2025-2026 సంవత్సరానికి గ్రాంట్ల డిమాండ్ నివేదిక విడుదల చేసిందని తెలిపారు. 'ఇది కొన్ని కీలక సిఫార్సులు చేసింది. ఉపాధి హామీ పథకం కింద చెల్లించాల్సిన వేతన రేట్ల సవరణ, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ వేతనాల పెంపును నిర్ణయించడానికి వ్యవసాయ కార్మికుల సూచిక నుంచి దూరంగా ఉండటం. ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఇతర పథకాల కింద పశ్చిమ బెంగాల్‌కు రావాల్సిన అన్ని నిధుల విడుదల' అని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద వేతనాలు, సామగ్రి చెల్లింపులో జాప్యాన్ని నివారించడానికి ప్యానెల్ సిఫార్సును కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది ఫిబ్రవరి 15 నాటికి వేతనాలలో రూ.12,219.18 కోట్లు, సామాగ్రికి సంబంధించి రూ.11,227.09 కోట్లు ఉన్నాయి. ఉపాధి వేతనాల చెల్లింపు కోసం ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థను ఐచ్ఛికం చేయాలని, ఉపాధి హామీ పథకం కింద హామీ ఇవ్వబడిన పని దినాలను 100 రోజుల నుంచి 150 రోజులకు పెంచాలని ప్యానెల్ సిఫార్సు చేసిందని ఆయన అన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కులు షురూ

- 175 నియోజకవర్గాల్లో... తొలుత 26 జిల్లా కేంద్రాల్లో...
- 10 ప్రాజెక్టుల్లో రూ.1,21,659 కోట్ల పెట్టుబడులు
- సుమారు 80 వేల మందికి ఉద్యోగ అవకాశాలు
- నెల రోజుల్లో 5 రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని 175 నియోజవకర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తొలుత జిల్లాకు ఒకటి చొప్పున 26 జిల్లాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచిం చారు. రాష్ట్రానికి పెట్టుబడుల విషయంలో ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గురువారం సచివాలయంలో తన అధ్యక్షతన జరిగిన 4వ ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి రాష్ట్రానికి కొత్తగా వస్తున్న పెట్టుబడుల ప్రతిపాదనలను పరిశీలించారు. పరిశ్రమలు, విద్యుత్, పర్యాటకం వంటి రంగాల్లో మొత్తం 10 సంస్థలు రూ.1,21,659 కోట్లు పెట్టుబడులు ముందుకురాగా ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 80,104 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. అలాగే, గత మూడు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టులు, వాటి పురోగతిని సీఎం సమీక్షించారు.

ఇప్పటికే ప్రతిపాదించిన రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను నెల రోజుల్లోగా రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో 5 సెంటర్లు నెలకొల్పాలని, పెట్టుబడులు గ్రౌండ్ అయ్యే వరకు ఆయా సంస్థల వెనకపడాలని అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు వేగంగా అనుమతులు ఇవ్వడంతో పాటు క్షేత్ర స్థాయిలో ఆయా ప్రాజెక్టులు పనులు మొదలుపెట్టేలా చూడాలన్నారు. ఈ విషయంలో 175 నియోజకవర్గాల్లో అటు మంత్రులు, ఇటు అధికారులు మరింత వేగంగా పని చేయాలని, అప్పుడే ప్రతి ఏడాది ప్రగతి, ఫలితం కనిపిస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు.

ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన సంస్థల వివరాలు ఇవే: ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ : నాయుడుపేట-రూ.1,742 కోట్ల పెట్టుబడులు, 2,000 ఉద్యోగాలు, దాల్మియా సిమెంట్ : కడప జిల్లా-రూ.2,883 కోట్ల పెట్టుబడులు, 354 ఉద్యోగాలు, లులూ గ్లోబల్ ఇంటర్నేషనల్ : విశాఖపట్నం-రూ.1,500 కోట్ల పెట్టుబడులు, సత్యవీడు రిజర్వ్ ఇన్ఫ్రాసిటీ ప్రైవేట్ లిమిటెడ్ : శ్రీసిటీ-రూ.25,000 కోట్ల పెట్టుబడులు, 50,000 ఉద్యోగాలు, ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ : రూ.58,469 కోట్ల పెట్టుబడులు, 13,050 ఉద్యోగాలు, బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ : రూ.1,175 కోట్లు, 1,500 ఉద్యోగాలు, ఏపీ ఎన్జీఈఎల్ హరిత్ అమ్రిత్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు రూ.22,000 కోట్ల పెట్టుబడులు, 8,300 ఉద్యోగాలు, ఆస్త్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : అన్నమయ్య, కడప జిల్లాలు- రూ.8,240 కోట్లు, 4,000 ఉద్యోగాలు, మేఫెయిర్ బీచ్ రిసార్ట్స్, కన్వెన్షన్ : రూ.400 కోట్ల పెట్టుబడులు, 750 ఉద్యోగాలు, ఒబెరాయ్ విలాస్ రిసార్ట్ : రూ.250 కోట్ల పెట్టుబడులు, 150 ఉద్యోగాలు రానున్నాయి. ఇప్పటివరకు నాలుగు ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.4,32,584 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా మొత్తం 3,92,680 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయని అధికారులు వెల్లడించారు.

ఓబులాపురం మైనింగ్ కేసులో టీడీపీ నేతలకు ఊరట

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసులో తెలుగుదేశం పార్టీ నేతలకు భారీ ఊరట లభించింది. కేసును కొట్టివేస్తూ... విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు తీర్పిచ్చింది. అనంతపురం జిల్లా ఓబులాపురంలో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ... 2007 జులై 21న టీడీపీ నేతలు పరిశీలనకు వెళ్లారు. ఓబులాపురం మైనింగ్ లోకి అక్రమంగా వచ్చారనే ఆరోపణలతో... 21మందిపై కేసులు నమోదయ్యాయి. కేసు విచారణలో ఉండగా ముగ్గురు చనిపోయారు. ప్రస్తుత మంత్రి అచ్చెన్న, దేవినేని ఉమ, నిమ్మకాయల చినరాజప్ప, ఎర్రబెల్లి దయాకరరావు, ధూళిపాళ్ల నరేంద్ర, నాగం జనార్దన్ రెడ్డితో పాటు మరి కొంతమందిపై కేసులు ఉన్నాయి. పోలీసులు పేర్కొన్న అంశాలపై అభియోగాలు ఎదుర్కొంటున్న నేతల నుంచి 313 స్టేట్ మెంట్ ను న్యాయాధికారి రికార్డు చేశారు. తమపై తప్పుడు కేసు బనాయించారని అభియోగం ఎదుర్కొన్నవారు కోర్టులో తెలిపారు. ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచిన విధంగా తాము ఎక్కడా ఎలాంటి నేరానికి పాల్పడలేదని న్యాయాధికారి ప్రశ్నలకు... వివరణ ఇచ్చారు. ఇరువురి వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం కేసును కొట్టేస్తూ తీర్పిచ్చింది.

చంద్రబాబుతో నాగం భేటీ

తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘ కాలం మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అసెంబ్లీ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆనాటి కేసులను ఎట్టకేలకు కొట్టివేయడంపై చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు. చాలా కాలం తరువాత తనను కలిసిన నాగంను సీఎం చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. నాగం గారూ...ఎలా ఉన్నారు....ఆరోగ్యం ఎలా ఉంది...చాలా రోజులు అయ్యింది కలిసి అంటూ పలకరించారు. పిల్లలు ఏం చేస్తున్నారు అని ఆరా తీశారు. నాగం కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్న చంద్రబాబు...ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయనకు సూచించారు. భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పాత విషయాలను గుర్తుచేసుకున్నారు. నాలుగవసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబును చూడడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని నాగం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలి...తెలుగు ప్రజలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలనేదే తన అభిమతమని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు.

23న ప్రపంచ కవితా దినోత్సవ సభ

హైదరాబాద్: కవి సంధ్య, నెల్లూరులోని చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ సంయుక్త అధ్వర్యంలో ఈనెల 23న ప్రపంచ కవితా దినోత్సవ సభ జరగనుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలోని కమిటీ హాలులో ఆదివారం సాయంత్రం 5 గంటలకు రచయిత సుధామ అధ్యక్షతన కవి సమ్మేళనం జరుగుతుంది. అనంతరం రచయిత శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో కవిత్వం-ప్రయోజనం అంశంపై దర్భశయనం శ్రీనివాసచార్య ప్రత్యేకంగా ప్రసంగిస్తారు. ఆపై కవితల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య ఎన్.గోపి, గౌరవ అతిథులుగా ఓల్గా, దీర్ఘాశి విజయ్ భాస్కర్, మామిడి హరి కృష్ణ, ఏనుగు నరసింహారెడ్డి, కొప్పర్తి, ప్రసాద మూర్తి, యాకూబ్, కోడూరి విజయ్ కుమార్, కోయి కోటేశ్వర రావు, చిన్ని నారాయణ రావు పాల్గొంటారు.

పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తా

చంద్రబాబుతో భేటీలో సతీశ్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటునకు తన వంతు సహకారాన్ని అందిస్తానని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, డాక్టర్ జి.సతీశ్ రెడ్డి అన్నారు. ఆయన గురువారం సచివాలయంలో ముఖ్యంంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 50మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేలా సహకరిస్తానని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్రంలో ఉన్న అవకాశాలు, ముఖ్యంగా రక్షణ రంగ పరిశ్రమలు నెలకొల్పడంపై ముఖ్యమంత్రికి సతీశ్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తే స్వాగతిస్తామని సీఎం చెప్పారు. అవసరమైన అనుమతులు, మౌలిక వసతులు, భూముల కేటాయింపులను సత్వరమే చేపడతామని హామీనిచ్చారు.

భూ కుంభకోణాలపై రభస

- పరస్పర నిందలతో వేడెక్కిన మండలి
- మంత్రి అనగాని-బొత్స వాగ్యుద్ధం
- వైసీపీ సభ్యుల వాకౌట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భూకుంభకోణాలపై శాసనమండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల నడుమ వాడీవేడీ చర్చ జరిగింది. గురువారం ప్రశ్నోత్తరాల అనంతరం 2019-24 మధ్య కాలంలో జరిగిన భూకుంభకోణాలపై జరిగిన లఘు చర్చకు చైర్మన్ అనుమతించారు. 2014-2019 మధ్య జరిగిన కుంభకోణాలపైనా చర్చించాలని వైసీపీ సభ్యులు పట్టుపట్టడంతో పరస్పర విమర్శలతో మండలి వేడెక్కింది. శాసన మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ముఖ్యంగా హౌసింగ్, మద్యం, రెవెన్యూ, పోర్టుల్లో అడ్డూ అదుపులేని దోపిడికి పాల్పడ్డారని ధ్వజ మెత్తారు. భీమిలిలో విశాఖ ఎంపీ విజయసాయిరెడ్డి 650 ఎకరాల భూమిని కబ్జా చేశారని, అన్నమయ్య, నంద్యాల, తిరుపతి, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఎక్కువగా అసైన్డ్ భూములు కబ్జాకు గురయ్యయని ఆమె మాట్లాడారు. దానిపై వైసీపీ ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ.. 2014-19 మధ్య కాలంలో చాలా పెద్ద కుంభ కోణాలు జరిగాయని ఆయన వివరిస్తూ... అమరావతి ప్రాంతంలోని దళితుల భూములు ఆక్రమించారన్నారు. మరో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ, 2019-24 మధ్య కాలంలో 17 మెడికల్ కాలేజీలు ప్రభుత్వం ఆధ్వర్యంలో నడపాలని మంజూరు చేయడం స్కామా? అని ప్రశ్నించారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, 2019-24 మధ్య కాలంలో సచివాలం లోని 32 శాఖల్లో అవినీతి, కుంభకోణం జరగని శాఖంటూ లేదన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పేరుతో వేల కోట్లు దోపిడీకి పాల్పడ్డారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డు తయారీ, టికెట్ల అమ్మకాలలోను కుంభకోణాలు జరిగాయన్నారు. అటవీ భూములు, పేదవారి భూములు అని తేడా లేకుండా ఇష్టాను సారంగా అక్రమణలకు పాల్పడ్డారన్నారు. దీంతో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అడ్డుతగులుతూ... ఇన్ని ఆరోపణలు చేస్తున్నవారు గత 10 నెలల్లో ఒక్కటంటే ఒక్క ఆధారం సైతం చూపలేకపోయారని, నివేదికలు ఇవ్వకుండా... మాపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు నిర్దిష్ట సమాధానాలు రావడం లేదని ఆరోపించారు. 2019 నుంచి జరిగిన స్కామ్‌లపై మాట్లాడాలని అధికార పక్షం కోరిందని, అదే సమయంలో తాము 2014 నుంచి మాట్లాడాలని అడిగామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రిని భూ బకాసరుడు అని మాట్లాడటం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. విశాఖ భూములపై సిట్ విచారణ నివేదికలు బయటపెట్టాలని, నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని సూచించారు. అనంతరం మండలి నుంచి వైసీపీ సభ్యులు వాకౌట్ చేశారు. ఈనెల 17వ తేదీ సోమవారం నాటికి మండలిని చైర్మన్ వాయిదా వేశారు.

సామాజిక పెన్షన్ల కోతపై రగడ

ప్రశ్నోత్తరాల సమయంలో సామాజిక పెన్షన్ల కోతపై అధికార, విపక్షాల మధ్య రగడ చోటు చేసుకుంది. వైసీపీ సభ్యులు తోట త్రిమూర్తులు, రమేశ్ యాదవ్ , మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ... వివిధ కారణాలతో కూటమి ప్రభుత్వం పెన్షన్లను రెండు లక్షలమేర తగ్గించిందని, దివ్యాంగుల పెన్షన్లను కూడా కుదించేశారని చెప్పారు. వైసీపీ హయాంలో ఐదేళ్లల్లో 13 లక్షల కొత్త పెన్షన్లు ఇచ్చామని, కూటమి కొత్తవి ఇవ్వకపోగా... ఉన్నవాటిని తొలగిస్తోందన్నారు. పెన్షన్ల తొలగింపులో ఏ విధానాలు పాటిస్తున్నారో తెలపాలని ప్రశ్నించారు. దీనిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బదులిస్తూ, పెన్షన్లు ఇచ్చిందే ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. పెన్షన్లు 200 నుంచి 1000, 1000 నుండి 2000, 3000 నుంచి 4000 రూపాయలకు పెంచింది టీడీపీ ప్రభుత్వమే అని వివరించారు. 13 శాతం జనాభాకు పెన్షన్ అందిస్తున్నామన్నారు. 2019 నుంచి 2024 వరకూ 24 లక్షల పెన్షన్లు తగ్గించారన్నారు. రెండు లక్షల పెన్షన్లు తగ్గించామనడంలో వాస్తవం లేదన్నారు. గత ప్రభుత్వంలో అనర్హులకి పెన్షన్లు ఇచ్చారన్నారు. హెల్త్ పెన్షన్‌కు ఎప్పుడైనా అర్జీ పెట్టుకోవచ్చని తెలిపారు. కడప జిల్లాలో 3000పైగా దివ్యాంగుల పెన్షన్లున్నాయని, కలెక్టర్ వెరిఫై చేస్తే కేవలం 1300 మంది మాత్రమే అర్హులని తేలిందని మంత్రి కొండపల్లి చెప్పారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన ఇక ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారంటూ వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ప్రశ్నించారు. దాదాపు కోటి మందికి పైగా లబ్ధిదారులు ఉన్నారని, ఏడాదికి రూ.32వేల కోట్ల నిధులు అవసరం అవుతాయని పేర్కొన్నారు. దీనిపై మంత్రి కొండపల్లి సమాధానమిస్తూ... ఆడబిడ్డ నిధి బడ్జెట్ కోసం ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నామన్నారు.

కాంగ్రెస్, బీజేపీ కమీషన్ల రగడ

మీరు 40 శాతమంటే...మీరు 60 శాతమంటూ విమర్శలు

బెంగళూరు: కర్నాటకలో కాంగ్రెస్, బీజేపీ మధ్య కమీషన్ల యుద్ధం తీవ్రరూపం దాల్చింది. ఆరోపణలు, ప్రత్యారోపణలు పెరిగాయి. గత బీజేపీ ప్రభుత్వంపై వచ్చిన 40 శాతం కమీషన్ ఆరోపణలపై జస్టిస్ హెచ్ఎన్ నాగమోహన్ దాస్ కమిషన్ దర్యాప్తు సాగించింది. నివేదికను సీఎం సిద్దరామయ్యకు కమిషన్ సమర్పించింది. దీంతో రాష్ట్రంలో రెండు పార్టీల మధ్య పరిస్థితి మరింత ఘర్షణాత్మకంగా మారింది. కమీషన్లకు సంబంధించి కాంగ్రెస్‌పై బీజేపీ పోస్టర్ యుద్ధం మొదలు పెట్టింది. సిద్దరామయ్య సర్కార్ 60 శాతం కమీషన్ తీసుకుంటున్నట్లు ఆరోపించింది. 'రేయింబవళ్లు దోచేయండి... 60 శాతం కమీషన్' అంటూ సిద్దరామయ్య ఫొటోతో పోస్టర్‌ను 'ఎక్స్'లో పెట్టి బీజేపీ దుమారం రేపింది. కాగా, 40 శాతం కమీషన్లపై దర్యాప్తు పారదర్శకంగా సాగాలని, నివేదికను చట్టసభకు సమర్పించాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం హుబ్బాలీలో విలేకరులతో అన్నారు. దర్యాప్తుపై ప్రశ్నకు 'నోటీసులు ఎవరికైనా ఇచ్చారా? ముందు నిందితులకు నోటీసులు ఇవ్వాలి' అని అన్నారు. నోటీసులు అందాక స్పందిస్తాం. డొల్ల బెదిరింపులకు భయపడేది లేదని ఆయనన్నారు. రాష్ట్ర మంత్రి లక్ష్మి హెబ్బాల్కర్ స్పందిస్తూ బీజేపీకి ఆరోపణలు చేసే స్వేచ్ఛ ఉన్నదని, కానీ జస్టిస్ దాస్ కమిషన్ నివేదికలో బీజేపీ 40 శాతం కమీషన్లు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారం కేబినెట్‌లో చర్చకు రానున్నట్లు చెప్పారు. రామనామం జపిస్తారు కానీ రావణుడిలా పనిచేస్తారంటూ బీజేపీని మంత్రి దుయ్యబట్టారు. వాస్తవిక అంశాలు లేక, నిరాధార ఆరోపణలతో బీజేపీ నేతలు పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. 'మాకు 40 శాతం, 60 శాతం లూటీల గురించి తెలియదు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి పనిచేస్తున్నాం. ఇంటి వద్దకే సేవలు అందుతాయని ఇచ్చిన ఐదు హామీల అమలుకు ప్రయత్నిస్తున్నాం. బీజేపీ ఆరోపణలను పట్టించుకునేంత తీరిక లేదు' అని మంత్రి వ్యాఖ్యానించారు. ఇదిలాఉంటే, రాష్ట్ర కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఆరోపణల ఆధారంగా జస్టిస్ దాస్ నేతృత్వంలోని దర్యాప్తు కమిషన్ 20 వేల పేజీల నివేదికను సీఎం సిద్దరామయ్యకు సమర్పించింది. ప్రభుత్వ ఒప్పందాల్లో 40 శాతానికిపైగా కమీషన్ తీసుకున్నట్లు కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఫిర్యాదులపై దాస్ కమిషన్ దర్యాప్తు చేసింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులనూ పరిగణనలోకి తీసుకున్నది. అన్ని జిల్లాలు, వివిధ రకాల ప్రాజెక్టులు, భిన్న బడ్జెట్ కేటాయింపుల ఆధారంగా దర్యాప్తు కొనసాగించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.